


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ | 28-07-2026 మంగళవారం | సంపుటి : 11 | సంచిక : 41 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur
Follow us on




# 27 లక్షల మందికి 'అల్పాహారం'



## విద్యార్థుల ఆకలి తీర్చే చారిత్రక ఘట్టం

## వచ్చే 3 నెలల్లో పాఠశాలలన్నింటికీ విస్తరణ

## మానవ వనరులే రాష్ట్రానికి అసలైన సంపద

## ఏ ఒక్క బిడ్డా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదు

### సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం విస్తరణ!
### పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకం ప్రారంభం

**ఖమ్మం, జూలై 27 (వుదయం) :** రాష్ట్రంలో పుట్టిన ఏ ఒక్క బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉచిత అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర పర్యటనలో భాగంగా, మార్కెట్ యార్డ్‌లో 'హరేరామ హరేకృష్ణ' ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కిచెన్‌ను ఆయన ప్రారంభించారు.అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి, వారితో కలిసి కూర్చుని తిన్నారు.27 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దాదాపు 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన రుచికరమైన అల్పాహారాన్ని అందించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే మూడు నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ పథకాన్ని సంపూర్ణంగా విస్తరింపజేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మానవ వనరుల వికాసమే నిజమైన అభివృద్ధికేవలం రోడ్లు, పరిశ్రమల ఏర్పాటు మాత్రమే అభివృద్ధి కాదని, మానవ వనరులను తీర్చిదిద్దడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.పోషకాహార భద్రత: పిల్లలు చిన్ననాటి నుంచే ఆరోగ్యంగా, మేధస్సుతో ఎదిగేలా ఉదయం పూట శుచి, శుభ్రతతో కూడిన న్యూట్రీషియస్ అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించామని చెప్పారు.మానవ వనరుల తయారీ: తెలంగాణ నుంచి రూపుదిద్దుకునే విద్యార్థులు రాబోయే రోజుల్లో దేశానికి, ప్రపంచానికే దిశా నిర్దేశం చేసే వజ్రాల్లా తయారు కావాలనేదే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఈ-20 పెట్రోల్‌పై డీప్‌ఫేక్ దండయాత్ర



**ముంబై , జూలై 27 (ఎఎంస్) :** 20 శాతం ఇథనాల్ కలిపిన 'ఈ20' (E20) పెట్రోల్ వినియోగం ద్వారా తన కుటుంబం అనుచితంగా లబ్ధి పొందుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారం, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన పరువుకు భంగం కలిగించేలా ఆన్‌లైన్‌లో అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన ఉన్నత న్యాయస్థానం.. ఇటువంటి కంటెంట్‌ను వ్యాప్తి చేసేందుకు వేదికగా నిలిచిన 'మెటా'తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సివిల్ దావా వేసేందుకు గడ్కరీకి అనుమతి ఇచ్చింది.ఈ20 ఇంధన కార్యక్రమానికి సంబంధించి కేంద్రమంత్రిపై దుష్ప్రచారం చేశారన్న ఆరోపణలపై నాగ్‌పూర్ పోలీసులు నలుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన రెండు వారాల వ్యవధిలోనే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కేసు నమోదైన వారిలో ప్రముఖ యూట్యూబర్, రాజకీయవేత్త మనీష్ కశ్యప్‌తో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్లు హర్షిత్ రాఠీ, అంక్లేష్ ఇన్వతీ ఉన్నారు. అదంతా 'పెయిడ్ క్యాంపెయిన్'.. రైతులకు మేలు చేసే ప్రాజెక్టు!దేశంలో పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ కలపడం ద్వారా వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న విమర్శలను నితిన్ గడ్కరీ గట్టిగా తిప్పికొట్టారు.ఆర్థిక భారానికి కట్టడి: భారత్ ఏటా ఇంధన దిగుమతుల కోసమే ఏకంగా రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, ఇథనాల్ వాడకం వల్ల దేశీయ విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని స్పష్టం చేశారు.రైతులకు అదనపు రాబడి: ఇథనాల్ తయారీ ప్రోత్సాహం వల్ల దేశంలోని అన్నదాతలకు సుమారు రూ. 45 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు.సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ విమర్శలన్నీ కావాలని నడిపిస్తున్న 'పెయిడ్ క్యాంపెయిన్' మాత్రమేనని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని గడ్కరీ తేల్చి చెప్పారు.

# 'మా పెద్దిని కాపాడండి' కేసీఆర్

- పెద్ది కుటుంబానికి కేసీఆర్ కొండంత అభయం
- ఐసీయూలో చికిత్సను పరిశీలించిన కేసీఆర్




**హైదరాబాద్, జూలై 27 (వుదయం) :** సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆ పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. శనివారం ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్.. నేరుగా ఐసీయూ వార్డుకు చేరుకుని, వైద్యులతో కలిసి దాదాపు అరగంట సేపు పెద్ది ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న చికిత్సా విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు."ఏం చేస్తారో చేయండి.. మా పెద్దిని కాపాడండి"అని వైద్యులకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు. అనంతరం పెద్ది భార్య స్వప్న, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని, కొండంత అభయాన్ని అందించారు. పెద్ది ప్రాణాలు కాపాడుకోవడానికి పార్టీ తరఫున ఎంత ఖర్చుకైనా వెనకాడేది లేదని, అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని భరోసానిచ్చారు.మరో 48 గంటలు కీలకమన్న వైద్యులుపెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత వైద్యం అందిస్తున్నట్లు యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీలు ఏఎస్ రావు, జేఎస్ రావు తెలిపారు. వైద్య నిపుణుల సలహాలు: అమెరికా సహా వివిధ విదేశీ నిపుణులైన డాక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.ఆరోగ్య పరిస్థితి: ప్రస్తుతం ఆయన గుండె, ఊపిరితిత్తులు సహా మిగతా అవయవాలన్నీ మెరుగ్గానే పనిచేస్తున్నాయని, అయితే బ్రెయిన్ పునరుత్తేజం చెందేందుకు మరో 48 గంటల సమయం పట్టే అవకాశం ఉందని వివరించారు.దాదాపు 45 నిమిషాల పాటు ఆస్పత్రిలోనే ఉన్న కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ తదితర పార్టీ కీలక నేతలు ఉన్నారు.

# 'గార్డియన్స్ ఆఫ్ ద వరల్డ్': ట్రంప్

- 'ఖర్గ్' చమురు టెర్మినల్‌పై దాడి దృశ్యాలను షేర్ చేసిన అమెరికా అధ్యక్షుడు
- పోరాటం నాడే.. సైనిక చర్య సంకేతాలా?





**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో ఇప్పటికే తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వరుస పోస్టులు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తన సొంత ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' (Truth Social) ఖాతాలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కృత్రిమ మేధ (AI) చిత్రాలను ఆయన షేర్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది.'గార్డియన్స్ ఆఫ్ ద వరల్డ్'.. చమురు టెర్మినల్‌పై దాడులుట్రంప్ పంచుకున్న ఏఐ ఫొటోల్లో ప్రధానంగా మూడు చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షించాయి:ప్రపంచ రక్షకుడిగా ట్రంప్: "గార్డియన్స్ ఆఫ్ ద వరల్డ్" పేరుతో ఉన్న తొలి ఫొటోలో ట్రంప్ ప్రపంచాన్ని పర్యవేక్షిస్తున్నట్లు కనిపించగా.. ముందు భాగంలో అమెరికా యుద్ధ విమానాలు ఎగురుతూ, ఇరువైపులా ఇరాన్‌పై భారీ పేలుళ్లు, మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు ఉన్నాయి. ఖర్గ్ ద్వీపంపై బాంబుల వర్షం: "స్ట్రైక్ ఆన్ ఖర్గ్" అనే మరో చిత్రంలో ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ద్వీపంలోని టెర్మినల్‌పై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు చూపించారు. చమురు ట్యాంకులు పేలిపోయి అగ్నికీలలు ఎగసిపడటం ఇందులో స్పష్టంగా కనిపించింది. ఇరాన్ ట్యాంకర్ స్వాధీనం: "ఇట్స్ అవర్ ఆయిల్ ట్యాంకర్ నౌ" అనే మూడో చిత్రంలో ఇరాన్ చమురు నౌకపై అమెరికా జెండాతో ట్రంప్, ఆయుధాలతో సైనికులు నిలబడి ఉండగా, ఇరాన్ సిబ్బంది




# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తీవ్ర ఎదురుదెబ్బ



## రంగనాథ్ స్థానంలో మరొకరి నియమకం



**హైదరాబాద్, జూలై 27 (వుదయం) :** హైదరాబాద్:హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (HYDRA) కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ధిక్కరిస్తున్నారన్న కారణంతో ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తక్షణమే తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (CS)ని హైకోర్టు ఆదేశించింది. రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని స్పష్టం చేసింది.మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట వద్ద ఉన్న భూములకు సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైడ్రా సిబ్బంది ఉల్లంఘించారంటూ 'శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహంరంగనాథ్‌పై ఇప్పటికే ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.కోర్టుల పట్ల బాధ్యత: రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ కోర్టులను ఆశ్రయించే హక్కు ఉందనే విషయాన్ని గుర్తుచేసిన న్యాయస్థానం, బాధ్యతాయుతమైన ఐపీఎస్ అధికారిగా ఉంటూ కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ఉల్లంఘించడం ఏమాత్రం సరికాదని ఆక్షేపించింది.ఆదేశాలు తుంగలో తొక్కడమే: శాంతా శ్రీరాం సంస్థకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించడం కోర్టును ధిక్కరించడమేనని స్పష్టం చేసింది. ఒకే అంశంపై పదేపదే కోర్టు ఉత్తర్వులను తప్పుదోవ పట్టించడం నేరమని పేర్కొంటూ రంగనాథ్‌ను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.అఫిడవిట్‌లో క్షమాపణలు చెప్పినా తగ్గని తీవ్రతఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (AG) జోక్యం చేసుకుంటూ విచారణకు సమయం కోరగా, రంగనాథ్ కోర్టుకు క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ దాఖలు చేశారు. న్యాయస్థానాల పట్ల తనకు అత్యున్నత గౌరవం ఉందని, లోతుకుంటలోని సర్వే నంబర్ 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా వెళ్లలేదని అఫిడవిట్‌లో వివరణ ఇచ్చారు. అయితే, ఒక ఉన్నతాధికారిపై ఏకంగా 63 ధిక్కరణ కేసులు ఉండటానికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించిన హైకోర్టు.. రంగనాథ్‌ను ఆ స్థానం నుంచి వెంటనే తొలగించాల్సిందేనని ప్రభుత్వానికి తుది ఆదేశాలు జారీ చేసింది.





# దౌల్తాబాద్‌లో అత్యాధునిక కర్ల్ ఫిట్నెస్ జిమ్ ప్రారంభం"

- **ప్రారంభించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి – ఆరోగ్యానికి వ్యాయామమే ఉత్తమ మార్గమని సూచన**

**దౌల్తాబాద్, జూలై 27 (వుదయం):**

దౌల్తాబాద్ కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కర్ల్ ఫిట్నెస్ జిమ్ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం సంయుక్తంగా ప్రారంభించారు. జిమ్‌ను పరిశీలించిన వారు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యాయామ పరికరాలను వీక్షించి నిర్వాహకులను అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం ఎంతో అవసరమని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఫిట్నెస్‌తో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధునిక ఫిట్నెస్ కేంద్రాలు ఏర్పాటవడం వల్ల యువతలో ఆరోగ్య చైతన్యం పెరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిమ్ నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, యువకులు, క్రీడాభిమానులు, జిమ్ నిర్వాహకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపయోగంగా యాలాల బస్టాండ్

- **పిచ్చిముక్కలతో నిండుకున్న బస్టాండ్ ఆవరణ**
- **ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు**

**యాలాల జులై 27 వుదయం ప్రతినిధి:-**

ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్ నిరుపయోగ మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగ మరి ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. యాలాల మండల కేంద్రంలో 1989 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ తెలుగు గ్రామీణ క్రాంతి పథకం కింద బస్టాండ్ ను నిర్మాణం చేపట్టారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. 1989 అప్పటినుండి బస్టాండ్ లో బస్సు ప్రయాణించేవి. గత కొన్నాళ్లుగా ఆర్టీసీ అధికారులు పట్టించకపోవడంతో బస్టాండ్ నిరుపయోగం మారింది. గత కొన్ని రోజుల క్రితం బస్టాండ్ పునరుద్ధరించాలని తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. మరమ్మతు చేపట్టిన తర్వాత ఒకటి రెండు రోజులు బస్సులు బస్టాండ్ లో నుండి బస్సులు వచ్చిపోయేవి. మండల కేంద్రంలోని బస్టాండ్ లో చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలు ప్రయాణాలు జరిగేవి. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో బస్టాండ్ లోపలికి బస్సులు రావడం లేదు. ప్రయాణికులు రోడ్ల వైపు నిలిచి బస్సు ఎక్కి ప్రయాణాలు చేస్తున్నారు. ఈ బస్టాండ్ నుండి కొత్తూరు, గోరేపల్లి దేవనూరు, విశ్వనాథ్ పూర్, సంగం కుర్దు, తదితర గ్రామాలకు ప్రజలు బస్సులు ప్రయాణం చేస్తుంటాయి. ఈ బస్టాండ్ సమీపంలో మండల కేంద్రం సంబంధించిన వివిధ పాఠశాల విద్యార్థులు వందల సంఖ్యలో వివిధ గ్రామాలకు ప్రయాణం చేస్తుంటారు. బస్టాండు నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు విద్యార్థులు, వర్షానికి, ఎండకు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో బస్టాండ్ ముందే ఉన్న వైన్స్ లో మద్యం కొనుగోలు చేసిన మద్యం ప్రియులకు పర్మిట్ రూముగా మారింది. బస్టాండ్ ముందు వైన్స్ ఉండడంతో ప్రయాణికులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగ మారిన కారణంగా ప్రయాణికులు వివిధ రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ వాడుకలో లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ పిచ్చిముక్కలతో నిండిపోయింది. ఈ బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఆర్టీసీ అధికారులు లక్షలు ఖర్చు చేసి నిర్మించిన బస్టాండ్ ను పట్టించుకోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ని వాడుకలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఐజలో ప్రైవేట్ బళ్ల ఆగడాలకు అడ్డుకట్ట!



- **సెలవు రోజునా బడిబాటా?.. విద్యాశాఖ తీవ్ర ఆగ్రహం!**
- **నిబంధనలు తొక్కేసిన యాజమాన్యాలకు ఊహించని షాక్.. వివరణ కోరుతూ ఆదేశాలు**
- **విద్యార్థుల నెత్తురు పిండుతున్న మార్కుల వేటపై పిడిఎస్ యు సమరశంఖం!**

**ఐజ, జూలై 27 (వుదయం కరస్పాండెంట్):**

కనీస విశ్రాంతి లేకుండా పిన్న వయస్కులను యంత్రాలుగా మార్చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల నిరంకుశ వైఖరిపై విద్యా శాఖ ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ నియమావళిని బొందపెట్టి, ఆదివారం కూడా తరగతుల పేరిట బడులు తెరిచి విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తున్న పలు యాజమాన్యాల ఆటకట్టించేందుకు అధికారులు కదం తొక్కారు. ఐజ మండలంలో చట్టాల్ని తుంగలో తొక్కి సాగిస్తున్న ఈ దారుణంపై మండల విద్యాధికారి తీవ్రంగా స్పందిస్తూ సంబంధిత పాఠశాల యాజమాన్యాలకు తుది హెచ్చరికలతో కూడిన ఆదేశ పత్రాలను జారీ చేశారు. మార్కుల వేటలో మానసిక హింస! వారాంతపు సెలవు రోజుల్లో బడిపిల్లలకు స్వేచ్ఛను, ప్రశాంతతను అందించాల్సింది పోయి, గడప దాటనీయకుండా నరకం చూపిస్తుండటంపై సర్వత్రా నిరసనజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు హోలీంపాష ప్రత్యక్షంగా రణరంగంలోకి దిగి, అధికారులకు ఆధారాలతో సహా పట్టివ్వడంతో యంత్రాంగం నివ్వెరపోయింది. పరిశీలనలో యాజమాన్యాల అక్రమాలు బహిర్గతం కావడంతో వెంటనే గడువుతో కూడిన వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. పరిమితి దాటితే గుర్తింపు రద్దే!

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు గర్జించారు. వ్యాపార మోజులో విద్యార్థుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'సెలవు దినాల్లో తరగతులు నడపడం చట్టరీత్యా నేరం. పిల్లలను నిరంతరం రాచిరంపాన పెడితే వారి భవిష్యత్తు నాశనమవుతుంది" అని నిప్పులు చెరిగారు. జిల్లా వ్యాప్తంగా బళ్ల ఆగడాలపై నిరంతర నిఘా ఉంచుతామని, మాటకు వినని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయించే వరకు ఈ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు.



# ఇదేం న్యాయం కలెక్టర్ గారూ

- **పేదల ఇళ్లు భవంతులున్నోళ్లకా?**
- **గోనుపాడు డబుల్ ఇళ్ల పంపిణీలో 'పెద్దల' హస్తం!**
- **ప్రజావాణిలో వినతుల వెల్లువ.. విచారణకు డిమాండ్**
- **బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామన్న బాధితులు**

**గద్వాల, జూలై 27 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అధికారుల ఉదాసీనత, స్థానిక నేతల దందా బట్టబయలైంది. అర్హులైన పేదలను నడిరోడ్డున పడేసి, ఇళ్లు ఉన్న అనర్హులకే మళ్లీ 'డబుల్' ఇళ్లు కట్టబెట్టడంపై గోనుపాడులో ప్రజా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అర్హుల ఎంపికలో భారీగా అవకతవకలు జరిగాయంటూ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణికి బాధితులు భారీగా తరలివచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందే! ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన ఇళ్లలో తలదాచుకుంటున్నాం.. నిజమైన అర్హులమైన మాకు మొండిచేయి, సొంతిళ్లు ఉన్నవారికి ఎలా కేటాయిస్తారు?" అని బాధితులు అధికారులను నేరుగా నిలదీశారు. పొలిటికల్ రికమెండేషన్లతో జరిగిన ఈ అక్రమ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

# నిండుగా కృష్ణమ్మ.. ఎండిపోతున్న నడిగడ్డ!

- **జూరాల పారుతోంది.. నెట్టెంపాడు ఎండుతోంది!**
- **వరద ఉప్పెనలా వస్తున్నా కదలని మోటార్లు.. ప్రభుత్వ ద్రోహాన్ని నిలదీసిన బాసు హనుమంతు నాయుడు**
- **ఎగువ నుంచి 27,500 క్యూసెక్కులు.. రేపో మాపో గేట్లు ఎత్తేందుకు సన్నాహాలు**
- **కళ్లముందే జలాలు సముద్రంపాలు.. ఖాళీగా గూడెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లు**
- **తెలంగాణ నీటి హక్కులు పక్క రాష్ట్రానికి ధారపోస్తారా? నడిగడ్డ రైతాంగాన్ని నట్టేట ముంచుతారా?**

**గద్వాల, జూలై 27 (వుదయం బ్యూరో):**

ఎగువన కృష్ణమ్మ కదంతొక్కుతోంది.. జూరాల వద్ద జలపాతంలా ఉప్పొంగుతోంది.. కానీ నడిగడ్డ రైతు కడుపు మాత్రం నకనకలాడుతోంది! పక్కనే నీళ్లు పొంగిపొర్లుతున్నా నెట్టెంపాడు ఎత్తిపోతల మోటార్ల స్విచ్ ఆన్ చేసేందుకు ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. పాలకుల నిద్రావస్థ, అధికారుల నేరపూరిత నిర్లక్ష్యం వల్ల సమృద్ధిగా ఉన్న వరద నీరంతా వృథాగా సముద్రం పాలవుతోందని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు నిప్పులు చెరిగారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

కళ్లముందే కొట్టుకుపోతున్న నీళ్లు.. నిశ్చేష్టంగా ప్రభుత్వం! జూరాల ప్రాజెక్టుకు ప్రస్తుతం 27,500 క్యూసెక్కుల మేర భారీ ఇన్‌ఫ్లో నమోదవుతోంది. జలాశయంలో నీటి మట్టం ఇప్పటికే 7.2 టీఎంసీల గరిష్ఠ స్థాయికి చేరుకో



వడంతో అధికారులు ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తి దిగువకు నీటిని గుమ్మరించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు వరద పారుతుంటే, పక్కనే ఉన్న నెట్టెంపాడు పంపులను ఆన్ చేయకపోవడం ముమ్మాటికీ నడిగడ్డ రైతాంగానికి ప్రభుత్వం చేస్తున్న ద్రోహమేనని మండిపడ్డారు. వరద ఉన్నప్పుడే ఎత్తిపోయకుంటే, రేపు ఎండ కాలంలో రైతుల గొంతులో మట్టి కొడతారా అని నిలదీశారు. పక్క రాష్ట్రం పండటానికి.. మన పొలాలు ఎండాలా? మన వాటా నీటిని ఎత్తిపోసి మన రిజర్వాయర్లలో నిల్వ చేయకుండా దిగువకు వదిలేయడం వెనుక ఉన్న గుప్తఎజెండా ఏమిటని హనుమంతు నాయుడు తీవ్రంగా ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్నారా అని అనుమానం వ్యక్తం చేశారు. మన ప్రాజెక్టులను ఎండబెట్టి, దిగువ రాష్ట్రానికి పసిడి పంటలు పండించే కుట్రలో భాగమే ఈ మోటార్ల నిలిపివేత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన మోటార్లు ఆన్ చేయండి! తక్షణమే నెట్టెంపాడు ఎత్తిపోతల మోటార్లను ప్రారంభించి, గూడెందొడ్డి (1.2 టీఎంసీలు), ర్యాలంపాడు (4 టీఎంసీలు) రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. అలాగే జూరాల కుడి కాలువ ద్వారా చివరి ఆయకట్టు దాకా సాగునీరు పారించాలని, లేనిపక్షంలో నడిగడ్డ రైతులను ఏకం చేసి ప్రభుత్వాన్ని, ప్రాజెక్టు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.



# తక్కువ నీరు ఎక్కువ లాభం

- **వ్యవసాయ శాఖ అధికారి లావణ్య**

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 27....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారి లావణ్య ఆధ్వర్యంలో .రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వ తేదీ వరకు శివంపేట దొంతి రైతు వేదికల్లో విత్తన మేళా.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ఈ విత్తన మేళా యొక్క ముఖ్య ఉద్దేశం అని.తక్కువ నీరు - ఎక్కువ లాభం ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని సూచించారు.రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని సూచించారు. అందుబాటులో ఉన్న విత్తనాలు కంది. ఆముదము. మొక్కజొన్న. కూరగాయల బెండ. బీరా. ఆకుకూరలు. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు. ఏ ఈ ఓ లు. పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ప్రజావాణిలో 54 దరఖాస్తులు



- **ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు**
- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్‌కర్నూల్, జులై 27 (వుదయం బ్యూరో) :**

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చే వేదికగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ స్వయంగా వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 54 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ ప్రతి దరఖాస్తును పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం కేవలం దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మాత్రమే కాదని, ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపే బాధ్యతాయుతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వస్తున్నందున, అధికారులు ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా నిర్లక్ష్యానికి గురికాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించగల ప్రతి ఫిర్యాదును పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని, శాఖల మధ్య సమన్వయంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

ఏదైనా కారణాల వల్ల పరిష్కరించడం సాధ్యం కాని ఫిర్యాదుల విషయంలో కూడా సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన కారణాలను పేర్కొంటూ లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సరైన సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత అని తెలిపారు.

శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిన్నయ్య, దేవసహాయం, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులకు 3 రోజుల FLN శిక్షణ ప్రారంభం

- **విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలపై దృష్టి**
- **M.E.O తిరుపతయ్య ప్రారంభించి సూచనలు**

**బిజినపల్లి, జులై 27 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అవసరమని మండల విద్యాధికారి టి. తిరుపతయ్య పేర్కొన్నారు.బిజినపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 3 రోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.లక్ష్యాల సాధనలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, రెమిడియేషన్ పద్ధతుల ద్వారా వాటిని అధిగమించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.శిక్షణలో నేర్చే కొత్త బోధనా పద్ధతులు, ఆటల ఆధారిత అభ్యాసం, TLM వినియోగాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో 100% ఫలితాలు సాధించేలా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గా రాజు, భీమయ్య, మల్లేష్, మధు వ్యవహరిస్తున్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతున్నారు.

# కనీస సౌకర్యాలకు నోచుకోని ప్రభుత్వ ఆసుపత్రులు



- **మెరుగైన వైద్యం కోసం సిపిఎం ధర్నా**

**నారాయణపేట టౌన్, జూలై 27(వుదయం ప్రతినిధి):**

ప్రజలకు మెరుగైన వైద్యం అ దుకోవడం అగమ్యగోచరంగా మారిందని నారాయణపేట జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కొరవడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రాంరెడ్డి విమర్శించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు దగ్గర ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ధర్నాలో ఆయన ప్రసంగిస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఆసుపత్రి జిల్లా మెడికల్ కాలేజీ 97 మంది డాక్టర్లతో నడవాల్సి ఉండగా కేవలం 30 మంది వైద్యులతో మాత్రమే నడుస్తున్నదన్నారు. దీనివలన రోజు వారిగా వస్తున్న ఓపి పేషెంట్స్ ఎనిమిది వందల నుండి 1100 మందికి ఓపి పేషెంట్స్ కు వైద్య విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వైద్య డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ అందించాలని అలా అందిస్తేనే మారుమూల ప్రాంతమైన నారాయణపేటలో డాక్టర్లు పనిచేయడానికి ముందుకు వస్తారని తెలిపారు .జిల్లా మెడికల్ కాలేజీకి సొంత భవనం లేక జిల్లా ఆస్పత్రి భవనాలలోనే నడుస్తున్నదని మెడికల్ కాలేజీకి సొంత భవనాన్ని వెంటనే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు తదితర వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కేటాయించి మారుమూల ప్రాంతంలో నారాయణపేట జిల్లా ప్రజలను మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బి .బలరాం పుంజనం ఆంజనేయులు మాట్లాడుతూ

మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రముకు పెద్ద భవనం ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది లేరని రోజుకు 500 మంది హాస్పిటల్ కు రోగులు వస్తున్నారని వారికి సరైన వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తపల్లి ప్రాథమిక పల్లె దావాఖానాలో డాక్టర్ లేదని ఫార్మాసిస్టు పోస్టు ఖాళీ ఉందని కేవలం ఆశ వర్కర్ తో నడుస్తుందన్నారు. ఇది సీఎం నియోజకవర్గంలో ఉండడం శోచనీయమన్నారు.కోటకొండ మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంచినీటి సౌకర్యం లేదని సరిపడ గదులు లేవని మీటింగ్ హాలు స్టాఫ్ కు వెయిటింగ్ హాల్ లేవని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిధులు మూడు సంవత్సరాలు నుండి రాక కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు . అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని కలెక్టర్ ప్రియాంకకి అందజేశారు.

కలెక్టర్ సిపిఎం బృందంతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో నెలకొన్న సమస్యలపై చర్చిస్తున్నామని పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని సరిపడు డాక్టర్లు కేటాయించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గోవింద్ రాజ్ ,జోషి కే కాశప్ప, నరహరి,అరుణ్,దేవప్ప సిపిఎం సోషల్ మీడియా నారాయణపేట పట్టణ కన్వీనర్ సోఫీ మజార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# లేడీస్ కాలేజ్'లో అధ్యాపక పోస్టుల భర్తీకి కౌంట్ డౌన్!

- **నేడే గద్వాల ఎం.ఏ.ఎల్.డి కాలేజీలో ఇంటర్వ్యూలు**

**గద్వాల, జూలై 03 (వుదయం బ్యూరో):**



ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో బోధనా విభాగాన్ని బలోపేతం చేసేందుకు కసరత్తు వేగవంతమైంది. ఆరు ప్రధాన సబ్జెక్టులలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి సోమవారం (జూలై 28) ఎం.ఏ.ఎల్.డి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహిం చనున్నారు. కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, తెలుగు, జువాలజీ విభాగాల్లో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. మీనాక్షి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు, అనుభవ ధ్రువీకరణలు, నెట్/సెట్/పీహెచ్‌డీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు. సబ్జెక్టు పరిజ్ఞానం, బోధనా ప్రతిభ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని వెల్లడించారు.

# ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థినులకు నగదు బహుమతులు

**వుదయం మనూరు మండల్_**



మనూరు మండల్ దోసపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించిన దాతృత్వవేత్త బిరదర్ దత్తు మరోసారి విద్యాభివృద్ధికి తన అంకిత భావాన్ని చాటుకున్నారుఈసందర్భంగా ZPHSమనూర్ పాఠశాలకు చెందిన బిరదర్ శ్రీనిధి (బ్యాచ్ 2025-2026) కు గ్రామంలో అత్యధిక మార్కులు సాధించినందుకు ₹2,500 నగదు బహుమతి ప్రకటించారు. అలాగే అదే పాఠశాలకు చెందిన బిరదర్ అపూర్వకు మెరిట్ ప్రతిభకు గుర్తింపుగా ₹5,100 నగదు బహుమతిని ప్రకటించారు. విద్యార్థులు చదువుతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ,భవిష్యత్తులో IAS,IPS,డాక్టర్,ఇంజనీర్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని బిరదర్ దత్తు ఆకాంక్షించారుగ్రామంలోని విద్యార్థులు కష్టపడి చదివమంచి ఫలితాలుసాధిస్తే వారిని ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారుఈ నిర్ణయంపై గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు హర్షంవ్యక్తంచేస్తూ బిరదర్ దత్తును అభినందించారు.

# కృష్ణమ్మ ఉగ్రరూపం.. జూరాలకు 'వరద'పోటు!

- **ఆల్మట్టి, నారాయణపూర్ గేట్లు ఎత్తివేత.. ఉప్పొంగుతున్న ఎగువ కృష్ణ**
- **ఒక్కసారిగా పోటెత్తిన నీటి ప్రవాహం.. 'ప్రియదర్శిని'కి మురిపించిన జలకళ!**
- **అలసట తీరిన కృష్ణమ్మ.. శ్రీశైలానికి సముద్రమంత నీటి ఉత్సాహం**
- **నెరవేరిన కర్షక నిరీక్షణ.. కరువు గుండెల్లో చిగురించిన ఆశల పసరు!**

**ధరూర్ జూలై 27 (వుదయం బ్యూరో)**



ఎగువన కృష్ణమ్మ నిద్రలేచింది.. ఎడతెరిపిలేని కుండపోత వర్షాలతో రౌద్రరూపాన్ని దాల్చింది! మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల నుంచి వస్తున్న జలప్రవాహం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో కృష్ణా బేసిన్‌లో భీకర వాతావరణం నెలకొంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో అధికారులు అప్రమత్తమై గేట్లను ఎత్తివేసి వేలాది క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆ ఉధృతికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సరిహద్దులోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలమయమైంది. గుండె నిండా నీటిని నింపుకొని ప్రాజెక్టు మళ్లీ పచ్చని ఊపిరి పీల్చుకుంటోంది. నెల రోజుల నిరీక్షణకు జలజవాబు! గతేడాది జూన్ ఆరంభంలోనే పలకరించిన కృష్ణమ్మ, ఈసారి మాత్రం సుదీర్ఘ నిరీక్షణ తర్వాతే కరుణించింది. జూలై ఆఖరి వారంలో ఆలస్యంగా అడుగుపెట్టినా.. 'వస్తే తుఫానులా వస్తా' అన్నట్లుగా ఎగువ నుంచి సముద్రమంత ప్రవాహం ముంచెత్తుతోంది. ప్రస్తుతం కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల తీవ్రత చూస్తుంటే.. మరో ఒకటిరెండు రోజుల్లో జూరాల గేట్లు ఎత్తి దిగువకు కృష్ణమ్మను పరుగులు తీయించడం ఖాయంగా కనిపిస్తోంది.

**కరవు తీరగా.. రైతన్న నవ్వగా!**

జూరాల నిండుకుండలా మారడంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కూడా జీవకళ రాబోతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీటి కొరత తీరనుండటంతో, ఇన్నాళ్లూ వాన దేవుడి వైపు కళ్లు కాయలు కాచేలా చూసిన రైతన్నల ముఖాల్లో చిరునవ్వులు విరబూస్తున్నాయి. ఆయకట్టు పరిధిలో ఏరువాక పండుగ మళ్లీ ఊపందుకుంది. నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ ప్రాజెక్టు వద్ద అప్రమత్తత ప్రకటించారు.

# మారుతి బ్రెజా కొత్త టర్బో వెర్షన్ లాంఛ్

- **పరిచయ ధర రూ.7.40 లక్షల నుంచి**
- **నాగర్‌కర్నూల్‌లో చైర్మన్ తీగల సురేంద్ర చేతుల మీదుగా ఆవిష్కరణ**

**నాగర్ కర్నూల్, జులై 27 (వుదయం ప్రతినిధి) :**



మారుతి సుజుకి ఇండియా తన ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ మోడల్ బ్రెజాలో కొత్త వెర్షన్‌ను విడుదల చేసింది. దీని పరిచయ ధర రూ.7.40 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.సరికొత్త 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌తో పాటు, ప్రాచుర్యం పొందిన 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్ ఆప్షన్ కూడా ఉంది. 6 స్పీడ్ మ్యాన్యువల్ ట్రాన్స్మిషన్‌తో పాటు 6 స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్‌తోనూ ఈ కారు లభ్యమవుతుంది. సీఎన్‌జీ వెర్షన్‌లోనూ 1.5 లీటర్ ఇంజన్‌ను అందిస్తున్నారు.కొత్త బ్రెజాలో 16 అంగుళాల అలాయ్ వీల్స్, 10.1 ఇంచ్ టచ్ స్క్రీన్, 360 డిగ్రీల కెమెరా వంటి ప్రీమియం ఫీచర్లు ఉన్నాయి. అమ్మకాలు పెరిగేందుకు ఈ ఎస్‌యూవీ దోహదపడుతుందని శ్రీ జయరామ మోటార్స్ కంపెనీ జనరల్ మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

కొత్త 1.0 లీటర్ టర్బో ఇంజన్ బ్రెజాను నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉన్న ధరలతో కార్లను అందుబాటులోకి తెస్తున్న మారుతి యాజమాన్యాన్ని అభినందించారు. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా మరిన్ని మోడల్స్‌ను తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ కౌన్సిలర్లు పడిగే శంకర్, కొత్త గంగాధర్, కాంగ్రెస్ నాయకులు హరీష్ గౌడ్, ఆవంచ రాజు, హర్షవర్ధన్ రెడ్డి, నాగేష్ చారి, టీవీ 9 రిపోర్టర్ ఖానాపురం ప్రదీప్, వుదయం రిపోర్టర్ రాజేష్ గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ జయరామ మోటార్స్ నాగర్‌కర్నూల్ బ్రాంచ్ సిబ్బంది గిరిధర్ గౌడ్, మహేందర్, సూర్య ప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు.



# గ్రేటర్ హైదరాబాద్





## ప్రజావాణికి(136)ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా , జూలై 27(వుదయం) :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసంనిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలనుపెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-54, ఇతర శాఖలు 82 , మొత్తం 136 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి , కిరణ్మయిజిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుల వివక్ష, పేదరిక నిర్మూలన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

- మంద కృష్ణ మాదిగ
- మాదిగలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగాలి –
- 40 రోజుల గ్రామస్థాయి ఉద్యమ నిర్మాణానికి పిలుపు

**ముషీరాబాద్, జూలై 27(వుదయం)** దేశంలో కుల వివక్ష, పేదరికం సమాజ అభివృద్ధికి అతి పెద్ద అడ్డంకులుగా మారాయని, వీటి నిర్మూలన కోసం భవిష్యత్ పోరాటాలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.రాంనగర్‌లోని బీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఇంజి. వెంకట్ స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం దశాబ్దాల పాటు సాగించిన రాజీలేని ఉద్యమం నేడు మాదిగ యువతకు విద్య, ఉద్యోగ రంగాల్లో గణనీయమైన అవకాశాలను కల్పించిందని పేర్కొన్నారు. ఈ ఉద్యమానికి రాజకీయ పార్టీలు, మేధావులు, సామాజిక సంఘాలు, ప్రజల నుంచి విశేష మద్దతు లభించిందని గుర్తుచేస్తూ, ఎంఆర్పీఎస్‌పై జాతి బాధ్యతతో పాటు సమాజ బాధ్యత కూడా ఉందని స్పష్టం చేశారు.దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, కుల



వివక్ష కారణంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదలో ప్రతి వర్గానికి సమాన భాగస్వామ్యం కల్పించి, కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాదిగలు కేవలం విద్య, ఉద్యోగ రంగాల్లోనే కాకుండా ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా బలంగా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో అత్యధిక పేదరికం మాదిగ సమాజానికే ఉందని, రాజకీయంగా కూడా మాదిగలు అట్టడుగు స్థాయిలోనే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మాదిగలతో పాటు అన్ని పీడిత వర్గాల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం భవిష్యత్‌లో విస్తృత ఉద్యమాలు చేపడతామని వెల్లడించారు.

40 రోజుల ఉద్యమ కార్యాచరణఉద్యమాన్ని మరింత శక్తివంతం చేయడానికి నేటి నుంచి 40 రోజుల పాటు గ్రామ స్థాయి నుంచి బస్తీల వరకు ఎంఆర్పీఎస్ కమిటీలను నూతన విద్యార్థి, యువతతో పునర్నిర్మించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ నగరంలోని ప్రతి బస్తీలో యువతను చైతన్యపరిచి, కొత్త తరం నాయకత్వంతో బలమైన ఎంఆర్పీఎస్ నిర్మాణమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో పాల్గొన్న నాయకులుఈ కార్యక్రమంలో గోవింద్ నరేష్ మాదిగ (ఎంఆర్పీఎస్ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి), చిలక ఎల్లయ్య మాదిగ, గండి కృష్ణ మాదిగ, ఎడవల్లి యాదయ్య మాదిగ, టి.వి. నరసింహ మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగ, మునిరాజు అరుణ్ కుమార్ మాదిగ, మాచర్ల ప్రభాకర్ మాదిగ, యాదాసి నర్సింగ్ రావు మాదిగ, మునిరాతి రామకృష్ణ మాదిగ, పూజల్ల రవి మాదిగ, శ్రీకిషన్ మాదిగ, బాల సాయిలు మాదిగ, రెడ్డపాక రవి మాదిగ, కొండపల్లి శివ మాదిగతో పాటు కుమ్మరి శ్రీనివాస్ మాదిగ, తొట్ల గోపి మాదిగ, రోషన్ వినయ్ రావు మాదిగ, తూంపల్లి చెన్నయ్య మాదిగ, గుంటి శ్రీధర్ మాదిగ, ముచ్చనపల్లి రాములు మాదిగ, కండే రామ్ కుమార్ మాదిగ, కుమార్ మాదిగ, లక్ష్యం గల నరసింహారావు మాదిగ, మినప నర్సింగ్ రావు మాదిగ, కొర్రముట్ల గోపాల్ మాదిగ, వేణుగోపాల్ మాదిగ, ములుగు మహేందర్ మాదిగ, పల్లె నర్సింగ్ రావు మాదిగ, సంతోష్ కుమార్ మాదిగ, సాయిలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## SIR ఎన్యుమరేషన్ ఫారాలను అధికారులకు అందజేసిన మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్

**ముషీరాబాద్, జూలై 27(వుదయం)** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (Special Intensive Revision SIR) కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ సోమవారం తమ కుటుంబ సభ్యుల ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ. వినయ్ కుమార్తో కలిసి తమ నివాసంలో జి.హెచ్.ఎం.సి డిప్యూటీ కమిషనర్ పుష్పలత మరియు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (AERO) శ్రీనివాస్కు ఫారాలను అధికారికంగా అప్పగించారు.

ఈ సందర్భంగా ఎ. పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని, ఎన్నికల సంఘం చేపట్టిన SIR కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు గోపాలకృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం
## నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం..





- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్చెరులో ఘనంగా మిస్సైల్ మాన్ అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

**పటాన్చెరు జులై 27 ( వుదయం)** అత్యంత సామాన్య కుటుంబం నుండి జీవితాన్ని ప్రారంభించి.. భారతదేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతో పాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్ గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల అబ్దుల్ కలాం కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలోనే ఆయన కాంస్య విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతిరోజు ఆయన విగ్రహాన్ని చూసినప్పుడల్లా ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నేటితరం విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలను తరిమికొట్టాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి లోకంపైన ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, అశోక్, పృథ్వీరాజ్, వెంకటేష్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# SIRకు ఆగస్టు 3తో గడువు ముగింపు

## – ఎన్యూమరేషన్ ఫారం సమర్పించండి... మీఓటు హక్కును పరిరక్షించుకోండి


**రంగారెడ్డి జిల్లా జూలై 27(వుదయం)** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించినఅత్యంత విలువైన హక్కు. ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో, ప్రజల అభిప్రాయాన్నివ్యక్తీకరించడంలో, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి అమూల్యమైన హక్కును పరిరక్షించుకోవాలంటే ప్రతిఅర్హ పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవడంఅత్యంత అవసరం. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (Special Intensive Revision - SIR) కార్యక్రమం తుది దశకుచేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్నిపూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (BLO)కు ఆగస్టు 3వ తేదీ లోగాతప్పనిసరిగా సమర్పించాలి. ఇది కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండాప్రతి ఓటరు నిర్వర్తించాల్సిన పౌర బాధ్యత కూడా.

**• ఎందుకు SIR?**

ఎన్నికల సంఘం ప్రతి ఎన్నిక నిష్పాక్షికంగా, పారదర్శకంగానిర్వహించేందుకు ఓటరు జాబితాను ఎప్పటికప్పుడు నవీకరిస్తుంది. చిరునామా మార్పులు, కుటుంబ వివరాలు, కొత్తగా అర్హత పొందిన ఓటర్లు, మరణించిన లేదాఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారాఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుంది. ఈ లక్ష్యంతోనే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**• ఎన్యూమరేషన్ ఫారం ఎందుకు సమర్పించాలి?**

ఎన్యూమరేషన్ ఫారం ద్వారా ఓటరి వివరాలను




ధృవీకరించి, ఓటరు జాబితాలో సరైన సమాచారం నమోదయ్యేలా చూస్తారు. ఈ ప్రక్రియలో ప్రజల సహకారం అత్యంత కీలకం. ఇంటింటికీ వెళ్లి బూత్ లెవల్ అధికారులు ఫారాలను అందజేస్తున్నారు. ప్రతి ఓటరు వాటిని పూర్తిగా నింపి వెంటనే బీఎల్‌వోకు తిరిగి అందజేయాలి.

**• ఆగస్టు 3 తర్వాత ఏమవుతుంది?**

ఆగస్టు 3తో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువు ముగియనుంది. గడువులోగా ఫారం సమర్పించని వారి వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలనకు గురవుతాయి. ఆ పరిశీలన అనంతరం వారి పేరు ఓటరు జాబితాలో కొనసాగకపోతే, వారు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి అర్హ ఓటరు గడువులోగా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.

**• జిల్లాలో పురోగతి ఇంకా పెరగాల్సి ఉంది**

రంగారెడ్డి జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఇంకా గణనీయ సంఖ్యలో ఫారాలు సమర్పించాల్సి




ఉంది. ఇప్పటివరకు నమోదైన పురోగతి ఈ విధంగా ఉంది.

ఇబ్రహీంపట్నం - 68.87%
ఎల్.బి. నగర్ - 50.75%
మహేశ్వరం - 53.70%
రాజేంద్రనగర్ - 55.40%
శేరిలింగంపల్లి - 53.94%
చేవెళ్ల - 77.44%
కల్వకుర్తి - 85.66%
షాద్‌నగర్ - 83.12%

జిల్లా మొత్తం పురోగతి - 60.79 శాతం మాత్రమే. అంటే ఇంకా వేలాది మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో స్పందన మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

**• జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపు**

జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డిమాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. గడువులోగా ఫారం సమర్పించని వారివివరాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలనకు గురవుతాయని, అవసరమైనప్రక్రియ అనంతరం ఓటరు జాబితాలో పేరు కొనసాగకపోతే ఓటు హక్కు కోల్పోయేఅవకాశం ఉంటుందని తెలిపారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనేబీఎల్‌వోను సంప్రదించి ఎన్యూమరేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

**• ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**

ప్రతి కుటుంబం తమ ఇంటిలోని అర్హులందరూ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారో లేదో నిర్ధారించుకోవాలి. బంధువులు, స్నేహితులు, పొరుగువారికి కూడా ఈ విషయాన్ని తెలియజేసి గడువులోగా ఫారాలు సమర్పించేలా చైతన్యం కల్పించాలి. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర, పారదర్శక ఓటరు జాబితా రూపొందుతుంది.

**• గుర్తుంచుకోండి...**

ఎన్యూమరేషన్ ఫారం సమర్పణకు చివరి తేదీ - ఆగస్టు 3

ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోకు తప్పనిసరిగా అందజేయాలి.గడువులోగా ఫారం సమర్పించని వారి వివరాలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకుపరిశీలించబడతాయి.మీ ఓటు హక్కును కాపాడుకోవాలంటే వెంటనే ఎన్యూమరేషన్ ఫారం సమర్పించండి."మీ ఓటు... మీ హక్కు... మీ బాధ్యత. ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారంసమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కండి."

## అన్నారం భూములను TGIICకి కేటాయించొద్దు



- జిల్లా కలెక్టర్‌కు రైతులు, గ్రామస్తుల వినతి
- భూములు లాక్కోవద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్న బాధితులు

**గుమ్మడిదల, జూలై 27 (వుదయం):** గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ సర్వే నంబర్ 261/1లో ఉన్న వ్యవసాయ భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC)కు కేటాయించవద్దని కోరుతూ గ్రామ రైతులు, గ్రామస్తులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకోవద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపైనే తమ కుటుంబాల జీవనాధారం ఆధారపడి ఉందని, భూములు కోల్పోతే ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, సంబంధిత భూములను TGIICకు కేటాయించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ప్రజావాణి అర్జీలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ,జూలై 27(వుదయం ప్రతినిధి) :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (106) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఏసిబి వలలో
## రెవెన్యూ ఉద్యోగి

**వికారాబాద్ జిల్లా జూలై 27 (వుదయం):** నియోజకవర్గంలోని దోమ మండలంలో తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు రైడ్స్ చేశారు. మోత్కూరు గ్రామనికి చెందిన జిపిఓ జగదీశ్ కళ్యాణ లక్ష్మీ అప్రూవల్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.మోత్కూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఎల్లమ్మ తన కూతురు కవిత వివాహానికి సంబంధించి కళ్యాణ లక్ష్మి పంచనామా కోసం గ్రామ పంచాయతీ అధికారి జగదీష్‌ను ఆశ్రయించింది. పంచనామా చేయాలంటే రూ. 6,000 లంచం ఇవ్వాల్సిందేనని జీపీఓ డిమాండ్ చేయడంతో అంత ఇచ్చుకోలేని ఎల్లమ్మ. గ్రామస్తుడైన రంగంపల్లి చెన్నయ్యకు విషయం చెప్పగా, ఆయన పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం ఉదయం మోత్కూరు పంచాయతీ కార్యాలయానికి వచ్చిన జీపీఓ జగదీష్‌కు చెన్నయ్య రూ. 2,000 ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అనంతరం నిందితుడిని దోమ తహశీల్దార్ కార్యాలయానికి తరలించి విచారించగా, లంచం అడిగినట్లు జీపీఓ ఒప్పుకున్నాడు.

అతనిపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరచి జైలుకు తరలిస్తున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ డిఎస్పి ఆనంద్ తెలిపారు

## పెద్ది సుదర్శన్ రెడ్డికి కేసీఆర్ పరామర్శ

**వుదయం, హైదరాబాద్:** గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి లు ఉన్నారు.ఆసుపత్రి వైద్యులను కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేసీఆర్, ఆయనకు మరింత మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పరామర్శ అనంతరం కేసీఆర్ తిరిగి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు బయలుదేరి వెళ్లారు.


**IN THE COURT OF THE HONOURABLE CHAIRMAN MACT - CUM - III ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. No. 1914 OF 2026**
**Between :**
Gorela Srinivas ...Plaintiff
**AND**
1. The Tahsildar
2. All concerned ....Defendants
To
All Concerned ....Defendants No.2

Please take notice that the above case is filed of declaration of legal heirs of late Gorela Venkateshwar Rao and is posted for appearance of the proposed defendants. If in case, you fail to appear before the above said Hon'ble Court at 10.30 a.m. on 07-08-2026 either in person or through Advocate the matter will be heard and determined in your absence.
(BY ORDER OF THE HON'BLE COURT)
**Place: Hyderabad**
**Date:28-07-2026**
Sd/-
**P. JYOTSANA**
**P. SHARAD KUMAR**
**Advocates**
**# 2-3-703/1/2, Sai Deep Apartment, beside HP Petrol Bunk, Amberpet, Hyderabad.**
**Cell: 8790872077**



**IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**
**GWOP No. 18 OF 2026**
**Between :**
**GUNDELLI KIRAN KUMAR** ...Petitioner
**AND**
All concerned ....Respondent
To
All Concerned ....Respondent

Please take notice that the above GWOP is filed to appoint the petitioner herein as Guardian of the minor children namely **GUNDELLI AMULYA & GUNDELLI AKHILA** with permission to sell Plot bearing No.36 & 21, in Sy. Nos. 8/అ/2, 8ఇ/2 and 10అ1/1, admeasuring 125.00 Sq. yds., each, situated at Saidapur village, Yadagirigutta Mandal, Yadadri Bhingir District and is posted for appearance of the proposed respondent. If in case, you fail to appear before the above said Hon'ble Court at 10.30 a.m. on 19-08-2026 either in person or through Advocate the matter will be heard and determined in your absence.
(BY ORDER OF THE HON'BLE COURT)
**Place: Hyderabad**
**Date:28-07-2026**
Sd/-
**P. JYOTSANA**
**P. SHARAD KUMAR**
**Advocates**
**# 2-3-703/1/2, Sai Deep Apartment, beside HP Petrol Bunk, Amberpet, Hyderabad.**
**Cell: 8790872077**



**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD**
**O.S. No. 477 OF 2026**
**Between:**
**1. Mrs. Polishetty Seetha Lakshmi,** W/o. Polishetty Vedeshwar Rao, D/o. Late Vishwanathan Krishna Murthi, Aged: 42 years, Occ: Service, R/o. Plot No. 26, Krishna Nagar Colony, Near Ambedkar Statue, Doolapally, Gandimaisamma, Medchal-Malkajgiri District.
**2. Srinivasan Vishwanathan Krishnamurthi,** S/o. Late Vishwanathan Krishna Murthi, Aged :41 years, Occ: Service, R/o. 15-23, Venkatrao Pet, Near Lakshmi Kala Mandir, Lothkunta, Venkatapuram, Secunderabad. ...Plaintiffs
**AND**
**1. THE MANDAL REVENUE OFFICER,** Trimulgherry Mandal, Trimulgherry, Secunderabad.
**2. All Concerned** ...Defendants
To,
**ALL CONCERNED**

Please take notice that the above Plaintiffs herein have filed the above Suit for declaration of Plaintiffs as legal heirs of **Late Savithri Krishna Murthi**, who died intestate on 26.11.2024. The above Said case is posted to **14.08.2026 at 10.30 am,** if anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.
**( BY ORDER OF THE COURT )**
**P. DANESHWARA RAO,**
Advocate,
Secunderabad.



**IN THE COURT OF THE HONOURABLE CHAIRMAN MACT - CUM - III ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**M.V.O.P. No. 272 of 2025**
**Between :**
**Pupani Naveen Kumar** ...Plaintiff/Claimant
**AND**
1. Bontha Shiva & anor., ....Respondents
**NOTICE**
To
M/s. Larsen & Toubro, rep.by R. Vinoth Karthick, owner of the Vehicle/Truck bearing Registration No. TS-09-UC-2692,aged major, R/0 Plot no.520,Subham Gulmohar Avenue, New Villa Marie college, Rajbhavan Road, Somajiguda, Hderabad-82, Telangana,.,cell no.7702033316.

TAKE NOTICE that the above-named Petitioner/claimant has filed the above MVOP no. 272 of 2025 against you and another before the above Hon'ble Court. You are hereby informed that the said case is posted on **14-08-2026 at 10:30 A.M.**

You are hereby directed to appear before the Hon'ble III ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD on the said date and time, either in person or through a duly authorized counsel. In the event of your failure to appear, the Hon'ble Commission shall proceed to pass appropriate orders in your absence, as deemed fit.
Hence this notice
**// BY ORDER OF THE HONOURABLE COURT//**
Sd/-
**A.SAMPATH KUMAR**
**Advocate**
**H. No. 1-3-183/40/21/48, Gandhi Nagar, Hyderabad Telangana - 500080**
**Cell No. 9848281019**




## నా విజయం కార్గిల్ హీరోలకు అంకితం

"మన కార్గిల్ హీరోలకు నా విజయం అంకింతం. పాకిస్తాన్ బాక్సర్‌పై విజయం సాధించినందుకు గర్వపడుతున్నా. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేసి ముందుకు సాగుతా. బంగారు పతకం సాధించేందుకు ప్రయత్నిస్తా. మన దేశం తరపున ఆడటాన్ని నేను ఎప్పుడూ ఆస్వాదిస్తా. నేటి యువ క్రీడాకారులు తమ శక్తి సామర్థ్యాలకు పదును పెట్టి భారతావనికి మంచి పేరు తీసుకురావాలి. తద్వారా ప్రపంచ పటంలో మన దేశంలో తలెత్తుకునేలా చేయాలి. అందుకు అవసరమైన సౌకర్యాలు, వసతులను ప్రభుత్వాలు కల్పించి, వారందర్నీ పైకి తీసుకురావాలిఇక ముందూ అదే చేస్తా."

**- జాదుమణి సింగ్, భారత బాక్సర్**

## వేమన పద్యం

నీళ్ళలోన మీను నిగిడి దూరముపారు
బైట మూరుడైన బారలేదు
స్థానబల్మిగాని తనబల్మి కాదయా
విశ్వదాభిరామ! వినురవేమ!



# సంపాదకీయం

## అదీ ఇరాన్ దెబ్బంటే

తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడు వస్తాడన్నట్టు''గా పశ్చిమాసియా సంక్షోభం ముదురుతోంది. ఎత్తులకు పై ఎత్తులు వేయటం ప్రతి దేశానికీ వచ్చని ఇప్పటికే ఇరాన్ నిరూపించింది. దురహంకారం, ప్రపంచ పెద్దన్న అనే మదంతో ఉన్న అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 28న ఇజ్రాయిల్‌తో కలసి ఇరాన్‌పై దాడులను ప్రారంభించాడు. జూన్ 17 నుంచి అమల్లోకి వచ్చే విధంగా అరవై రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ కుదిరింది. దానిపై వచ్చిన విమర్శలు లేదా ఇరాన్‌కు అది అనుకూలంగా ఉందన్న పునరాలోచన గావచ్చు. తప్పుడు సాకులతో గత పదమూడు రోజులుగా మరోసారి ఇరాన్‌పై అమెరికా విరుచుకుపడుతోంది. అమెరికాను ఏ మాత్రం నమ్మని ఇరాన్ తన జాగ్రత్తలో తానుంటూ వాషింగ్టన్ దాడులకు ప్రతిగా గల్ఫ్, మధ్య ప్రాచ్యంలోని అమెరికా మిలిటరీ స్థావరాలపై అది కూడా దాడులు చేస్తోంది.ఈ పూర్వ రంగంలో ఎమెన్ గల్ఫ్‌లోని బాబ్ ఎల్ మండాబ్ జలసంధిని సౌదీ అరేబియా నౌకలకు మూసివేస్తున్నట్లు ఎమెన్‌లోని హౌతీ సాయుధ బృందం ప్రకటించింది. అంతేకాదు తమ ఆదేశాలను ఉల్లంఘించిన రెండు నౌకలపై దాడులు కూడా చేసింది. దీంతో పశ్చిమాసియా సంక్షోభంలో మరో కొత్త అధ్యాయానికి తెరలేచినట్లయింది. ఇరాన్ అణు కేంద్రాలున్నట్లు చెబు తున్న పికాక్స్ పర్వత ప్రాంతాలపై దాడులు చేస్తామని ట్రంప్ తాజాగా ప్రకటించాడు. నిజానికి అతగాడు చెబుతున్న ప్రాంతాలు ఇంతకు ముందు కూడా ఉన్నాయి. గతేడాది దాడులు చేసి వాటన్నింటినీ ధ్వంసం చేశామని ప్రకటించాడు. కానీ అలాంటి దేమీ లేదని తరువాత వెల్లడైంది. ఇప్పుడు మరోసారి అదే ప్రకటనలు చేస్తున్నాడు. నిజానికి ఇరాన్ శుద్ధిచేసిన యురేనియం ఎక్కడుందో ఎవరికీ అంతుబట్టటం లేదు. ఏమాత్రం ఆనవాలు దొరికినా ఈ పాటికి అమెరికా, ఇజ్రాయిల్ వాటి మీద దాడులు చేసి ఉండేవి. ఇదిలా ఉండగా.. ట్రంప్ వైఖరిని సమర్ధించేవారి సంఖ్య అమెరికాలో ముప్పయి శాతానికి పడిపోయినట్టు తాజా సర్వేలు వెల్లడించాయి. అయినప్పటికీ తెగింపును చూస్తుంటే నవంబరు మూడున జరిగే ఎన్నికలలో ఓటర్లకు చెప్పుకొనేందుకు గరిష్టంగా ఇరాన్‌కు నష్టం చేసేందుకు పూనుకున్నట్లు చెప్పవచ్చు. దీనికితోడు హోర్ముజ్ జలసంధిపై తమ పెత్తనాన్ని రుద్దాలని కూడా ట్రంప్ భావిస్తు న్నట్టు తెలుస్తోంది. ఇందుకు గాను దాడులకు అదనంగా డెబ్బయి బిలియన్ డాలర్లు కావాలని పార్లమెంట్‌ను కోరడం అందులో భాగమే! ఇలాంటి చర్యలతో అమెరికా పౌరులపై మరిన్ని భారాలు మోపుతూ మరింతగా దూరం కావటం అనివార్యం. ఈ పరిణామం చమురు కంపెనీలకు తప్ప యావత్ ప్రపంచ పౌరులకు నష్టదా యకమే, అయినప్పటికీ అమెరికా వెనక్కు తగ్గటం లేదు.మధ్యధరా సముద్రంతో ఎర్ర సముద్రాన్ని కలుపుతూ దాని ద్వారా హిందూమహా సముద్రంలోకి ఓడలు ప్రవేశించేందుకు ఈజిప్టులో తవ్విన సూయజ్ కాలువ 1869 నుంచి రవాణా తీరు తెన్నులనే మార్చివేసింది. అంతకు ముందు ఆఫ్రికాలోని గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి నౌకలు ప్రయాణించేవి. నూట తొంభైమూడు కిలోమీటర్ల పొడవున్న ఈ కాలువ ద్వారా రోజుకు వంద నౌకలు రవాణా సాగించేందుకు విస్తరించారు. లండన్ నుంచి అరేబియా సముద్రంలోకి నౌకలు వచ్చేందుకు దీంతో తొమ్మిదివేల కిలోమీటర్ల దూరం, పది రోజుల ప్రయాణ సమయం తగ్గుతుంది. ఎర్ర సముద్రం అరేబియా సముద్రాలను కలిపే బాబ్ ఎల్ మండాబ్ జలసంధి చాలా ఇరుకైనది. ఈ ప్రాంతానికి వచ్చే నౌకలను నిలు వరించటానికి, చికాకు పెట్టేందుకు అనువైనదిగా ఉంది. ఎమెన్ అంతర్యుద్ధంలో రాజధాని సనా నగరంతో పాటు ఈ జలసంధి ఉన్న కీలక ప్రాంతాలన్నీ హౌతీల ఆధీనంలో ఉన్నాయి. ఈ సాయుధశక్తికి ఇరాన్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నది. దీన్ని అణచివేయాలని చూసిన సౌదీ అరేబియా ప్రయత్నాలు ఫలించలేదు. తమపై అనుచితంగా దాడులు కొనసాగిస్తే అవసరమైతే హోర్ముజ్ జలసంధితో పాటు బాబ్ ఎల్ మండాబ్‌ను కూడా మూసివేస్తామని కొద్ది వారాల క్రితం ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంలో భాగంగా ఇరాన్ నౌకలపై దాడి చేస్తే ప్రతి నౌకకు ఒక వంతెన లేదా విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని జూలై 22న ట్రంప్ బెదిరించాడు. దాంతో తన మద్దతుదారులైన హౌతీలను ఇరాన్ రంగంలోకి దించిందని చెప్పవచ్చు. అమెరికా కేంద్రీకరణను దెబ్బతీయటమే దీని వెనుక ఉన్న ఎత్తుగడగా కనిపిస్తోంది.

అయితే హౌతీలు కూడా అన్ని నౌకలను గాక తమను దెబ్బతీసేందుకు చూస్తున్న సౌదీ అరేబియా మీదనే కేంద్రీకరించారు. ఈ జలసంధి ద్వారా రోజుకు ఐదు మిలియన్ పీపాల చమురును సౌదీ ఎగుమతి చేస్తున్నది. దీనితో పాటు ఐరోపా నుంచి ఆసియాకు జరిగే ఇతర సరకు రవాణా కీలకంగా ఉంది. సౌదీ నుంచి డీజిల్,పెట్రోలు, విమాన ఇంధన ఎగుమతులు కూడా ఈ దాడులతో ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. బాబ్ ఎల్ మండాబ్ జలసంధి సంక్షోభానికి పూర్తి బాధ్యత అమెరికాదే అన్నది నిస్సందేహం.


**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# నీటి కోసం గోస

నీరుంటేనే జీవితం... నీరు లేకపోతే నగరం కూడా ఎడారే'' ఈ మాట హైదరాబాద్ నగర శివార్లలోని బోడుప్పల్ ప్రాంత ప్రజల జీవితాలను చూస్తే అక్షర సత్యంగా అనిపిస్తుంది. ఆకాశాన్ని తాకే భవనాలు, విశాలమైన రహదారులు, ఆధునిక సౌకర్యాలతో మెరిసిపోతున్న మహానగరం ఒకవైపు కనిపిస్తుంటే, మరోవైపు ఒక బిందె నీటి కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న కుటుంబాల వేదన నగర అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత రెండు నెలలుగా బోడుప్పల్, ఉప్పల్ పరిసర ప్రాంతాలు నీటి కొరతతో విలవిల్లాడుతున్నాయి. ఒకప్పుడు జీవనంతో కళకళలాడిన వీధులు, నేడు ఒక్క బిందె నీటి కోసం నిట్టూర్పులు విడిచే గృహాలుగా మారిపోయాయి. తెల్లవారక ముందే నీటి కోసం ప్రారంభమయ్యే నిరీక్షణ, అర్ధరాత్రి దాటినా ముగియని ఆవేదనగా ప్రతి ఇంటి గడపను చుట్టుముడుతోంది. తాగడానికి గుక్కెడు నీరు లేదు... స్నానం చేయడానికి చుక్క లేదు... కనీసం మరుగుదొడ్డిని ఉపయోగించుకోవ డానికి కూడా బిందె నీటి కోసం కళ్లప్పగించి ఎదురు చూడాల్సిన దుస్థితి. ఒకప్పుడు ప్రశాంత జీవనానికి నిలయమని, నగర రద్దీకి కాస్త దూరంగా సుఖంగా బతకవచ్చని భావించి వేలాది కుటుంబాలు బోడుప్పల్, ఉప్పల్ పరిసర ప్రాంతాలను తమ ఆశల నిలయంగా ఎంచుకున్నాయి. జీవితకాల పొదుపును వెచ్చించి కొందరు సొంత ఇంటి కలను నిజం చేసుకోగా, మరికొందరు ప్రశాంతమైన జీవితం కోసం అద్దె ఇళ్లలో అడుగుపెట్టారు. కానీ నేడు అదే ఇల్లు, అదే గడప, అదే కాలనీ...ఒక్క బిందె నీటి కోసం కన్నీళ్లు కార్చే వేదనకు చిరునామాగా మారింది.



ఒకవైపు బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మరోవైపు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే అది ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి. రోజులు గడుస్తున్నా ట్యాంకర్ జాడ ఉండదు. ప్రతి ఉదయం ఫోన్‌లో బుకింగ్ స్థితిని చూస్తూ, ప్రతి శబ్దానికీ ''ట్యాంకర్ వచ్చిందేమో'' అని గేటు వైపు పరుగెత్తే అమాయక నిరీక్షణ మాత్రమే మిగులుతోంది. ప్రతి ఖాళీ బిందె ఒక కుటుంబం దాహాన్ని చెబుతోంది. ప్రతి ఎండిపోయిన నల్లా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది. నీటి కోసం గడిచే ప్రతి నిమిషం ప్రజల సహనాన్ని పరీక్షిస్తుంటే, ప్రతి రోజు వారి జీవితాలపై కొత్త భారాన్ని మోపుతోంది. ట్యాంకర్ వస్తుందో రాదో తెలియని అనిశ్చితి... వచ్చినా అందరికీ సరి పోతుందో లేదో అన్న ఆందోళన... ఇదే నేడు బోడుప్పల్, ఉప్పల్ ప్రజల నిత్యజీవితానికి ప్రతిబింబంగా మారింది. కోట్ల ఆశలతో బతుకుతున్న ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చే పరిపాలన. కానీ నేడు బోడు ప్పల్ పరిస్థితిని చూస్తే, మహానగరం అనే మాట గర్వంగా కాకుండా గాయంగా అనిపిస్తోంది. పేరుకే మహానగరం... కానీ ప్రజలు మాత్రం దాహంతో విలవిలలాడుతున్నారు. కొత్త కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. కానీ వాటికి అనుగుణంగా మౌలిక వసతులు పెరగకపోతే, ఆ అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమవుతుంది. సిమెంట్‌తో నగరాన్ని నిర్మించడం సులభమే..కానీ ప్రజల విశ్వాసాన్ని నిర్మించడం అంత సులభం కాదు. ఒక నగర గొప్పదనం భవనాల ఎత్తులో కాదు, ప్రజల జీవన ప్రమాణాల్లో ఉంటుంది. నీటి కోసం ప్రజలు బిందెలు పట్టుకుని గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తే, ఆ నగరం ఎంత పెద్దదైనా, ఎంత ఆధునికమైనదైనా, అది అసంపూర్ణ అభివృద్ధికే నిదర్శనం.ఎన్నికల సమయంలో ప్రతి ఇంటి గుమ్మం తట్టిన నాయకులు, "మీ సేవకులం", "మీ సమస్యలే మా సమస్యలు" అని మాటలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజల దాహాన్ని ఎందుకు చూడలేకపోతున్నారు? ఓటు అడిగినప్పుడు గుర్తుకొచ్చిన ఇల్లు, గెలిచిన తర్వాత ఎందుకు గుర్తుకు రావడం లేదు? ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల రోజుతో ముగిసే బాధ్యత కాదు, ప్రజల అవసరాలు తీరే వరకు కొనసాగే కర్తవ్యం. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. చెరువులు కాపాడితే భూగర్భ జలాలు పెరుగుతాయని విశ్వసించారు. కుంటలను పరిరక్షిస్తే రాబోయే తరాలకు నీటి కొరత ఉండదని కలలు కన్నారు. కానీ తక్కువ వర్షపాతం, పెరుగుతున్న జనాభా, ప్రణాళికల లోపం, నియంత్రణలేని నిర్మాణాలు కలిసి ఆ ఆశలన్నింటినీ ఆవిరి చేస్తున్నాయి. ప్రకృతి సహకరించకపోతే పరిపాలన మరింత చురుకుగా పనిచేయాలి. వర్షాలు తక్కువ పడితే ముందస్తు ప్రణాళికలు ఎక్కువగా ఉండాలి. సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాదు, రాకముందే నివారించడం నిజమైన పాలనా దక్షత.

# కాలేయాన్ని కాపాడుకుందాం... ఆరోగ్యంగా జీవిద్దాం!

కాలేయం మెదడు తరువాత శరీరంలో రెండో అతిపెద్ద, రెండో అత్యంత క్లిష్టమైన అవయవం. కాలేయం జీవక్రియలను, జీర్ణవ్యవస్థను నియంత్రించుటలో, శరీరంలోని వ్యర్థపదార్థాలను తొలగించుటలో ఎంతగానో సహాయం చేస్తుంది. రోగ నిరోధక శక్తి, జీర్ణక్రియ, జీవక్రియ, గ్రహించిన పోషకాల నిల్వ, విసర్జనకు సంబంధించిన కీలకమైన విధులను నిర్వహించడానికి ఇది బాధ్యత వహిస్తుంది. ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం (హెపటైటిస్) ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వైరల్ హెపటైటిస్ గురించి అవగాహన పెంచడం, హెపటైటిస్ నిర్మూలించేలా ప్రపంచం నలుమూలల ఉన్న ప్రజలను ప్రోత్సహించడం, అలాగే హెపటైటిస్ తో బాధపడుతున్న లక్షలాది మందిని గుర్తించే లక్ష్యంతో ఈ రోజును ఏర్పాటు చేశారు. హెపటైటిస్‌బి వైరస్‌ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యూల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజు (జూలై 28) నాడు జరుప బడుతుంది. ప్రతి సంవత్సరం 100కి పైగా దేశాలలో ప్రదర్శనలు, ప్రచారాలు, కచేరీలు, టాక్ షోలు, ఫ్లాష్ మాబ్స్, టీకా డ్రైవ్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి.2004, అక్టోబరు 1న యూరోపియన్, మిడిల్ ఈస్టర్న్ పేషెంట్ గ్రూప్స్, బేబీ ముర్రియెల్ సమన్వయంతో అంతర్జాతీయ హెపటైటిస్‌సి అవగాహన దినోత్సవం జరిగింది. వేరువేరు సమూహాలు వేర్వేరు తేదీలలో ఈ దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఈ కారణంగా 2008లో వివిధ ప్రాంతాలలోని రోగుల సమూహాల సహకారంతో ప్రపంచ హెపటైటిస్ అలయన్స్ సంస్థ మే 19ను మొదటి ప్రపంచ కాలేయ




వ్యాధి దినోత్సవంగా ప్రకటించింది.కాలేయ వ్యాధి దినోత్సవం నిర్వహించాలన్న ఆలోచన కటక్ లో వచ్చింది. హెపటైటిస్‌బి వైరస్ ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యూల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజైన జూలై 28న ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని కటక్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ ప్రతిపాదించాడు. 2010, మే నెలలో జరిగిన 63వ ప్రపంచ ఆరోగ్య సభలో ఈ ప్రతిపాదన ఆమోదించబడి, జూలై 28న పంచ కాలేయ వ్యాధి దినోత్సవంగా ప్రకటించ బడింది.కాలేయ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల ప్రజలపై ప్రభావితం చూపిస్తుంది. ఈ వ్యాధి తీవ్రత వల్ల దీర్ఘకాలిక వ్యాధికి గురై ప్రతి సంవత్సరం 1.34 మిలియన్ల మంది చనిపోతున్నారు. బాధితుల్లో 12.22 శాతం మంది 30 ఏళ్లలోపు వారుంటే... 40 ఏళ్లలోపు వారు 25.8 శాతం, 50 ఏళ్లలోపు వారు 28.10 శాతం, 60 ఏళ్లలోపు వారు 21.74 శాతం ఉండడం గమనార్హం.

సాధారణంగా మద్యం, మాంసం, ఆయిల్ ఫుడ్ అతిగా తీసుకునేవారే ఎక్కువగా కాలేయ జబ్బుల బారిన పడుతుంటారు. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే కనీస/ తక్కువ బరువుతో ఉన్నవారు...ఎలాంటి దురలవాట్లు లేనివారు సైతం ప్రస్తుతం ఫ్యాటీ లివర్‌తో బాధ పడుతున్నారు. ఇలా ప్రతి 10 మందిలో ఐదారుగురు ఈ సమస్యతో బాధ పడుతుండడం ఆందోళన కలిగించే అంశం.

మద్యపానం, ధూమపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఊబకాయం మొదలైన వాటితో సహా జన్యు లేదా జీవన శైలి కారకాలు కాలేయానికి హాని కలిగిస్తాయి.కాలేయ మార్పిడి తప్పనిసరి అయిన పరిస్థితుల్లో, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అవసరమైన వారికి తమ కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చినా... వయసు, బ్లడ్‌గ్రూప్ మ్యాచింగ్ కావడం లేదు. ఒకవేళ మ్యాచ్ అయినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా లైవ్ డోనర్ సర్జరీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో చికిత్సలు జరగడం లేదు.నిల్వ ఉంచిన ఆహార పదార్థాలలో ఎక్కువ శాతం కృత్రిమ క్రొవ్వులు, కృత్రిమ చక్కెరలు ఉంటాయి, ఇవి ఆరోగ్యం పై పెను ప్రభావాన్ని చూపించ గలవు. ఊబకాయం, అస్తవ్యస్త జీవ క్రియలు, జీర్ణాశయ పని తీరు మందగింపు, మూత్రాశయ సంబంధిత సమస్యలు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు హెచ్చు మీరడం, రక్త పోటు, హృదయ సంబంధిత వ్యాధులు మొదలైన వాటికి కారణం అవుతుంటాయి. ఉప్పు అధికంగా తీసుకోవడం కాలేయ కణాలకు కూడా అసౌకర్యాన్ని కలిగించి ఫైబ్రోసిస్‌కు దారితీస్తుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసిన ,నిల్వ ఉంచిన ఆహార పదార్థాల కారణంగా శరీరంలో అధిక క్రొవ్వులు పేర్కొని పోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. మాంసంలో ఉండే అధిక ప్రోటీన్, అధిక క్రొవ్వులు కాలేయానికి తీవ్రమైన ప్రభావాలను ఇస్తుంటాయి. సాఫ్ట్ డ్రింక్స్ లో ఎక్కువ మోతాదులో కృత్రిమ చక్కెరలు, కార్బోనేటెడ్ మిశ్రమాలతో నిండి ఉంటుంది. అనగా కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువగా ఉంటుంది. ఈ కృత్రిమ చక్కెరలు, మరియు కార్బన్ డై ఆక్సైడ్ రెండూ ఆరోగ్యానికి మంచివి కావు. ముఖ్యంగా వీటి ప్రభావం కాలేయం మీద ఖచ్చితంగా ఉంటుంది.

నోటిద్వారా తీసుకున్న ఏ ఆహారమైనా అది ఖచ్చితంగా కాలేయానికి ఏదో ఒకరూపంలో చేరుతుంది. కావున తీసుకునే ఆహార ప్రణాళికలో భాగంగా తృణ ధాన్యాలు, ప్రోటీన్లు, పాల పదార్థాలు, పండ్లు, కూరగాయలు, ఆరోగ్యకర క్రొవ్వు పదార్థాలు ఉండేలా చూసుకోవడం ద్వారా కాలేయం ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్త తీసుకోవచ్చు.




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


## వెలుగు నీడ

వెలుతురులోనే నీడ ఉనికి
నిశీధిలో నీడ మటుమాయం
సవాళ్లు ఉంటేనే కదా..
సాహస జీవితానికి అర్థం
దారి వెంట అవరోధాలుంటేనే..
ప్రయాణం జాగ్రత్తగా
సాగుతుంది
సాహసికులకే సమాజ చప్పట్లు
భయంతో ప్రయాణం ఆపితే..
జన అపజయ ఎగతాళి
నినాదాలు !

పువ్వును ఇష్టపడితే..
తెంపేసి సిగలో పెట్టుకుంటాం
పుష్పాన్ని ప్రేమిస్తే..
మొక్కకు నీరు పెట్టి
చూసుకుంటాం
ఇష్టపడితే వాడుకుంటాం
ప్రేమిస్తే వారి శ్రేయస్సు
కోరుకుంటాం
ఇష్టం అనే మెట్టు దాటి..
ప్రేమ సింహాసనం ఆక్రమిద్దాం !

రుచికరమైన పండుపై..
రాళ్ల వర్షం కురుస్తుంది
సత్య ధర్మాల్ని నమ్మితే..
విమర్శల పాలై పోతాం
గొంతు ఎత్తి గోల చేసేటోళ్లను..
వింటాయి సమాజ కర్ణాలు
సత్యానికి తొలుత నిరాదరణ..
అంతిమ విజయం సత్యానిదే !




మధుసూదన్ రెడ్డి
9949700037


# ఏఐతో లాభమా? నష్టమా?

కృత్రిమ మేధ కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణగా మిగలకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా వ్యవస్థల నిర్మాణాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది. ఏ దేశం చూసినా ఒకే సందేహం, రేపటి ఉద్యోగ మార్కెట్‌కు ఈనాటి డిగ్రీలు సరిపోతాయా అని. అయితే ఈ సందేహానికి జవాబు వెతికే పద్ధతి దేశాన్ని బట్టి పూర్తిగా భిన్నంగా ఉంది. కొన్ని దేశాలు కోర్సులను తొలగించే కఠిన మార్గం ఎంచుకుంటే, మరికొన్ని ఉన్న కోర్సులకే ఏఐను జోడించే సున్నిత మార్గాన్ని ఎంచుకుం టున్నాయి. ఈ రెండు మార్గాల మధ్య మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల భవిష్యత్తు ఏమిటన్నది అసలైన చర్చనీయాంశం. కృత్రిమ మేధ యుగానికి అనుగుణంగా ఉన్నత విద్యను వేగంగా రూపాంతరం చేస్తున్న దేశాల్లో చైనా ముందంజలో నిలుస్తోంది. 2021-2025 మధ్య చైనా వేలాది కోర్సులను పునర్వ్యవస్థీకరించి, కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటమ్ సాంకేతికత వంటి భవిష్యత్ రంగాల్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను నిరంతరం నవీకరిస్తూ నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధా న్యం ఇస్తోంది. భవిష్యత్ సాంకేతిక పోటీతత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఉన్నత విద్యలో సమగ్ర మార్పులు చేపడుతున్న దేశంగా చైనా గుర్తింపు పొందుతోంది.

అమెరికాలో కృత్రిమ మేధ ప్రభావం వేరే రూపంలో కనిపిస్తోంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మానవీయ, కళా విభాగాల విద్యార్థుల నిష్పత్తి గత దశాబ్దంలో పదిహేనున్నర శాతం నుంచి పన్నెండున్నర శాతానికి పడిపోయింది. ఓఈసీడీ గణాంకాల ప్రకారం, సభ్య దేశాల్లో ఎనభై శాతం దేశాల్లో గత దశాబ్దంలో మానవీయ శాస్త్రాల నమోదు గణనీయంగా తగ్గింది. బ్రిటన్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది, రస్సెల్ గ్రూప్‌కు చెందిన నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నలభైకి పైగా కోర్సుల్లో కొత్త ప్రవేశాలను నిలిపివేసింది, లీసెస్టర్ విశ్వవిద్యాలయం ఫిల్మ్ స్టడీస్, మోడర్న్ లాంగ్వేజెస్ విభాగాలనే పూర్తిగా మూసివేసింది. గతేడాది కాలంలో బ్రిటన్‌వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా కోర్సులు రద్దయ్యాయి, వీటిలో ఎక్కువ భాగం సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలకు చెందినవే. అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, డెలాయిట్ సంస్థ 2026 నివేదిక ప్రకారం, కృత్రిమ మేధ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతుండటంతో, ముఖ్యంగా అమెరికాలో మానవీయ శాస్త్రాలపై ఆసక్తి మళ్లీ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు, ఎందుకంటే యంత్రాలు చేయలేని విమర్శనాత్మక ఆలోచన, నైతిక తర్కం వంటి నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.

సింగపూర్ డిగ్రీ నిర్మాణాన్ని పూర్తిగా మార్చకుండా, స్కిల్స్‌ఫ్యూచర్ పథకం ద్వారా జీవితకాల నైపుణ్యాభి వృద్ధిపై పెట్టుబడి పెడుతోంది. 2026 మేలో ప్రకటించిన కొత్త విధానం ప్రకారం, 2027 నాటికి అన్ని విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌లలో చేరే ప్రతి విద్యార్థికి ప్రాథమిక ఏఐ నైపుణ్యాలు నేర్పించే మాడ్యూళ్లు తప్పనిసరి అవుతాయి, అయితే ఇవి ఆయా విద్యార్థుల ప్రధాన సబ్జెక్టుతో పాటుగానే బోధించబడతాయి తప్ప దానికి బదులుగా కాదు. దక్షిణ కొరియా కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధిని జాతీయ మనుగడ వ్యూహంగా ప్రకటించి, 2027 నాటికి తమ కోర్సుల్లో ముప్పై శాతాన్ని ఏఐతో అనుసంధానించే విశ్వవిద్యాలయాలకు అదనపు పరిశోధన నిధులు ఇస్తూ, చేయని సంస్థలకు నిధులు తగ్గించే ప్రోత్సాహక విధానాన్ని అనుసరిస్తోంది, బల వంతపు కోర్సు రద్దులు కాదు. జపాన్ వైఖరి మరింత ఆసక్తికరం, సొసైటీ 5.0 విధానం కింద ఆర్థిక శాస్త్రం చదివేవారు కోడింగ్ నేర్చుకోవడం, సాహిత్యం చదివేవారు డేటాను అర్థం చేసుకోవడం అనే హైబ్రిడ్ గ్రాడ్యుయేట్ నమూనాను ప్రోత్సహిస్తున్నారు తప్ప, మానవీయ శాస్త్రాలను తొలగించడం లేదు. జపాన్ విశ్వ విద్యా లయాల్లో ప్రత్యేకంగా డిజిటల్ హ్యూమానిటీస్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టి, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాల విద్యార్థులకే ఏఐ పరికరాలను తమ పరిశోధనలో ఉపయోగించే నైపుణ్యాన్ని అందిస్తున్నారు. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు చైనా నమూనాను నిశితంగా పరిశీలిస్తూ కోర్సు సమీక్షల తొలిదశలో ఉన్నాయి.



**అమెరికాలో కృత్రిమ మేధ ప్రభావం వేరే రూపంలో కనిపిస్తోంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మానవీయ, కళా విభాగాల విద్యార్థుల నిష్పత్తి గత దశాబ్దంలో పదిహేనున్నర శాతం నుంచి పన్నెండున్నర శాతానికి పడిపోయింది. ఓఈసీడీ గణాంకాల ప్రకారం, సభ్య దేశాల్లో ఎనభై శాతం దేశాల్లో గత దశాబ్దంలో మానవీయ శాస్త్రాల నమోదు గణనీయంగా తగ్గింది. బ్రిటన్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది, రస్సెల్ గ్రూప్‌కు చెందిన నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నలభైకి పైగా కోర్సుల్లో కొత్త ప్రవేశాలను నిలిపివేసింది, లీసెస్టర్ విశ్వవిద్యాలయం ఫిల్మ్ స్టడీస్, మోడర్న్ లాంగ్వేజెస్ విభాగాలనే పూర్తిగా మూసివేసింది.**

ఈ ప్రపంచ నేపథ్యంలో భారత్ ఎంచుకున్న మార్గం, ఇప్పటికే ఉన్న కోర్సుల చుట్టూ ఏఐ నైపుణ్యాన్ని జోడించడం. మూడో తరగతి నుంచే ఏఐ, కంప్యూటేషనల్ థింకింగ్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చేర్చాలన్న నిర్ణయం ఈ దిశలో ముందడుగే. అయితే మెర్సర్ మెటల్ సంస్థ ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్ ప్రకారం దేశ వ్యాప్తంగా నలభై రెండున్నర శాతం గ్రాడ్యు యేట్లు మాత్రమే ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారు. ఇందులో తెలంగాణ మొత్తం ఉపాధి యోగ్యత దాదాపు నలభై ఏడున్నర శాతంగా నమోదైంది, నాన్ టెక్నికల్ విభాగంలో ఇది యాభై ఒక్క శాతం దాటినా, సాంకేతిక ఉద్యోగాల ఉపాధి యోగ్యతలో దక్షిణాది రాష్ట్రాలేవీ మొదటి పది స్థానాల్లో లేకపోవడం గమనార్హం. టీజీ ఈఏపీసెట్ 2025లో కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సులకు తొంభై ఒక్క శాతం సీట్ల భర్తీ నమోదు కావడం, పన్నెండు వేలకు పైగా ఏఐ అండ్ ఎంఎల్ సీట్లు, ఇరవై ఆరు వేలకు పైగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండటం విద్యార్థుల మొగ్గు ఎటువైపో చూపిస్తోంది.

కృత్రిమ మేధ యుగంలో సాంకేతిక నైపుణ్యమే సర్వస్వం అనుకోవడం పొరపాటని అంతర్జాతీయ గణాం కాలే చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2025లో విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం, పది మంది యజమానుల్లో ఏడుగురు అనలిటికల్ థింకింగ్‌ను అత్యంత అవసరమైన నైపుణ్యంగా పేర్కొంది. ఇది వరుసగా మూడో నివేదికలోనూ మొదటి స్థానంలో నిలిచింది.

క్రియేటివ్ థింకింగ్ నాలుగో స్థానంలో, రెసిలియన్స్, లీడర్‌షిప్, సోషల్ ఇన్‌ఫ్లుయెన్స్ వంటి మానవ కేంద్రిత నైపుణ్యాలు తొలి ఐదింటిలో చోటు దక్కించుకున్నాయి. అంటే ఏఐ, డేటా నైపుణ్యాలతో పాటు, మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు నేర్పించే విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సామాజిక అవగాహన కూడా భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు అంతే అవసరమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆదాయ గణాంకాలు కూడా ఈ వాదనకు మద్దతుగా నిలుస్తున్నాయి. జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయ సెంటర్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ద వర్క్‌ఫోర్స్ అధ్యయనం ప్రకారం, పంతొమ్మిది మానవీయ, కళా విభాగాల్లో పద్నాలుగు విభాగాలు, స్టెమ్ గ్రాడ్యుయేట్ల ఆదాయంలో దిగువ పాతిక శాతం కంటే ఎక్కువ సంపాదిస్తున్నాయి. ప్రారంభ వేతనాల్లో స్టెమ్ గ్రాడ్యుయేట్లు ముందుండగా, కెరీర్ మధ్యలో ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి సామాజిక శాస్త్ర విభాగాలు జీవశాస్త్రం వంటి కొన్ని స్టెమ్ విభాగాలతో సమానంగా లేదా అంతకుమించి ఆదాయాన్ని అందిస్తున్నాయని ఈ అధ్యయనం చూపిస్తుంది.

బ్రిటన్‌లోని రస్సెల్ గ్రూప్ గణాంకాల ప్రకారం కూడా అత్యధిక ప్రమాణాలున్న సంస్థల్లో మానవీయ శాస్త్రాల గ్రాడ్యుయేట్లలో తొంభై ఒక్క శాతం మంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంటే మానవీయ శాస్త్రాలను తక్షణ ప్రయోజనం లేని కోర్సులుగా తీసిపారేయడం కంటే, వాటిని ఏఐ నైపుణ్యాలతో జోడించి బలోపేతం చేయడమే దీర్ఘకాలిక ప్రయోజనకరం. ఈ ప్రపంచ అనుభవాల నుంచి భారత్, తెలంగాణ నేర్చుకోవాల్సింది స్పష్టంగా కనిపిస్తోంది. చైనా వేగం, అమెరికా, బ్రిటన్‌లలో ఆర్థిక ఒత్తిడితో వస్తున్న బలవంతపు కోతలు రెండూ ఆదర్శప్రాయం కావు. కృత్రిమ మేధ నైపుణ్యాన్ని ప్రతి డిగ్రీలో భాగం చేయడం అవసరమే తప్ప, దాని పేరుతో మానవీయ శాస్త్రాలను, సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదు. జాతీయ విద్యా విధానం2020పై విద్యానిపుణులు, మేధావుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అయితే, ఇందులోనూ ఇప్పుడు అవసరమైంది కేంద్రీకృత ఏఐ అనుబంధమే తప్ప, కోర్సుల ఏకపక్ష తొలగింపు కాదు. ఇంజినీరింగ్ సిలబస్‌లు సిస్టమ్స్ థింకింగ్ చుట్టూ పునర్నిర్మించుకోవాల్సినంతే, హ్యూమానిటీస్ కోర్సులు డిజిటల్ హ్యూమానిటీస్‌గా, కల్చరల్ అనలిటిక్స్‌గా పరిణామం చెందాల్సిన అవసరం ఉంది. ప్రతి డిగ్రీ పట్టభద్రుడు ఏఐ నైపుణ్యంతో పాటు, విమర్శనాత్మక ఆలోచన, మానవీయ దృక్పథంతో బయటకు వచ్చే విద్యా వ్యవస్థను నిర్మించుకోవడమే విక్షిత్ భారత్ 2047 లక్ష్యానికి నిజమైన బాట.



# జాతీయం-అంతర్జాతీయం



## మహాత్మా... మీరే మాకు స్ఫూర్తి







### జాతిపితకు సోనమ్ వాంగ్‌చుక్ ఘన నివాళి

**న్యూఢిల్లీ, జులై 27 (ఎ.ఎం.ఎస్):** ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. ఆయన సతీమణితో కలిసి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలోని మెదాంత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆరోగ్యం కుదటపడటంతో వైద్యులు ఆయనను సోమవారం డిశ్చార్జ్ చేశారు. కాగా, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఢిల్లీ లోని జంతర్ మంతర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. సీజేపీ ధర్నాకు మద్దతుగా ప్రముఖ విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 23 రోజుల పాటు దీక్ష కొనసాగించడంతో ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన ఆసుపత్రిలో కూడా దీక్ష కొనసాగించారు. క్రమంలో సీజేపీ డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో 26 రోజుల తర్వాత వాంగ్ చుక్ తన దీక్ష విరమించారు.

## లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు



**న్యూఢిల్లీ, జులై 27 (ఎ.ఎం.ఎస్):** పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మంత్రి జితేంద్ర సింగ్ ఆ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయితే ఇవాళ సాయంత్రం 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత విపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయితే సభను వాయిదా వేస్తూ.. స్పీకర్ ఓం బిర్లా సాయంత్రం 5 గంటలకు పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు ప్రకారం పేపర్ లీకేజీ కేసులను రెండు నెలల్లోగా దర్యాప్తు చేపట్టాలి. పేపర్ లీకేజీకి పాల్పడిన వారికి కనీసం 5 నుంచి పదేళ్ల జైలుశిక్ష పడనున్నది. జరిమానా సుమారు 50 లక్షల వరకు విధించనున్నారు.

## అమెరికాకు అన్నీ చావు దెబ్బలే

- క్షిపణులు, డ్రోన్లకే అడ్డే లేదు
- విమాన' నష్టాలు
- సైనిక మౌలిక సదుపాయాలకు భారీ నష్టం
- 200 మంది సైనికుల మృతి



**టెహ్రాన్, జులై 27 :** ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ పదిహేను రోజుల పాటు జరిగిన తాజా పోరులో అమెరికాకు భారీగా ఎదురు దెబ్బలు తగిలాయని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలిపింది.

అమెరికా సైనిక ఆస్తులు, సిబ్బందికి జరిగిన నష్టాన్ని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహేబీ గణాంకాలతో సహా బయటపెట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...అమెరికా కమాండ్ కేంద్రాలు, గగనతల రక్షణ వ్యవస్థలు, లాజిస్టిక్ మౌలిక సదుపాయాలు, సంస్థాగత సౌకర్యాలు, విమానాలు, సైనిక మోహరింపు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరిపింది. ఈ దాడులలో ఏడు కమాండ్ కంట్రోల్ కేంద్రాలు, మూడు ఉపగ్రహ కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఆరు పాట్రియాట్ గగనతల రక్షణ రాడార్లు, మూడు గగనతల - సముద్ర నిఘా రాడార్లు, ఎనిమిది ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఏడు క్షిపణి రక్షణ రాడార్లు, మూడు ఈపీఎస్ రాడార్ వ్యవస్థలు, రెండు ఎన్/టీపీఎస్ 117 రాడార్లు, ఐదు దూర శ్రేణి రాడార్ వ్యవస్థలు, రెండు అదనపు గగనతల రక్షణ రాడార్లు, ఒక వ్యూహాత్మక రాడార్ కాంప్లెక్స్ ధ్వంసమయ్యాయి.

పాట్రియాట్ వ్యవస్థలకు భారీ నష్టం జరగడంతో వాటి సామర్థ్యం బాగా దెబ్బతింది. ఫలితంగా ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులు, డ్రోన్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా లక్ష్యాలను తాకుతున్నాయి. అమెరికా సైనిక దళాలకు చెందిన లాజిస్టిక్ నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ దెబ్బతీసింది. ఆరు ఫైటర్ - హెలికాప్టర్ నిర్వహణ కేంద్రాలు, మూడు లాజిస్టిక్ - సహాయ కేంద్రాలు, పన్నెండు ఇంధన నిల్వ ట్యాంకులు, పదిహేడు మందుగుండు సామగ్రి విడిభాగాల గిడ్డంగులు, ఆరు క్షిపణి నిల్వ బంకర్లు ధ్వంసమయ్యాయి.

సైనిక మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని కూడా మొహేబీ వివరించారు. ఆరు ఎంక్యూ9 డ్రోన్ హ్యాంగర్లు, ఒక ఎఫ్ 15 ఫైటర్ ప్రిపరేషన్ ఫెసిలిటీ, కొత్తగా సరఫరా అయిన ఎనిమిది డ్రోన్లను నిల్వ ఉంచిన కేంద్రం, రెండు కమాండ్ సెంటర్లు, ఒక విమాన వాహక రీఫ్యూయలింగ్ వేదిక, సముద్ర నిఘా కోసం ఉపయోగించే పీ - 8 విమానాలను ఉంచే కేంద్రం, నాలుగు క్షిపణి ప్రయోగ వేదికలు, ఐదు ఫైటర్ విమానాల షెల్టర్లు, నాలుగు పాట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ప్రాంగణాలు, ఆరు క్షిపణి ప్రయోగ ప్యాడ్లు, ఓ ఫ్యూయల్ పంపింగ్ కేంద్రం, రెండు సిగ్నల్ కమ్యూనికేషన్ కేంద్రాలు, ఓ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్, బహ్రెయిన్‌లో అమెజాన్‌తో అనుసంధానించిన ఏఐ - డేటా ప్రాసెస్ కేంద్రం, రిమోట్‌తో నడిచే మానవ రహిత నౌకల డిపో, ఫ్యూయల్ పీర్, నాలుగు ఎయిర్‌క్రాఫ్ట్ షెల్టర్లు, ఆరు ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ ఫ్లయిట్ ర్యాంపులు ఇరాన్ దాడులలో ధ్వంసమయ్యాయి.

సైనిక స్థావరాలలో నిలిపి ఉంచిన 11 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను ఇరాన్ దళాలు ధ్వంసం చేశాయని ఐఆర్‌జీసీ ప్రతినిధి చెప్పారు. ఎనిమిది సరికొత్త డ్రోన్లు సహా 17 నిఘా - ఆపరేషనల్ డ్రోన్లు, షెల్టర్‌లో ఉన్న ఎఫ్ - 15 యుద్ధ విమానం, పీ - 8 సముద్ర గస్తీ విమానం, సీ 17 సైనిక రవాణా విమానం, ఎనిమిది గగనతల ఇంధన సరఫరా విమానాలు, నాలుగు హెలికాప్టర్లు, నిల్వ ఉంచిన ఆరు క్షిపణులు ధ్వంసమయ్యాయని వివరించారు.ఇరాన్ దాడులలో అమెరికాకు చెందిన ఎనిమిది సైనిక కేంద్రాలపై దాడి జరిగిందని, వీటిలో ఒక్కో కేంద్రంలో 20 భవనాలు ఉన్నాయని, వాటిలో సైనికులు నివసిస్తుందటారని, అవన్నీ తమ దాడులలో ధ్వంసమయ్యాయని మొహేబీ తెలిపారు. తమ దాడులలో 200 మందికి పైగా అమెరికా సైనికులు మరణించారని, అనేక మంది గాయపడ్డారని చెప్పారు.

## అన్ని పిటిషన్లపై 28న విచారణ



- చలో సంసద్‌పై సుప్రీంకోర్టు
- శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుంది
- సీజేఐ వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జులై 29(ఎ.ఎం.ఎస్):** శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు రాజ్యాంగం హామీ ఇచ్చిందని ఉద్ఘాటించిన సుప్రీంకోర్టు, 'చలో సంసద్' ర్యాలీలో పాల్గొన్న నిరసనకారులపై పోలీసులు క్రూరంగా వ్యవహరించారన్న ఆరోపణలకు సంబంధించిన అన్ని పిటిషన్లపై జులై 28న విచారణ చేపట్టనున్నట్లు మంగళవారం తెలిపింది.

ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్ల విచారణ సోమవారం జరగాల్సి ఉండగా, అదే వ్యవహారంలో తమను కూడా పక్షాలుగా చేర్చాలని కోరుతూ దాఖలైన ఇంప్లీడ్‌మెంట్ దరఖాస్తులను సైతం విచారణ జాబితాలో చేర్చేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. ''శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని సిజెఐ ఉద్ఘాటించారు. ''ఆందోళన శాంతియుతంగా ఉన్నంత వరకు.. కేవలం ఆందోళన జరుగుతుందనే కారణంతో పోలీసుల మితిమీరిన చర్యలు ఉండకూడదు. ఒక వేళ మితిమీరిన చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉంటే.. స్వతంత్రంగా విచారించాలి'' అని విచారణ సందర్భంగా సిజెఐ మౌఖికంగా వ్యాఖ్యానించారు. ప్రదర్శనల సమయంలో పోలీసుల ప్రతిస్పందనను నియంత్రించడానికి నిబంధనలు ఉండాలని సిజెఐ సూచించారు. కేవలం నిరసన జరుగుతోందన్న కారణంతో పోలీసులు దాడులు చేయడం సమర్థనీయం కాదని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో క్రమశిక్షణ అంతర్భాగమని స్పష్టం చేశారు. నిరసనల సమయంలో దాడికి గురయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది కుటుంబాల తరపున జోక్యం చేసుకోవాలని కోరుతూ ఒక న్యాయవాది దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను ధర్మాసనం విచారిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. "మేము ఇందులో పాల్గొని మా దృక్పథాన్ని తెలియజేయాలనుకుంటున్నాము. యూనిఫాంలో ఉన్న పోలీసులను కూడా రక్షించండి," అని ఆ న్యాయవాది కోర్టుకు తెలిపారు.నిరసనకారులను నియంత్రించడానికి మోహరించిన పోలీసు సిబ్బందికి తగిన రక్షణ పరికరాలు, భద్రతా సౌకర్యాలు కల్పించారా లేదా అనే అంశాన్ని వివరించాలని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. పోలీసు సిబ్బందికి, నిరసనకారులకు అయిన గాయాలను సమానంగా పరిగణించాలని ఆయన సూచించారు.



## అమిత్ షా సమాధానం చెప్పాల్సిందే

- పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల నిరసన
- విద్యార్థులపై కేసులు ఎత్తేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జులై 27(ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తూ సీజేపీ శ్రేణులు జంతర్ మంతర్ వద్ద ఈనెల 20న భారీ నిరసన ప్రదర్శన చేపట్టిన విషయం తెలిసిందే. ఎలాంటి హెచ్చరికలు లేకుండా పార్లమెంట్ మార్చ్ లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

విచక్షణారహితంగా యువతలను చితికబాదారు. భాష్పవాయువుతో పాటు పోలీసులు పెల్లెట్ గన్స్ ప్రయోగించారు. పెల్లెట్ గన్స్ తాకి పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే తాజాగా విద్యార్థులపై దమనకాండను వ్యతిరేకేస్తూ పార్లమెంట్ వద్ద ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అకారణంగా విద్యార్థులపై లాఠీచార్జ్ చేశారని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

శాంతియుతంగా సాగుతున్న యువత నిరసనఞపై పోలీసుల దాడులు సమంజసంకాదని విపక్షాలు మండిపడ్డాయి. అంతేకాకుండా విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని, వెంటనే ఆ కేసులు ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

## ట్రంప్ ఉత్తర్వుల అమలుకు బ్రేక్

- అప్పీల్స్ కోర్టులో మరో ఎదురు దెబ్బ




**బోస్టన్, జులై 27 :** మెయిల్'ఇన్'ఓటింగ్ నిబంధనలను కఠినతరం చేసే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును 23 రాష్ట్రాలలో అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు అనుమతి నిరాకరించింది. కాంగ్రెస్‌పై నియంత్రణను నిర్ణయించే మధ్యంతర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ట్రంప్ ఈ ఉత్తర్వును జారీ చేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులోని కీలక భాగాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని దిగువ కోర్టు న్యాయమూర్తి ఇప్పటికే నిర్ధారించారు. ట్రంప్ ఉత్తర్వులు అమలు కాకుండా డెమొక్రాట్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఇంజక్షన్ ఆర్డర్ పొందాయి. దీనిని ఎత్తివేయాలంటూ ఫెడరల్ ప్రభుత్వం కోరగా ఆ అభ్యర్థనను బోస్టన్‌లోని యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ తోసిపుచ్చింది.

యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి ఇందిరా తల్వానీ ఇచ్చిన తీర్పును నిలిపివేయాలంటూ అమెరికా న్యాయ శాఖ అప్పీల్స్ కోర్టులో వాదనలు వినిపించింది. అయితే అప్పీల్స్ కోర్టు ఈ వాదనను తిరస్కరించింది. మెయిల్ ద్వారా ఓటు వేసే విధానంపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలని ట్రంప్ చాలా కాలంగా కోరుతున్నారు. 2020 ఎన్నికలలో తాను ఓటమి చెందడానికి ఓటింగులో జరిగిన మోసమే కారణమని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో మెయిల్ఇన్‌ఓటింగ్ నిబంధనలను కఠినతరం చేస్తూ మార్చిలో కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు.అయితే అమెరికా రాజ్యాంగం ప్రకారం సమాఖ్య ఎన్నికల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలదే. ఓటును నమోదు చేసుకోవడానికి పౌరసత్వరుజువును తప్పనిసరి చేస్తూ, మెయిల్ బ్యాలెట్ల లెక్కింపును పరిమితం చేస్తూ గతంలో ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు కూడా న్యాయస్థానం తిరస్కరణకు గురైంది.

## ఆ కేసులన్నీ ఎత్తేయాలి

- కేంద్రానికి సీజేపీ డిమాండ్

COCKROACH JANTA PARTY

**న్యూఢిల్లీ, జులై 27(ఎ.ఎం.ఎస్):** కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళలతో కేంద్ర విద్యాశాఖమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.సోమవారం తాజాగా కేంద్ర ప్రభుత్వానికి మరో హెచ్చరిక జారీ చేసి చేసింది సీజేపీ. పార్లమెంట్ మార్చ్ లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులన్ని రేపటిలోగా ఎత్తివేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. కాగా, నీట్ పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జూలై 20న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన పార్లమెంట్ మార్చ్ లో పాల్గొన్న యువతపై ఢిల్లీ పోలీసులు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. జూలై 20న, జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వైపు సాగిన "సంసద్ చలో" ర్యాలీలో వేలాది మంది యువత పాల్గొన్నారు. శాంతియుతంగా సాగుతున్న యువత ర్యాలీపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

లాఠీఛార్జ్ చేయడంతో వందల సంఖ్యలో యువత గాయపడ్డారు.

## కెనడాలో భారత యువతి హత్య

**కెనడా:** లో పంజాబ్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. టొరంటో నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నవనీత్ కౌర్ (26) బులేవార్డ్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను వెంబడించాడు. కొద్దిసేపు ఆమెతో మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరి మధ్య ఎలాంటి వాగ్వాదం జరగకుండానే నిందితుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ కేసులో 37 ఏళ్ల శరణ్‌జీత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిది కూడా పంజాబేనని గుర్తించారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డ్రోన్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇది టార్గెటెడ్‌గా చేసిన హత్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

అయితే హత్య వెనుక అసలు ఉద్దేశం ఏంటనేది తెలియాల్సి ఉందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే కెనడాలోని ఎడ్మంటన్‌లో భారత్‌కు చెందిన మరో యువతి హత్యకు గురైన సంగతి తెలిసిందే. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను రితీష్ కుమార్ (22) గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మాలిలో భారత సంతతి డైమండ్ వ్యాపారి కిడ్నాప్

- రూ. 44 కోట్లు కట్టిన తర్వాత విడుదల
- ఏప్రిల్‌లో అపహరణ రూ. 100 కోట్ల డిమాండ్



**బామాకోలోని, జులై 27:** గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లా ధార్ గ్రామానికి చెందిన ధీరూ రమాణీ.. 1980ల నుంచే సూరత్ వేదికగా డైమండ్స్ వ్యాపారంలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆ తర్వాత కాలంలో అమెరికాలో స్థిరపడిన ఆయన కుటుంబం.. అంతర్జాతీయ స్థాయిలో డైమండ్ ట్రేడింగ్ సాగిస్తోంది. ఇటీవల మాలిలో ఒక బంగారు గనిని కొనుగోలు చేసిన రమాణీ.. కొద్దికాలంగా అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మాలిలో ఉన్న సమయంలో దుండగులు ఆయనను అపహరించారు. మొదట్లో కిడ్నాపర్లు ఆయన్ను విడిచిపెట్టడానికి ఏకంగా రూ. 100 కోట్ల వరకు కప్పం చెల్లించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం.

అయితే అమెరికాలో ఉంటున్న రమాణీ కుటుంబ సభ్యులు భారత ప్రభుత్వ సంస్థల ప్రమేయం లేకుండా.. సొంతంగా కిడ్నాపర్లతో తీవ్రంగా సంప్రదింపులు జరిపారు. సుదీర్ఘ చర్చల అనంతరం డిమాండ్ చేసిన మొత్తాన్ని తగ్గించి.. 4 మిలియన్ యూరోలకు (భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ. 44 కోట్లు) ఒప్పందం కుదుర్చుకుని గత వారం ఆయన విడుదలయ్యేలా చేశారు. అయితే రూ. 44 కోట్లు కట్టిన తర్వాత కిడ్నాపర్లు ఆయన్ను విడుదల చేసినప్పటికీ.. ధీరూ రమాణీ ఇంకా మాలిలోనే ఉన్నారు. కిడ్నాప్ జరిగిన తీరు, ఆయన విడుదల వెనుక ఉన్న పరిస్థితులు, చెల్లింపుల వివరాలపై స్పష్టత కోసం మాలి స్థానిక పోలీసులు ఆయనను ప్రస్తుతం విచారిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. ఏప్రిల్ నెలలో కిడ్నాప్ ఘటన చోటుచేసుకున్న సమయంలోనే మాలి రాజధాని బామాకోలోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులకు అత్యవసర భద్రతా సూచనలు జారీ చేసింది. ఇతర ప్రాంతాల్లో పెరుగుతున్న భద్రతా ఆందోళనల దృష్ట్యా మాలిలో నివసిస్తున్న భారతీయ పౌరులు అందరూ తీవ్ర అప్రమత్తతతో ఉండాలని.. సాధ్యమైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని ఆదేశించింది. అయితే ఆ సూచనలలో నిర్దిష్టంగా రమాణీ పేరుగానీ, ఈ ఘటన వివరాలుగానీ ప్రస్తావించలేదు.

## అమెరికాలో మరోసారి కాల్పులు ఇద్దరు మృతి



**వాషింగ్టన్, జులై 27:** అమెరికాలో మరోసారి తుపాకీ కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. సియాటెల్ నగరంలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

నగరంలో అత్యంత వైభవంగా జరుగుతున్న "బైట్ ఆఫ్ సియాటెల్" ఫుడ్ ఫెస్టివల్ వేదికగా ఈ హింసాత్మక ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా ఆందోళన రేకెత్తిస్తోంది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. సియాటెల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో ఈ కాల్పులు జరిగాయి. గాయపడిన వారిలో రెండేళ్ల బాలుడు కూడా ఉన్నట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన భద్రతా దళాలు ఘటనా స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడిన విషయాన్ని పోలీసులు అధికారికంగా ప్రకటించారు.

పరిస్థితి దృష్ట్యా ప్రజలెవరూ ఆ ప్రాంతానికి రావద్దని హెచ్చరికలు జారీ చేశారు.

## భారతీయ కరెన్సీపై ఆంక్షల సడలింపు



- నేపాల్ సర్కార్ నిర్ణయం
- సరిహద్దు ప్రాంతాల్లో హర్షా తిరేకాలు
- మూడో దేశాలకు మార్పిడి కుదరదు

**ఖాట్మండు, జులై 27:** భారత రూపాయి నోట్ల రవాణా, వినియోగంపై ఉన్న ఆంక్షలను నేపాల్ ప్రభుత్వం సడలించింది. భారత్, నేపాల్ పౌరులు ఇకపై రూ. 200, రూ. 500 విలువ కలిగిన భారత నోట్లను వెంట తీసుకెళ్లవచ్చని నేపాల్ కేంద్ర బ్యాంక్ ప్రకటించింది. 2016 నవంబర్ 9వ తేదీన భారత్ చేపట్టిన పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ. 200, రూ. 500 పై విధించిన ఆంక్షలు తొలగిపోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నేపాల్ రాష్ట్రా బ్యాంక్ (ఎన్ఆర్‌బీ) వెలువరించిన తాజా నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తి గరిష్ఠంగా రూ. 25,000 వరకు మాత్రమే ఈ భారతీయ నోట్లను నేపాల్ లోపలికి తీసుకురావడానికి లేదా వెలుపలికి తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. ఈ నిబంధనను ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన నేపాల్ గెజిట్‌లో ప్రచురించినప్పటికీ.. ఆచరణలో తలెత్తిన సందేహాలను నివృత్తి చేస్తూ గురువారం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. అయితే 2016 నవంబర్ అంటే పెద్ద నోట్ల రద్దు కంటే ముందు నాటి పాత భారతీయ నోట్లను నేపాల్‌లోకి తీసుకురావడంపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ నిబంధనల అమలుపై స్పష్టతనిస్తూ ఎన్ఆర్‌బీ అధికార ప్రతినిధి గురు ప్రసాద్ పౌడేల్ కీలక విషయాలను వెల్లడించారు. నేపాల్ పౌరులు.. భారత్ మినహా ఇతర మూడో దేశాల నుంచి భారత కరెన్సీని నేపాల్‌లోకి తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా నేపాల్ నుంచి తీసుకెళ్లే భారత కరెన్సీని కేవలం భారత దేశంలో మాత్రమే వినియోగించాలని, ఇతర దేశాలకు తీసుకెళ్లకూడదని షరతు విధించారు. ఈ నూతన సడలింపుల ద్వారా నేపాల్ సందర్శించే భారతీయ పర్యాటకులకు, భారతదేశంతో నిత్యం వర్తక వ్యాపారాలు సాగించే నేపాల్ పౌరులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. భారత్, నేపాల్ దేశాల మధ్య స్వేచ్ఛా సరిహద్దు ప్రాంతం ఉండటంతో పాటు ఆర్థిక వ్యవస్థ పరంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. నేపాల్‌కు భారత్ అతిపెద్ద భాగస్వామ్య దేశంగా ఉండగా.. వేలాది మంది నేపాల్ పౌరులు ఉపాధి, విద్య, వ్యాపారాల కోసం భారత్‌లోనే నివసిస్తున్నారు. ఇక ఇతర విదేశీ కరెన్సీ పరంగా.. ఏ విదేశీ పర్యాటకుడైనా లేదా నేపాల్ పౌరుడైనా కస్టమ్స్ డిక్లరేషన్ లేకుండా 5,000 అమెరికన్ డాలర్లు లేదా ఇందుకు సమానమైన ఇతర విదేశాల డబ్బులు కూడా నేపాల్‌లోకి తీసుకు రావచ్చని,

అంతకు మించితే ఖచ్చితంగా వెల్లడించాలని స్పష్టం చేసింది.

## విద్యార్థులపై ఏకే 47తో కాల్పులు

**పాట్నా, జులై 27(ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీకేజ్ ను నిరసిస్తూ ఈ నెల 25న జాతీయ స్థాయిలో విద్యార్థి సంఘాలు బంద్ నిర్వహించిన విషయం విదితమే. అయితే బీహార్ లో బంద్ సందర్భంగా అనేక జిల్లాల్లో విద్యార్థి సంఘాలు భారీ స్థాయిలో నిరసనలు చేపట్టాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు మరియు పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నట్లు సమాచారం. పాట్నాతో పాటు పలు జిల్లాలో విద్యార్థులు భారీ ర్యాలీ తీశారు.అయితే సివాన్ జిల్లాలో చేపట్టిన విద్యార్థుల ర్యాలీపై ఓ కానిస్టేబుల్ ఏకే 47తో కాల్పులు జరిపారు. పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీస్ శాఖపై విమర్శలు వెలువెత్తాయి. దీంతో దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు సదురు కానిస్టేబుల్ ను సస్పెండ్ చేశారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## బమ్మెర పోతన స్మృతి వనం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి – కలెక్టర్



**జనగామ, జులై 27 (వుదయం ప్రతినిధి):** మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బమ్మెర పోతన స్మృతి వనం సమగ్ర అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం రోజున జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బమ్మెర అభివృద్ధి పనులకు సంబంధించిన సవరించిన అంచనాలను (Revised Estimate) త్వరితగతిన ఖరారు చేసి, టెండర్ ప్రక్రియను ఆలస్యం లేకుండా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.చీఫ్ ఇంజనీర్, ఆర్&బి శాఖ టెండర్ ప్రక్రియను అత్యవసరంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.పర్యాటక శాఖతో సమన్వయం చేసుకొని నిధుల సమీకరణకు చర్యలు తీసుకోవాలని, పనులను దశలవారీగా పూర్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బమ్మెర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగా రావు, ఇరిగేషన్ శాఖ, పర్యాటక శాఖ, ఆర్&బి శాఖ, సంబంధిత శాఖల అధికారులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు: కలెక్టర్**



**నల్లబెల్లి /వరంగల్, జులై 27 (వుదయం)** ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. సోమవారం నల్లబెల్లి మండలం మేడపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ధ్రువీకరించిన విత్తన స్టాళ్లను సందర్శించి, వాటి నాణ్యత, లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండేలా వరికి బదులుగా కందులు, పెసర్లు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. గుర్తింపు పొందిన సంస్థల ద్వారా లభించే ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రశీదు (బిల్లు) తీసుకోవాలని, సంచుల పై ఉన్న వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వినియోగించాలని కోరారు. రైతులకు పంటల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ప్రభుత్వ సూచనలు అనుసరిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు (ఆదా)బొమ్మేనాశ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి రజిత బన్న, విస్తరణాధికారులు రంజిత్, రాకేష్, శివకుమార్, త్రివేణి, మేడపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, స్థానిక రైతులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను పరిష్కరించాలి – కలెక్టర్



**ములుగు, జులై 27 (వుదయం ప్రతినిధి):** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తెలిపారు.సోమవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవ రావు ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 10, పెన్షన్లకు 10, భూ సమస్యలు 16 ఇతర శాఖలకు సంబంధించినవి 13, దరఖాస్తులు అందాయి. ప్రజల సమస్యల దరఖాస్తులను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు.ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ, స్థానిక సంస్థలు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డి ఆర్ ఓ రవి కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**-రూ.5 కోట్ల7 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**-పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**



**తొర్రూరు/ మహబూబాబాద్, జులై 27, (వుదయం ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయని పాలకుర్తిఎమ్మెల్యేమామిడాల యశస్విని రెడ్డి అన్నారు.తొర్రూరు మండలంలోని నాంచారి మడూరు,గుడిబండ తండ, వెలకట్ట,పెద్ద మంగ్య తండా, వెంకటాపురం,అమర్ సింగ్ తండా,దుబ్బ తండ, చీకటియపాలెం, ఫతేపురం, పోలేపల్లి, ఎస్వికె తండా, గుర్తురు, ఖానాపురం, హచ్చు తండా, కొమ్మనపల్లి తండా గ్రామాలలో సుమారు రూ.5 కోట్ల 7 లక్షల నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం పనులకు సోమవారం ఆయా శాఖల సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయన్నారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేసి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రజా ప్రభుత్వంలో అందుతున్నట్లు తెలిపారు. పేదలకు సన్న బియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు సైతం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూణం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్,కాంగ్రెస్ నాయకులు జాటోత్ హమ్యా నాయక్, డాక్టర్ పి. సోమేశ్వరరావు, గంజి విజయపాల్ రెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి,మేకల కుమార్, వెంకన్న యాదవ్,చెవిటి సదాకర్,మహబూబ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి,విక్రమ్ రెడ్డి,పింగిలి ఉష,రవి నాయక్, మిత్తింటి హరీష్, వెంకటాచారి,బిక్షం గౌడ్, దేవేందర్ రాజు,ప్రవీణ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, రమేష్, సాయి కిరణ్, నరేష్, సర్పంచ్ లు బంగారు రమేష్, అభిరామ్, బందు శ్రీనివాస్, జాటోత్ రాం లాల్,విజయ రవి, గంగా నరేష్, విజయ లింబ, కృష్ణ మూర్తి, మాధవరెడ్డి,పి.కళావతి,బానోత్ సాగర్, కవిత బాలకృష్ణ, ఎండి.మహి పాషా, బానోత్ బిక్షపతి, బానోత్ శ్రీను నాయక్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో విత్తనమేళాను ప్రారంభించిన కలెక్టర్



**మధిర/ఖమ్మం, జూలై 27, వుదయం ప్రతినిధి:** మదిర మండలంలోని మధిర రైతు వేదిక నందు ఏర్పాటుచేసిన విత్తనమేళా కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్ నీనో పరిస్థితుల్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో సాగయ్యే పెసర మినుము కంది బొబ్బర్లు నువ్వులు జొన్నలు మరియు కూరగాయల పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు దానికోసం రైతులందరికీ ప్రస్తుత పరిస్థితుల్లో వేసుకోవాల్సిన విత్తనాలను ప్రభుత్వం తరపున రైతు వేదికల్లో అందుబాటులో ఉంచిందని చెప్పారు. రైతులందరూ మూడు రోజులు 27 నుండి 29 పాటు రైతు వేదికలో నిర్వహించే విత్తనమేళానీ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర ఏ డి ఏ వాణిశ్రీ, ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్త నాగ స్వాతి, మధిర ఏవో సాయి దీక్షిత్, మధిర మండల ఏఈవోలు, ప్రజా ప్రతినిధులు, రైతులు మరియు విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**– వరంగల్, హనుమకొండ కలెక్టర్లకు 'టిజివైఎస్' వినతి**



**వరంగల్ టౌన్, జూలై 27 (వుదయం ప్రతినిధి) :** బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ యువజన సంఘం (TGYS) రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి చైర్మన్ గట్టు నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు TGYS ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ... పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ఆయన త్యాగాలను నేటి తరానికి తెలియజేసేలా ప్రజాప్రతినిధులు, గౌడ మరియు బహుజన సంఘాలను భాగస్వామ్యం చేస్తూ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు అధికారులకు ముందస్తు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్లను కోరారు. అలాగే జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఘనంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు బండారి జనార్దన్ గౌడ్, చిర్ర సుమన్ గౌడ్, నాగపూరి వెంకటేష్ గౌడ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

**కల్పలత సూపర్ బజార్ సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



**హనుమకొండ, జులై 27 (వుదయం జిల్లా ప్రతినిధి) :** హనుమకొండ నగరంలోని రంగంపేట వద్ద ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, సరుకుల లభ్యత, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ పనితీరును తనిఖీ చేసి, ఇంధన విక్రయాలు, నిర్వహణ, సిబ్బంది విధులు, రోజువారీ లావాదేవీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ బజార్ లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని పరిశీలించి, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరలు తదితర ఉత్పత్తుల నాణ్యత, విక్రయాలు, నిల్వల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా చర్యలుచేపట్టాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భం గా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి బి.మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి, ఆడిట్ అధికారి కోదండ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచాలి

**– కేంద్ర విద్యాశాఖను కోరిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**వరంగల్, జులై 27 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, కేంద్ర నిధుల కేటాయింపులపై ఆమె సమగ్ర వివరాలు కోరారు.దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. పీఎం ఈ–విద్య, దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా సాంకేతిక బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రానికి 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం తెలుపుతూ, రూ.108.98 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు డిజిటల్ వసతులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత కీలకమని, వీటి కోసం కేంద్రం నుంచి మరిన్ని నిధులు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.

## ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

**రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ**

**– జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, పరిశుభ్రతపై సమగ్ర పరిశీలన**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 27 (వుదయం ప్రతినిధి)** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన పలు కీలక సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, వార్డులు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.అనంతరం వైద్యాధికారితో సమావేశమై ఓపీ నమోదు వివరాలు, రోజువారీ రోగుల సంఖ్య, గత పది రోజులుగా నమోదైన జ్వర కేసులపై ఆరా తీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జ్వరాల పట్ల ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స అందించాలని, గ్రామాల్లో జ్వరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.రక్త పరీక్షల విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ మలేరియా, డెంగ్యూ, హెచ్‌ఐవీ నిర్ధారణకు అవసరమైన టెస్టింగ్ కిట్ల లభ్యత, నిర్వహిస్తున్న రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. ప్రయోగశాలలో అవసరమైన అన్ని పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు.మందుల నిల్వ గదిని సందర్శించి అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, గడువు తేదీలు, అవసరమైన మందుల లభ్యతను పరిశీలించారు. మందుల కొరత తలెత్తకుండా ముందుగానే ఇండెంట్లు పంపించి అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాము కాటుకు గురైన బాధితుల చికిత్సకు అవసరమైన యాంటీ స్నేక్ వెనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయా అని ప్రత్యేకంగా పరిశీలించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, ఆయుష్ ఔషధాల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను కూడా సమర్థవంతంగా అందించాలని సూచించారు. తనిఖీ అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, అన్ని పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఫంక్షన్ హాల్స్

**యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు**




**యాదాద్రి భువనగిరి జిల్లా తేది: 27.07.2026** సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ తో కలసి అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధి లోని ఫంక్షన్ హాల్స్ యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నీటి సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఫంక్షన్ హాల్ యజమాని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు ఫంక్షన్ హాల్స్‌ను సీజ్ చేసే వరకు కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాల కార్మికులు లేదా మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో నియమించరాదని స్పష్టం చేశారు. ఫంక్షన్ హాల్స్‌లో ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, చెంచాలు, ఫోర్కులు తదితర వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. వాటి స్థానంలో స్టీల్ పాత్రలు, ఆకుల విస్తర్లు, కాగితంతో తయారైన పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు వంటలు, శుభ్రపరిచే పనులకు అవసరమైన మేరకే నీటిని వినియోగించాలని, కుళాయిలు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వాడిన నీటిని తోటల నిర్వహణ, శుభ్రత పనులకు పునర్వినియోగం చేయాలని సూచించారు. ప్రతి ఫంక్షన్ హాల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ (RWHS) తప్పనిసరిగా ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేమట్టా దంపతులు



**సత్తుపల్లి జులై 27 (వుదయం ప్రతినిధి)** సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మట్ట దంపతులు పర్యటించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కల్లూరు వేంసూర్ మండలాల్లో ని చెన్నూరు బీరాపల్లి గ్రామాల్లో పలు కుటుంబాల పరామర్శించి, దశ దీన కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పుచ్చకాయల సోమిరెడ్డి, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు వేంసూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాస్ర చంద్రశేఖర్ రెడ్డి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ మందపాటి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూజీడీ పనుల్లో భారీ అవినీతి: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపణలు

**పనులు వెంటనే నిలిపివేసి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్**



**కోదాడ, జూలై 27(వుదయం)** కోదాడ పట్టణంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల్లో భారీ అవినీతి చోటు చేసుకుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. తన నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడుతున్నారని, దీంతో ప్రజలకు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.యూజీడీ ప్రాజెక్టు అసలు టెండర్ విలువ ₹182 కోట్లు మాత్రమేనని, అయితే ప్రజలకు విడుదల చేసిన ప్రకటనల్లో ₹258 కోట్లుగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యత్యాసంపై ప్రభుత్వం, అధికారులు ప్రజలకుస్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ బ్లాక్‌లిస్టులో ఉన్న సంస్థ అని, ఆ సంస్థపై కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ పనులు అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పనులను వెంటనే నిలిపివేసి, నాణ్యతా ప్రమాణాలతో తిరిగి ప్రారంభించాలని కోరారు. పట్టణ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోతున్నా, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ దెబ్బతిన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం మారిన తర్వాత మున్సిపాలిటీలో పనిచేస్తున్న 70 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంతో పారి శుద్ధ్య నిర్వహణ దెబ్బతిందన్నారు. యూజీడీ పనులపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బ్లాక్‌లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌ను తొలగించి పారదర్శకంగా పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరపున బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

# కరీంనగర్ | ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలి: కలెక్టర్

**వరి సాగుకు బదులుగా పప్పు ధాన్యాలు, నూనెగింజలు,**

**ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరచాలి**

**ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలి**

**వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్**



**పెద్దపల్లి, జూలై-27 (వుదయం ప్రతినిధి)**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సంబంధిత అధికారులతో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో ఖరీఫ్ సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, ఫార్మ్ పాండ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో వరి సాగును ప్రోత్సహించకుండా కందులు, పెసలు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పొలాలను బీడుగా ఉంచకుండా అందుబాటులో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా రైతులు ఆదాయం పొందడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కొనసాగుతాయని తెలిపారు.రాబోయే పది రోజులను ప్రత్యేక కార్యాచరణగా తీసుకొని గ్రామాల వారీగా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని, ప్రతిరోజూ ఎంతమంది రైతులు పంట మార్పిడికి ముందుకొచ్చారో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల మార్పిడి ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని సూచించారు.జిల్లాలో ఒంటరి మహిళా రైతులు, చిన్న, సన్నకారు రైతులకు ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు జిల్లా యంత్రాంగం ద్వారా అదనపు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 2.91 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని, రైతులు భూములను సాగు చేయకుండా ఖాళీగా ఉంచితే రైతు భరోసా వంటి ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రతి ఎకరా సాగులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భూగర్భ జలాల మట్టాలను పెంపొందించేందుకు ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపులను 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పెద్ద రైతులు, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తమ పొలాల్లో ఫార్మ్ పాండ్లు నిర్మించుకునేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అధికారుల నిర్లక్ష్యం..!

**ఐదుగురు అధికారులతోనే ముగిసిన కార్యక్రమం – పలువురు శాఖల అధికారులు గైర్హాజరు – మండల ప్రజల్లో అసంతృప్తి**



**నిజాంసాగర్ / కామారెడ్డి జులై 27 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, సంబంధిత శాఖల సమన్వయంతో సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం నిజాంసాగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి కేవలం ఐదుగురు అధికారులు మాత్రమే హాజరుకావడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది.కార్యక్రమానికి మండల తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీవో శివకృష్ణ, ఐకేపీ ఏపీఎం ప్రసన్నారాణి, ఆరోగ్య శాఖ సూపర్వైజర్ ఎల్జావతి హాజరయ్యారు. ఎంఈవో తిరుపతిరెడ్డి ఉపాధ్యాయుల సమావేశానికి హాజరుకావడంతో ఆయన స్థానంలో మండల కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు. మిగిలిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు ఎరువులు, విత్తనాలు, పంటల సాగు, సాంకేతిక సలహాలు తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రజావాణికి హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది.అదేవిధంగా ట్రాన్స్‌కో, ఉపాధి హామీ పథకం, పశు సంవర్ధక శాఖ, అటవీ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, ఐసీడీఎస్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు కూడా కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజావాణి ఉద్దేశమేంటి..?రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, భూ, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, వ్యవసాయం, విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, ఉపాధి తదితర సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తోంది. ఒకే వేదికపై అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి వినతులను స్వీకరించడం, శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అయితే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు గైర్హాజరవడం పట్ల మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోతే ప్రజావాణి నిర్వహణ ఉద్దేశమే దెబ్బతింటుందని వారు అభిప్రాయపడుతున్నారు. కొన్ని శాఖల అధికారులు సమావేశాలు, ఫీల్డ్ విధులు లేదా ఇతర పరిపాలనా కారణాలను చూపుతున్నప్పటికీ, ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు కూడా అదే స్థాయిలో బాధ్యతగా తీసుకొని తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై బాధ్యత నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపే వేదికగా రూపొందించిన ప్రజావాణి కార్యక్రమం అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతో లబ్ధి పొందాలి: కలెక్టర్



**మంచిర్యాల/జూలై 27(వుదయం ప్రతినిధి)**

ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటివరకు తక్కువ వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలలలో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. భూగర్భ జలం తక్కువగా ఉందని, రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని, అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించాలని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. బెల్లంపల్లి మండలం గురజాల గ్రామంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రస్తుత ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంట రకాన్ని ఎంచుకోవాలని, తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందని, రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలు పొందాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని మండల తహసిల్దార్ కృష్ణతో కలిసి సందర్శించి ప్రత్యేక సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల తరపున నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారి నుండి సేకరించి బూత్ స్థాయి అధికారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరి చూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీఎంఏఓ రాజ్ కుమార్



**ధర్మపురి, జూలై 27 (వుదయం ప్రతినిధి):**

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకా ణాల్లోని స్టాక్ వివరాలను, అధీకృత సంస్థల నుంచి వచ్చిన రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా ఎరు వులను నిల్వ ఉంచాలని డీలర్లకు సూచిం చారు.ముఖ్యంగా మార్కెట్‌లో డిఏపికి అధిక డిమాండ్ ఉన్న నేపథ్యం లో,షాపుల యజమానులు ఖచ్చితంగా ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కు లను రోజువారీగా అప్ డేట్ చేయడం తో పాటు,దుకాణాల ఎదుట ఎరువుల లభ్యత, ధరల పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి డీఏపీ నిల్వలను ఎక్కువ రేట్లకు అమ్మి తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యూరియా నిల్వలను తనిఖీ చేసిన ఆయన, ఈ వాన కాలం సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. మండలంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని, క్రమం తప్పకుండా యూరియా బుకింగ్ యాప్ ద్వారానే విక్ర యాలు జరపాలని స్పష్టం చేశారు.

## ఎయిర్‌పోర్టు నిధుల మంజూరుపై బీజేపీ సంబరాలు



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి):**

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తూ సోమవారం బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. స్థానిక కలెక్టర్ చౌరస్తా వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు జోగు రవి మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు భూసేకరణకు నిధులు కేటాయించడం ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగని అన్నారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, గంటా జీవన్, సాయి, రాకేష్, వేదవాస్, దినేష్ మటూలియా, హనుమన్న, పోశాలు, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, సూర్యకిరణ్, సతీష్ యాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జ్ ను కలిసి మొక్కను అందజేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ





**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా ప్రిన్సిపల్ & సెషన్స్ జడ్జ్ శారదాదేవి ని సోమవారం జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్పీ నికిత పంత్ లు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు: కలెక్టర్



**నిర్మల్ జిల్లా 27 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 లోపు "జలసిరి" పనులను పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ వి.భుజంగరావు**

**ఈ నెల 28న మండల స్థాయి సభలు**



**నిజామాబాద్, జూలై 27:**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా గ్రామగ్రామాన జలసిరి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి అనంతరం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 28న అన్ని మండలాలలో మండల స్థాయి సభలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. అదేవిధంగా 29, 30 తేదీలలో గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రామ సభలు జరపాలని అన్నారు. ఈ సభలలో ఎల్ నినో ప్రభావం గురించి, జల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా వీబీజీ రామ్–జీ పథకం కింద విరివిగా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి జాబ్ కార్డు కలిగిన కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని అన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు, ఏ.పీ.ఓలు, ఏ.ఈ.ఓ లు, వీ.ఓ లు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ఇలా అందరినీ భాగస్వామ్యం చేస్తూ నిర్ణీత గడువు లోపు జలసిరి కార్యక్రమాలు అమలయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. వాటర్ షెడ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణ జరగడంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించి పని దినాల లక్ష్యాన్ని సాధించవచ్చని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి రోజు సగటున 60 మందికి పని కల్పించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. భూగర్భ జలాల పెంపునకు దోహద పడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా వీ.ఓ భవన నిర్మాణ పనులను కూడా నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన కలెక్టర్**



**జగిత్యాల జులై 27 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా తేది 27 7 2026 నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్ సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సది కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానుకోండూర్ జూలై 27 (వుదయం ప్రతినిది):**

మాతృ వియోగానికి గురైన మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ నెలవేణి సది కుటుంబాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారంపరామర్శించారు. ఈ సందర్భంగా రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజమ్మ మృతిపై ఆయన తీవ్ర విచారం వ్యక్తంచేశారు. కుటుంబ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి పార్టీ తరపున, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ఈవిషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిం చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, దేవంపల్లి సింగిల్ విండో చైర్మన్ఊంటాల లక్ష్మారెడ్డి, పచ్చునూరు గ్రామశాఖ అధ్యక్షుడు బాలగోని మల్లయ్య,ఉప సర్పంచ్ అనిల్, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీధర్, పిట్టల సంపత్, ఎం.శ్రీకాంత్, ఎస్.మల్లయ్య, సమ్మయ్య, అయిలవేణి రాజయ్య, డిష్ వెంకట్ తదితరులు.

## బాధిత కుటుంబాలను పరా మర్శ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ధర్మపురి, జులై27 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన బిఆర్ఎస్ నాయకులతో పాటు,ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. జైన్ గ్రామానికి చెందిన బిఆర్ ఎస్ పార్టీ నాయకుడు ముడి మడుగు శ్రీనివాస్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తలకు శస్త్రచికిత్స చేయించుకోగా, ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోస్నూర్ పల్లె గ్రామానికి చెందిన సర్పంచ్ ఎన్నం రమాదేవి–లక్ష్మారెడ్డిల మామ నర్సింహారెడ్డి అనారో గ్యంతో బాధపడుతుండటంతో ఆయనను కలిసి ధైర్యం చెప్పా రు.అనంతరం మగ్గిడి ఎడపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పం చ్ శ్రీనివాస్ తండ్రి, ప్రస్తుత ఉప సర్పంచ్ గల్లె సోమేష్ తల్లి భూమక్కలు ఇటీవలే వేర్వేరుగా మృతి చెందగా ఆయా కుటుం బాలను ఈశ్వర్ పరామర్శిం చారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించి, తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## పేటలో సుగప్పకు ఘన నివాళి

**నారాయణపేట, జూలై 27 (వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కున్సీ సుగప్ప అకాల మరణం పట్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు ,ముదిరాజ్ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గతంలో ఆయన నారాయణపేట పట్టణానికి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకొని కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని వారు వ్యక్తం చేశారు. అంతేకాక ముదిరాజ్ సమాజ అభ్యున్నతికి జీవితాంతం సేవలందించిన రాష్ట్రస్థాయి నాయకులు సుగప్ప ముదిరాజ్ మరణం అత్యంత బాధాకరమని వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం సుగప్ప సొంత గ్రామం అయినా కున్సీ గ్రామానికి అంత్యక్రియల కోసం నారాయణపేట కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హనుమంతు, మిర్చి వెంకటయ్య, కాంత్ కుమార్, హంసరాజు, కార్వర్ భీమయ్య, మనోహర్ గౌడ్ ప్రసాద్ ,వకీల్ సంతోష్ కుమార్, సరాఫ్ నాగరాజు ,బోయ రమేష్, కుంటిమారి అశోక్ లతోపాటు తదితరులు హాజరయ్యారు.

## చుక్క నీరు... చావు కేక!

- **ఇంకిపోతున్న నేల తల్లి గుండెలు... ఇంకెన్నాళ్లీ నిశ్శబ్ద రోదనం?**
- **ఒక్క బొట్టు కోసం రేపు యుద్ధాలా?... నేడే మేల్కొనకపోతే సర్వనాశనమే!**
- **(ప్రత్యేక కథనం):**
- **"నీళ్లు... నీళ్లు... నీళ్లు...!"**

**గద్వాల జూలై 27(వుదయం బ్యూరో)**

ఇది కేవలం ఒక ఎండిన పొలం నుంచి వస్తున్న అరుపు కాదు. ఇంకిపోతున్న భూమాత గర్భంలోంచి ఉప్పొంగుతున్న ఆర్తనాదం! దప్పికతో బీటలు వారిన నేల నిశ్శబ్ద రోదనం! జీవం కోసం తల్లడిల్లుతున్న ప్రతి ప్రాణి చివరి ఆశ! ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన పంటపొలాలు నేడు శ్మశాన భస్మాన్ని కప్పుకున్నట్లు భీతావహంగా కనిపిస్తున్నాయి. గలగల పారిన వాగులు మట్టిదిబ్బలయ్యాయి. ఊరికి ఊపిరిగా నిలిచిన చెరువులు అడుగంటిపోగా... నింగివైపు చూసే రైతు కళ్లలో పంటల కలలు ఆవిరై, ఆత్మ వేదన కన్నీళ్లు మాత్రమే మిగిలాయి.

సంక్షోభం కాదు... ఇది 'మానవనిర్మిత విధ్వంసం'! నీరు లేకపోవడం అనేది ప్రకృతి చేసిన నేరం కాదు... మనుషులు చేస్తున్న ఉన్మాదం! ఇది కేవలం వాతావరణ మార్పు కాదు, పల్లెల గుండెల్లో పొడుస్తున్న ఆర్థిక, సామాజిక విషాదం. రుణాల రొంపి రైతన్న బలి: సాగునీరు కరువై పంటలు ఎండిపోతుంటే... అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఉరితాళ్లే శరణ్యమవుతున్నాయి. వలసల బాటలో పల్లెలు: తాగడానికి చుక్క నీరు లేక, చేతిలో పనిలేక పల్లెలు ఖాళీ అవుతున్నాయి. భూమిని నమ్ముకున్న చేతులు నగరాల వీధుల్లో బిచ్చమెత్తుకునే దుస్థితి వస్తోంది.

**ఆకలి కేకలు: నీటి సంక్షోభం రేపటి ఆహార భద్రతను డైనమైట్ పెట్టి పేల్చేస్తోంది.**

గుర్తుంచుకోండి: మనం ఈ రోజు విచ్చలవిడిగా వృథా చేస్తున్న ప్రతి నీటి బొట్టూ... రేపు మన బిడ్డల గొంతును పిండేసే దాహార్తిగా మారబోతోంది. మనం పూడ్చివేస్తున్న ప్రతి చెరువూ... రేపు ఒక ఊరి మరణ శాసనమవుతుంది. మనం నరికివేస్తున్న ప్రతి చెట్టూ... రేపటి వర్షాన్ని సరిహద్దుల నుంచే తరిమేస్తోంది.

ఆఖరి హెచ్చరిక: ఇంకెంతకాలం ఈ నిర్లక్ష్యం? ప్రకృతిపై ఆధిపత్యం చలాయించే అహంకారాన్ని పక్కనపెట్టి... ప్రకృతితో కలిసి నడవడమే మనకు మిగిలిన ఏకైక మార్గం! తక్షణమే ఈ 'యుద్ధ ప్రాతిపదిక' చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు శూన్యమే:

రైన్ వాటర్ హార్వెస్టింగ్ (ప్రజా ఉద్యమం): ఆకాశం నుంచి పడే ప్రతి వర్షపు బొట్టును నేల గర్భంలోకి మళ్లించాలి. ప్రతి ఇంటికీ 'ఇంకుడు గుంత' నిర్మాణం విధిగా మారాలి.

జల మూలాల విముక్తి: ఆక్రమణదారుల కోరల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాలువలను విడిపించాలి. పూడిక తీసి జలసిరులకు పూర్వవైభవం తేవాలి.

హరిత సంకల్పం: చెట్లు నాటడం అనేది ఏదో ప్రభుత్వ ఫోటోషూట్ కార్యక్రమం కాకూడదు... అది ప్రతి పౌరుడి నైతిక బాధ్యత, ధర్మం కావాలి. నీటి పొదుపు ప్రతి ఇంట సంస్కారం: నీటిని పొదుపుగా వాడుకోవడం నేర్చుకోవాలి. అది చట్టాల వల్ల కాదు... మన సంస్కారంలో భాగం కావాలి. నీరంటే ద్రవం కాదు... మనుగడకు ప్రాణవాయువు! నీరు అంటే రసాయన సూత్రాల కలయిక మాత్రమే కాదు...



**నీరు అంటే రైతు నుదుటిపై విరబూసే చిరునవ్వు! నీరు అంటే తల్లి ప్రేమానురాగాలతో వండే అన్నం! నీరు అంటే జీవకోటి మనుగడకు ఆక్సిజన్!**

గతంలో యుద్ధాలు భూముల కోసం, బంగారం కోసం జరిగాయి. కానీ... రేపటి తరాలు ఒక్క నీటి బొట్టు కోసం రక్తం చిందించే పరిస్థితి రావొద్దు! ఆ మారణహోమాన్ని ఆపాలంటే... ఈరోజే, ఈ క్షణాన్నే మన చేతుల్లోని నీటి విలువను గుర్తించాలి. నీటిని కాపాడడం ఒక అలవాటు కాదు... అది మన జాతి మనుగడకు ఇచ్చుకునే ప్రాణ హామీ!ప్రతి బొట్టునూ రక్షిద్దాం... మన భవిష్యత్తును బ్రతికించుకుందాం!

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి, వుదయం:**

గ్రూప్1, 2, 3, 4, RRB, SSC, బ్యాంకింగ్, పోలీస్ నియామక పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీష్ తెలిపారు.డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆగస్టు 14వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.వెబ్సైట్: http:// tsbcstudycircle.cgg.gov.inకా డిలెన్కు మరో ఎంపిక:గ్రూప్స్, RRB, SSC, బ్యాంకింగ్, పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ.. ఆగస్టు 14లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**నారాయణపేట టౌన్, జూలై 27(వుదయం ప్రతినిధి):**

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో చర్యలు తీసుకోవాలి

- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో పరిష్కరించాలి**
- **ప్రజావాణిలో 99 వినతులు స్వీకరణ.....జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, జూలై 27(వు దయం):**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన ఫిర్యాదులతో పాటు జిల్లా ప్రజావాణిలో అందిన వినతులను కూడా సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు.

నేటి ప్రజావాణిలో మొత్తం 99 వినతులు అందాయి. వాటిలో సంగారెడ్డి డివిజన్కు 14, నారాయణఖేడ్ డివిజన్కు 5, జహీరాబాద్ డివిజన్కు 39, కలెక్టరేట్కు 41 వినతులు అందగా, అందోల్ డివిజన్కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయం, పెన్షన్లు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం, పంచాయతీరాజ్, నీటిపారుదల, పోలీసు, రిజిస్ట్రేషన్, కార్మిక, విద్య, ఆర్టీసీ, పౌరసరఫరాలు, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలు, పురపాలక సంస్థలకు సంబంధించినవి.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉత్తర్వులు బేఖాతర్..!

- **ట్రాఫిక్ ఎస్సైల 'మామూళ్ల' రాజ్యం యథాతథం**
- **172 మంది ఎస్సైల బదిలీలు**
- **బదిలీ అయినా పాత స్టేషన్లోనే విధులు**
- **కమిషనరేట్లో తీవ్ర చర్చ**

**వికారాబాద్, జులై 27 (వుదయం బ్యూరో):**

హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసు విభాగంలో బదిలీ ఉత్తర్వులు జారీ అయినా వాటి అమలు మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. నగర కమిషనరేట్ పరిధిలో ఇటీవల బదిలీ అయిన పలువురు ట్రాఫిక్ ఎస్సైలు కొత్త పోస్టింగులకు వెళ్లకుండా పాత స్టేషన్లలోనే కొనసాగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నో ఎంట్రీలు, ట్రాఫిక్ నిబంధనలు, ఫుట్ పాత్ ఆక్రమణలు, పార్కింగ్ ఉల్లంఘనల పేరుతో వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని భారీ ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారుల అండదండలతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందని పోలీసు వర్గాల్లోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత నెలలో నగర పరిధిలో 172 మంది ఎస్సైలకు బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వీరిలో సగం మందికి పైగా ఇప్పటికీ రిలీవ్ కాకుండా పాత స్టేషన్లలోనే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. డీజీ స్థాయి అధికారి ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా వ్యవహరిస్తుండటం శాఖలో క్రమశిక్షణకు పెద్ద దెబ్బగా మారిందని అధికారులు చర్చించుకుంటున్నారు.

**జూబ్లీహిల్స్ జోన్లో అదే కథ**

జూబ్లీహిల్స్ జోన్ పరిధిలోని ఓ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేసిన ఎస్సైపై గతంలో భారీ స్థాయిలో అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సెలవుపై పంపినట్లు సమాచారం. అనంతరం తిరిగి అదే స్టేషన్లో విధుల్లో చేరిన ఆయనకు ఇటీవల సికింద్రాబాద్ జోన్కు బదిలీ అయినప్పటికీ చాలారోజుల పాటు రిలీవ్ కాకుండా అక్కడే కొనసాగినట్లు తెలిసింది. ఈ సమయంలో భారీ స్థాయిలో మామూళ్లు వసూలు చేశారని అదే స్టేషన్కు చెందిన సిబ్బంది ఆరోపిస్తున్నట్లు సమాచారం.




వ్యాపారులకు బదిలీ విషయం తెలియకపోవడంతో ఆయన పాత అధికారాన్ని కొనసాగిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని చెబుతున్నారు.

**చార్మినార్ జోన్లో మరో వివాదం**

చార్మినార్ జోన్ పరిధిలో పనిచేసిన మరో ట్రాఫిక్ ఎస్సైకి గోల్కొండ జోన్కు బదిలీ అయినప్పటికీ పాత స్టేషన్లోనే కొనసాగినట్లు సమాచారం. ఇదే సమయంలో వ్యక్తిగత వివాదం, వివాహేతర సంబంధ ఆరోపణలతో స్టేషన్ ఆవరణలోనే గొడవ చోటుచేసుకోవడం శాఖలో చర్చనీయాంశమైంది. బదిలీ అమలై ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**ఎవరి అండతో ఈ ధైర్యం?**

డీజీ స్థాయి ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా కొందరు ఎస్సైలు అదే స్టేషన్లలో కొనసాగడం వెనుక ఉన్నతాధికారుల అండ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శాఖలోని కొందరు కీలక అధికారులు మౌనంగా ఉండటంతో బదిలీ ప్రక్రియే అర్థరహితంగా మారిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణ చేపట్టాలని డిమాండ్**

బదిలీ ఉత్తర్వులు అమలు కాకపోవడం, రిలీవ్ ప్రక్రియలో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్ల ఆరోపణలు, శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు వర్గాలు, వ్యాపార సంఘాలు, ప్రజలు కోరుతున్నారు. బదిలీ ఉత్తర్వులను ఉల్లంఘించిన అధికారులు ఎవరు? వారిని ఎందుకు రిలీవ్ చేయలేదు? ఈ వ్యవహారం వెనుక ఎవరి పాత్ర ఉంది? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సంక్షేమ వసతి గృహాలను వారానికి రెండుసార్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలి

- **ప్రతి సోమవారం, శనివారం జిల్లా అధికారులు సందర్శించాలి**
- **తనిఖీ వివరాలను 'X' లో అప్‌లోడ్ చేసి కలెక్టర్‌కు ట్యాగ్ చేయాలని ఆదేశం**
- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్‌కర్నూల్, జులై 27 (వుదయం బ్యూరో) :**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు నాణ్యతతో అందేలా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల తనిఖీలపై జిల్లా అధికారులు సమర్పించిన నివేదికలను కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల తనిఖీలను కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి సోమవారం, శనివారం తప్పనిసరిగా ఆయా శాఖలకు కేటాయించిన వసతి గృహాలను జిల్లా అధికారులు స్వయంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, భోజనం, పరిశుభ్రత, భద్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.

వంటశాలల పరిశుభ్రత, నిల్వ ఉంచిన ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి స్వచ్ఛత, వంట చేసే సిబ్బంది పరిశుభ్రత, భోజనశాల నిర్వహణ వంటి అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, పడకలు, పరుపులు, కిటికీలు, భద్రతా ఏర్పాట్లు,




ప్రహరీ గోడలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అన్ని మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని వెంటనే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వసతి గృహాల తనిఖీలు నిర్వహించిన అనంతరం సంబంధిత జిల్లా అధికారులు సందర్శనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫొటోలు, గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రతి జిల్లా అధికారి తమ అధికారిక 'ఎక్స్' (X) సోషల్ మీడియా ఖాతాలో తప్పనిసరిగా అప్‌లోడ్ చేసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్ అధికారిక ఖాతాకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల తనిఖీల్లో పారదర్శకత పెరగడమే కాకుండా, ప్రతి వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు.

తనిఖీలను కేవలం రికార్డులకే పరిమితం చేయకుండా, ప్రతి సందర్శన ఫలితాలు విద్యార్థుల జీవితాల్లో కనిపించేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం జిల్లా యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిన్నయ్య, దేవ సహాయం, జిల్లా రెవిన్యూ అధికారి పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనానికి బాట

- **వడ్డేపల్లి గ్రామంలో మొక్కలు నాటి హరితహారం కార్యక్రమం**

**దౌల్తాబాద్ జులై 27(వుదయం):**

రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో సోమవారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రేణుక రాజా గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పచ్చదన పరిరక్షణకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక రాజా గౌడ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా వర్షాలు, భూగర్భ జలాల పెరుగుదల, జీవవైవిధ్య పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని బాధ్యతగా సంరక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. హరితహారం కార్యక్రమం కేవలం మొక్కలు నాటడంతో ముగియకుండా, అవి పెద్ద



చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని, భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి గ్రామాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## వర్షా భావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలే శ్రేయస్కరం: జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, జులై 27 (వుదయం బ్యూరో)**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు వరి సాగుకు దూరంగా ఉంటూ, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభోత్సవం అనంతరం రైతులకు ఆరుతడి పంటల విత్తనాలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందన్నారు. జిల్లాలో సాధారణంగా నమోదుకావాల్సిన 256 మి.మీ. వర్షపాతానికి గాను కేవలం 176 మి.మీ. మాత్రమే నమోదైందని, అన్ని మండలాల్లో లోటు వర్షపాతం నెలకొనగా... హుస్నాబాద్, వర్గల్, ములుగు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నారు పోసే సమయంలోనే నీటి కొరత ఉంటే, కోత సమయానికి వరి పంటకు నీరు అందించడం కష్టమవుతుందన్నారు. వరి సాగుకు ఎకరానికి రోజుకు 25 వేల లీటర్ల నీరు అవసరమని, అదే నీటితో 6 నుండి 8 ఎకరాల్లో మెట్ట పంటలు పండించవచ్చని వివరించారు.రైతులు భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని కోరారు. ఈ నెల 31 వరకు మొక్కజొన్న, పెసలు, మినుములు, అలసందలు, వేరుశనగ పంటలు వేసుకోవచ్చని... రాగులు, కందులు, పొద్దుతిరుగుడు, మిల్లెట్స్, కొర్రలు, అరికెలు, ఆముదం వంటి పంటలను ఆగస్టు 30 వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు డ్రిప్, అంతర పంటలపై సబ్సిడీ లభిస్తుందని, జిల్లాలో కూరగాయలు, ఆకుకూరలకు మంచి డిమాండ్ ఉన్నందున వాటి సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.



గత రబీలో రికార్డు స్థాయిలో 5.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినందున ధాన్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. వివిబి జి రాంజీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా ఫామ్ పాండ్స్ నిర్మించుకుని భూగర్భ జలాలను పెంచుకోవడంతో పాటు చేపల పెంపకం, కూరగాయల సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ స్ట్రక్చర్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు పండించే ఏ పంటకైనా ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని, శాస్త్రవేత్తల సలహాలతో లాభదాయక వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవనాధికారి సువర్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, స్థానిక సర్పంచ్ చింతల శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, మండల, గ్రామ స్థాయి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ కృషి

**పటాన్‌చెరు, జూలై 27:వు దయం:**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో పార్కర్ హనీఫిన్ ఇండియా సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యా కిట్లు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం ఎంపీపీఎస్ గణపతిగూడ, పోచారం ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, రబ్బర్లు, పలకలు తదితర విద్యా సామగ్రితో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు.

మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గత ఐదేళ్లుగా విద్యా కిట్ల పంపిణీతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తాము ఎంచుకున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు అనేక మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. కమ్యూనిటీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తూ వారికి అండగా నిలుస్తున్న సంస్థకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, ప్రకాష్, సుభాష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పార్కర్ కోఆర్డినేటర్లు హాఫీజ్, ఆమదాయ్య తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా ప్రజావాణి అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష

**వనపర్తి జూలై 27 (వుదయం ప్రతినిధి)**

జిల్లా ప్రజావాణితోపాటు, సీఎం ప్రజావాణి అర్జీలను ప్రాధాన్యతగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారమివ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచనలు ఇచ్చారు.



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సీఎం, జిల్లా మంత్రి నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 45 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 2 దరఖాస్తులు వచ్చాయి. నేటి ప్రజావాణిలో జెడ్పి సీఈవో యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. తిరుపతయ్య, శిక్షణ ఉప కలెక్టర్లు మేడం శ్రావ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి



- **వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి**

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట రైతువేదికలో రైతులకు ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల సంభవించబోయే వర్షభావ పరిస్థితుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా రైతులు వరి పంటకు బదులు తక్కువ నీటి తడులతో పండే పంటలు అయిన కందులు, పెసలు ,ఆముదం ,నువ్వులు మరియు ఆయిల్ ఫామ్ పంటల ను సాగు చేసుకోవడం ద్వారా రాబోయే వర్షాభావ పరిస్థితులను అధిగమించి పంటలను పండించుకొనే అవకాశం ఉంటుందని వివరించడం జరిగింది. భారత వాతావరణ శాఖ సూచనల మేరకు రాబోయే ఆగస్టు మరియు సెప్టెంబర్ మాసాల్లో వర్షపాతం చాలా తక్కువ గా నమోదయ్యే అవకాశం ఉంటుందని చెప్పడం జరిగింది.అలాగే రైతులకు కావలసిన స్వల్పకాలిక పంటల విత్తనాలను అందుబాటులో ఉంచడం కూడా జరుగుతుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, గ్రామ సర్పంచ్ నరేందర్, వార్డు సభ్యుడు బండారి ఎల్లం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడువెంకటేష్ గౌడ్, ఏఈఓ లు శ్రీలత, కావ్య, రమ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఆధునిక పరికరాల అందజేత

**మహబూబ్ నగర్ జిల్లా 27జూన్( వుదయం బ్యూరో)**

మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు కీలక అడుగు పడింది ముడా నిధులు రూ.15 లక్షలు వెచ్చించి అధునాతన శస్త్ర చికిత్స పరికరాలను సమకూర్చారు. ఈ పరికరాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆధునిక పరికరాల అందుబాటుతో రోగులకు మెరుగైన చికిత్స లభిస్తుందని, ముఖ్యంగా అత్యవసర శస్త్ర చికిత్సలు మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, కార్పొరేటర్లు



సల్మాన్, షబ్బీర్ అహ్మద్, రమేష్ రెడ్డి, ఫక్ర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# సార్ ప్రక్రియ వేగవంతం కావాలని



**మరికల్ జూలై 27 (వుదయం ప్రతినిధి)**

మరికల్ కేంద్ర పరిధిలోని పల్లె గడ్డ మాదారం తీయబోదు గ్రామంలో బీజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు బిజెపి రాష్ట్ర కమిటీ నెంబర్ గా నాగరవనామాజీ ప్రతి గ్రామంలో అందరి ముందుకు వచ్చి ఎక్కడున్నా ఎన్నిమరేషన్ ఫాన్స్ నింపి ఇవ్వాలని ఎక్కడున్నా ఇంటి దగ్గర ఉన్న వారికి ఇన్ఫర్మేషన్ ఇస్తే వాళ్ళు తమ ఫామును ఫిల్ అప్ చేసి బిఎల్ వాళ్లకి ఇస్తారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు బి ఎల్ ఓ తిరుపతిరెడ్డి మండల అధ్యక్షుడు మంగళ వేణుగోపాల్ రాజేష్ వడ్డే శ్రీరామ్ రాఘవేందర్ శ్రీకాంత్ నితిన్ నరేందర్ బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# అంగన్వాడీ పిల్లలకు పలకలు బలపాలు, కుర్చీలు పంపిణీ

- **ఏ సహాయం కావాలన్నా అందిస్తా - కౌన్సిలర్ కొత్త గంగాధర్**

**నాగర్ కర్నూల్, జులై 27 (వుదయం ప్రతినిధి) :**

పిల్లల విద్యకు, అంగన్వాడీల అభివృద్ధికి తమ వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని 13వ వార్డు కౌన్సిలర్ కొత్త గంగాధర్ పేర్కొన్నారు.సోమవారం 2వ వార్డులోని అంగన్వాడీ సెంటర్ 4లో ఆయన ఆధ్వర్యంలో అంగన్వాడీలో చదువుతున్న చిన్నారులకు పలకలు, బలపాలు, స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా టీచర్లు కూర్చోవడానికి కుర్చీలను కూడా అందజేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ గంగాధర్ మాట్లాడుతూ అంగన్వాడీలో చదివే పిల్లలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను వెంటనే స్పందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎలకొండ నిరంజన్, కొండూరు జయకృష్ణ, వంకేశ్వరం శ్రీకాంత్, వంకేశ్వరం నిరంజన్, కొత్త వెంకటేష్‌తో పాటు అంగన్వాడీలో చదివే పిల్లలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజానెల్లి లో ఆషాఢ మాస బోనాలు

**కోహీర్ జులై 27 (వుదయం ప్రతినిధి )**



రాజనెల్లి గ్రామంలో ఆషాఢ మాస బోనాల వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, హారతులు నిర్వహించి, గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, అందరికీ సుఖశాంతులు చేకూరాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి. బోనాలతో వచ్చిన మహిళలతో గ్రామంలోని పురవీధులన్నీ కోలాహలంగా మారాయి. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి గీతాల ఆలాపనలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగురంగుల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ పండుగ వాతావరణం గ్రామస్థుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమృతప్ప పాటిల్, ఉప. సర్పంచ్ సీ. భాగ్యమ్మ గ్రామ పెద్దలు పాండరినాథ్ రెడ్డి - పాపిరెడ్డి -

**రఘుమోహన్ రెడ్డి – రాజవర్ధన్ రెడ్డి**

మాణిక్యప్ప - విలేజ్ ప్రెసిడెంట్ (గ్రామఅధ్యక్షుడు)పెంటమ్మ బుజ్జమ్మ-మెంబర్ ఈశ్వరప్ప రాజు గౌస్ శాంసంగ్. తదితరులు విశేష సంఖ్యలో పాల్గోని ఉత్సవలను దిగ్విజయం చేశారు

# వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**జగదేవ్‌పూర్, జూలై 27 (వుదయం ప్రతినిధి):**

ప్రస్తుత వానాకాలంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన్ రెడ్డి మరియు మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు సూచించారు. సోమవారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల విత్తన మేళా" కార్యక్రమాన్ని ఆత్మ కమిటీ సభ్యులు బ్రహ్మచారి, నర్సింలు అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... వానాకాలంలో కేవలం వరిపైనే ఆధారపడకుండా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవడం వల్ల మంచి దిగుబడులతో పాటు ఆర్థికంగానూ ప్రయోజనం ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వసంతరావు మాట్లాడుతూ... ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేలలో ఉన్న తేమను సద్వినియోగం చేసుకుంటూ కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. ఈ మేళాలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడమే కాకుండా, వాటి సాగు యాజమాన్య పద్ధతులపై అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శరణ్య, సాయి ప్రసన్న, కృష్ణమూర్తి, కిరణ్, విత్తన వ్యాపారులు నాగరాజు, చంద్రశేఖర్, సురేష్, మహిపాల్, ప్రసాద్, సిద్దులుతో పాటు సిరిసిల్ల వ్యవసాయ కళాశాల గ్రామీణ వ్యవసాయ అనుభవ విద్యార్థులు మరియు జగదేవ్‌పూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విత్తనాలను కొనుగోలు చేశారు.

# పేరుకే శిలాఫలకం - పనులు మాత్రం శూన్యం

- **సంవత్సరం గడిచినా ప్రారంభం కాని డ్రైనేజీ పనులు**
- **తక్షణమే పనులు ప్రారంభించాలి - మాజీ చైర్మన్ ఎడ్ల నర్సింహ గౌడ్ డిమాండ్**

**అచ్చంపేట, జులై 27 (వుదయం ప్రతినిధి) :**

మున్సిపల్‌లోని వివిధ వార్డుల్లో "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే తీరు ఉందని అచ్చంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్ల నర్సింహ గౌడ్ ఆరోపించారు.సోమవారం పట్టణంలోని 5వ వార్డులో మాజీ కౌన్సిలర్లు మన్ను పటేల్, రమేష్ రావుతో కలిసి ఆయన కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నర్సింహ గౌడ్ మాట్లాడుతూ గత సంవత్సరంగత సంవత్సరం జూన్ 3 న రూ. 3 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా, నేటికి సంవత్సరం గడిచినా పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. శిలాఫలకం మాత్రమే ఉండి పనులు జరగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు పారుతూ దుర్వాసన వెదజల్లుతోందని, దోమల




బెడద పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కాలనీవాసులు తమ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు.తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు స్పందించి 5వ వార్డులో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సజ్జపూర్ లో ఘనంగా ఆషాఢ మాస బోనాలు

**కోహీర్ జులై 27 (వుదయం ప్రతినిధి )**

సజ్జపూర్ గ్రామంలో ఆషాఢ మాస బోనాల వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, హారతులు నిర్వహించి, గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, అందరికీ సుఖశాంతులు చేకూరాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఉదయం నుంచే ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి. బోనాలతో వచ్చిన మహిళలతో గ్రామంలోని పురవీధులన్నీ కోలాహలంగా మారాయి. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి గీతాల ఆలాపనలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగురంగుల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు.



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ పండుగ వాతావరణం గ్రామస్థుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమృతప్ప పాటిల్, ఉప. సర్పంచ్ సీ. భాగ్యమ్మ గ్రామ పెద్దలు
పాండరినాథ్ రెడ్డి -
పి. పాపిరెడ్డి -
రఘుమోహన్ రెడ్డి -
రాజవర్ధన్ రెడ్డి
మాణిక్యప్ప - విలేజ్ ప్రెసిడెంట్ (గ్రామ అధ్యక్షుడు)
శామ్సన్
పెంతమ్మ బుజ్జమ్మ - మెంబర్
ఈశ్వరప్ప రాజు గౌస్ విశేష సంఖ్యలో ఉత్సవలను దిగ్విజయం చేశారు

# ఆగస్టు 6 నుండి 14 వరకు సి పి ఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు




- **ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాం - సి పి ఐ నేతలు**

**నాగర్ కర్నూల్, జులై 27 (వుదయం ప్రతినిధి) :**

ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల పారదర్శక అమలును డిమాండ్ చేస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు సి పి ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తామని సి పి ఐ నేతలు ప్రకటించారు.

సోమవారం నాడు జిల్లా కేంద్రంలోని సి పి ఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు V. రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సి పి ఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

**M. బాల నరసింహ హాజరై మాట్లాడుతూ....**

కేంద్రంలో NDA ప్రభుత్వం 12 సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని విమర్శించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, యువతను మతం, కులం పేరిట రెచ్చగొడుతూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. "ఇక చెల్లవు మీ ఆటలు" అని చెప్పడానికే ప్రస్తుతం జరుగుతున్న Gen Z ఉద్యమం నిదర్శనమని పేర్కొన్నారు. రాముని పేరుతో అధికారంలోకి వచ్చి అయోధ్య రామాలయ విరాళాలను మింగిన చరిత్ర BJPదేనని, చివరకు దేశ ప్రజలను కాదు దేవుడిని కూడా మోసం చేశారని మండిపడ్డారు. అదేవిధంగా సి పి ఐ జిల్లా కార్యదర్శి S.M.D. ఫయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలలో 12 తప్ప మిగతావి అమలు కావడం లేదని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అధికార పార్టీ వారు నిజమైన అర్హులకు కాకుండా తమకు నచ్చిన వారికి ఇస్తున్నారని విమర్శించారు. ప్రతి ఊరిలో ప్రభుత్వ అధికారుల చేత సర్వే చేయించి, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులకు మాత్రమే పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సి పి ఐ జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, సంక్షేమ పథకాల పారదర్శకత కోసం గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకొని ప్రభుత్వాల మెడలు వంచడం కోసమే ఈ పాదయాత్రలు అని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సి పి ఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, R. ఇందిరమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బిజ్జ శ్రీనివాసులు, కుతుబుద్దీన్, కాజా మైనోద్దీన్, తుమ్మల శివుడు, బండి లక్ష్మీపతి, కిరణ్ కుమార్, T. మల్లయ్య, పరశురాములు, మధు గౌడ్, శివశంకర్, వెంకటమ్మ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పథకం ప్రకారం హత్య నిందితుల అరెస్ట్

- **నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట, జూలై 27 (వుదయం ప్రతినిధి):**

మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదవరావుపల్లి గ్రామానికి చెందిన గొయికల శాంతమ్మ (45) అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 15న మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.

దర్యాప్తులో భాగంగా మృతురాలి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకోవాలనే ఉద్దేశంతో జోగు రాజు ఏ 1,బడుగుల భాస్కర్ ఏ 2 ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఈ నెల 12న శాంతమ్మను ఫోన్ ద్వారా మద్దూర్‌కు రప్పించి, మోటార్ సైకిల్‌పై జాజాపూర్ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవించిన అనంతరం ఆమెతో శారీరకంగా కలిసి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది.హత్య అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, పర్సు, ఆధార్ కార్డును తీసుకుని, ఆధారాలను నాశనం చేసే ఉద్దేశంతో వాటిని బోరు కేసింగ్‌లో పడవేశారు. అనంతరం బంగారు నగలను నారాయణపేటలో విక్రయించి వచ్చిన నగదును ఇద్దరూ పంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి ఒక తులం బంగారు ఆభరణాలు కమ్మలు, మ్యాట్నీలు, పుస్తెల గుండ్లు, 50 తులాల వెండి ఆభరణాలు కడియాలు, పట్టీలు, రూ.50,000 నగదు, నేరానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు నగలను కొనుగోలు చేసిన జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ ఏ 3ను కూడా అరెస్ట్ చేసి, ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు




విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలను అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# సిద్దిపేటలో నీటి సంక్షోభ నివారణకు కలెక్టర్ దిశానిర్దేశం

- **ప్రతి పంచాయతీలో 100 ఫామ్ పాండ్స్ నిర్మాణం**

**సిద్దిపేట, జూలై 27 (వుదయం బ్యూరో)**

ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదై, భూగర్భ జలాలు రోజురోజుకూ క్షీణిస్తున్న నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా ప్రతి మండలంలో రెండు రోజుల్లో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగు సాధ్యపడదని, అందుకే రైతులు భూములను ఖాళీగా ఉంచకుండా మెట్ట పంటలు వేసేలా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. రైతుల కోసం మెట్ట పంటల విత్తనాలతో పాటు శాస్త్రవేత్తల సేవలను కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచామని, లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.జిల్లాలో ఉన్న నీటి వనరులు తాగునీటికి సరిపోతాయని స్పష్టం చేసిన కలెక్టర్, ముఖ్యంగా బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించామని వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల వృద్ధికి వీబీజీ రామ్‌జీ, జలసిరి పథకాల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 100 ఫామ్ పాండ్స్ నిర్మించాలని స్పష్టం చేశారు. వీటితో పాటు పెర్క్యులేషన్ పాండ్స్, బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్, కమ్యూనిటీ మరియు పర్సనల్



ఇంకుడు గుంతలు, అలాగే ప్రభుత్వ కార్యాలయ భవనాలపై 100% రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం చేపడుతున్న ఈ నీటి సంరక్షణ చర్యలు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ కే. హైమావతి దిశానిర్దేశం చేశారు.

# హోం గార్డులతో సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్ ముఖాముఖి

- **క్రమశిక్షణ, నిబద్ధతే ప్రామాణికం**

**సిద్దిపేట, జూలై 27 (వుదయం బ్యూరో)**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోం గార్డులతో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ ఈరోజు ప్రత్యేక ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విధులను సమీక్షించి, పలు కీలక సూచనలు జారీ చేశారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సమయపాలన అత్యంత కీలకమని, అప్పగించిన బాధ్యతలను పూర్తి నిజాయితీ, అంకితభావంతో నిర్వహించాలని హోం గార్డులకు సీపీ పిలుపునిచ్చారు. అంతేకాకుండా, హోం గార్డుల సంక్షేమానికి కమిషనరేట్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ "పోలీసింగ్ వ్యవస్థలో హోం గార్డుల పాత్ర చాలా కీలకమైనది. శాంతిభద్రతల పరిరక్షణలో మీ కృషి ప్రశంసనీయం. అదే స్ఫూర్తితో ప్రజా సేవే ధ్యేయంగా ముందుకు సాగాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కార్తీక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద ధర్నా



- **తపస్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల**
- **జిల్లా అధ్యక్షులు రాజారెడ్డి పిలుపు**

**బిజినపల్లి, జులై 27 (వుదయం ప్రతినిధి):**

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్షులు దెంది రాజారెడ్డి పిలుపునిచ్చారు.బిజినపల్లి మండల కేంద్రంలోని ZPHS పాఠశాలలో జరుగుతున్న 3 రోజుల ఉపాధ్యాయుల ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ శిక్షణలో భాగంగా సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన మహా ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మండలంలోని ప్రతి ఉపాధ్యాయుడు తరలి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, జిల్లా సభ్యులు భాస్కర్ గౌడ్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ఏఐటీయూసీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- **అధ్యక్షుడిగా బిజ్జా శ్రీనివాసులు, కార్యదర్శిగా మారేడు శివశంకర్**
- **తాడూరులో జిల్లా 3వ మహాసభలు**


**తాడూరు, జులై 27 (వుదయం ప్రతినిధి) :**

ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలు సోమవారం తాడూరు మండల కేంద్రంలోని సింగల్ విండో కార్యాలయం, శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి.మహాసభల అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభాధ్యక్షులుగా మాడుగుల నరసింహ వ్యవహరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సి పి ఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు M. బాల నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి M. నరసింహ, సి పి ఐ జిల్లా కార్యదర్శి S.M.D. ఫయాజ్, ఏఐటీయూసీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హాజరయ్యారు.

**నూతన కమిటీ వివరాలు:**

అధ్యక్షులు : బిజ్జా శ్రీనివాసులు
ప్రధాన కార్యదర్శి : మారేడు శివశంకర్
గౌరవ అధ్యక్షులు : జిలకర శంకర్
వర్కింగ్ ప్రెసిడెంట్ : పులిజాల పరశురాములు
ఉపాధ్యక్షులు : V. రవీందర్, T. కిరణ్ కుమార్, చిన్నపాగ శ్రీనివాసులు
ఉప ప్రధాన కార్యదర్శి : తుమ్మల శివుడు
కోశాధికారి : చాపల శేఖర్
సహాయ కార్యదర్శులు : బండి లక్ష్మీపతి, మాడుగుల నరసింహ, దాంగట్ల వెంకటస్వామి కౌన్సిల్ సభ్యులుగా G. నరేష్, B. లక్ష్మయ్య, జెన్కో రామయ్య, విష్ణు, దోమల పెంట, మొగిళ్ళ శ్రీనివాసులు, సంఘం కృష్ణ, శేఖర్, బీసం సైదులు, యాదయ్య తదితరులను ఎన్నుకున్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.

# కస్తూర్బా బాలికల ప్రిన్సిపాల్ వెంటనే సస్పెండ్ చేయాలి



- **ప్రజావాణిలోNSUI ఫిర్యాదు**

**మరికల్ జూలై 27 (వుదయం ప్రతినిధి )**

మరికల్ మండల కేంద్రంలోని సోమవారం పసుపుల స్టేజి దగ్గర ఉన్న కస్తూరి బా జూనియర్ బాలికల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి నాగమణి మాలపై ఎన్ ఎస్ యు ఐ నారాయణపేట జిల్లా మరియు ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా విద్యార్థి సంఘం కమిటీ సంయుక్తంగా ప్రజావాణిలో సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు అన్వర్ సాదత్ ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ కరాటి బెల్టు పరీక్ష పేరుతో విద్యార్థుల నుంచి సుమారు 2 లక్షల 50వేల రూపాయలు వసూలు చేసి అక్రమాలకు పాల్పడిందని వెంటనే ఆమెపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు ప్రిన్సిపల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు

# వైభవంగా శ్రీ రుక్మిణి విఠలేశ్వర కళ్యాణ మహోత్సవం



**(వుదయం) పెద్ద శంకరంపేట ప్రతినిధి జులై 27:**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి విఠలేశ్వర ఆలయంలో ఆషాడశుద్ధ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం శ్రీ రుక్మిణి విఠలేశ్వర కళ్యాణం మహోత్సవంలో కన్నుల పండుగగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ మంత్రోచ్చరణాల మధ్య ప్రత్యేక గా అలంకరించిన పూల పందిరిలో శ్రీ రుక్మిణి విఠలేశ్వర కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల లోని ఆయా గ్రామాల నుంచి స్వామివారిని దర్శించుకోని కళ్యాణాన్ని వీక్షించారు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. కళ్యాణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) సమీక్ష సమావేశం

**(వుదయం, హైదరాబాద్):**

నేడు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్, సైడ్ 1లోని సయ్యద్ తూర్బెజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) సమీక్ష సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు, SIR జూబ్లీహిల్స్ ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి గారు పాల్గొన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇప్పటికే 52శాతం ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యాయని, కష్టపడి పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలకు శుభాకాంక్షలు తెలియజేశారు.. ఇప్పటికే బూత్ స్థాయిలో బీఎల్ఏలు (B.L.Aలు) ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, రానున్న కొద్ది రోజులు అత్యంత కీలకమైనవని అన్నారు..ఈ సమయంలో ప్రతి బీఎల్ఏ మరింత బాధ్యతతో పనిచేసి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను 65% కి తీసుకెళ్లి విజయవంతం చేయాలని సూచించారు ..ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాల్ రెడ్డి రాంరెడ్డి గారు, కోఆర్డినేటర్ భవానీ శంకర్



గారు, బాబా ఫాసియోద్దీన్ గారు, డివిజన్ అధ్యక్షుడు ఆనంద్ గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# చక్కని ఆరోగ్యం

## ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఎంతో మేలు చేసే జీలకర్ర..

కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) సమస్య భారత్‌లో వేగంగా పెరుగుతోంది. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ICMR) అంచనాల ప్రకారం దేశంలో సుమారు 16 నుంచి 32 శాతం మంది ఫ్యాటీ లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. అంటే దాదాపు 12 కోట్ల మందిపై ఈ సమస్య ప్రభావం చూపుతోంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులే దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆరోగ్యకరమైన ఆహారం, సహజ పద్ధతులపై ఆసక్తి పెరుగుతోంది. వాటిలో జీలకర్ర నీరు (జీరా వాటర్) కూడా ఒకటి. కొన్ని అధ్యయనాలు జీలకర్రలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో తోడ్పడతాయని సూచిస్తున్నాయి. అయితే ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. అధ్యయనాల ప్రకారం, జీలకర్రలోని కొన్ని సహజ సమ్మేళనాలు కాలేయ ఎంజైమ్‌ల పనితీరును మెరుగుపరచడం, కొవ్వు జీవక్రియను సమతుల్యం చేయడం, ఫ్యాటీ లివర్ ప్రారంభ దశలో కొంత ప్రయోజనం కలిగించడంలో సహాయపడతాయి. అయితే ఇవి వైద్య చికిత్సతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించినప్పుడే మెరుగైన ఫలితాలు ఇస్తాయి. జీలకర్ర నీరు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీలకర్రలోని పదార్థాలు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును ప్రోత్సహించడం ద్వారా కొవ్వులు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం,



అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. కొన్ని పరిశోధనలు జీలకర్ర నీరు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో, శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. అలాగే ఫాస్టింగ్ షుగర్ స్థాయిలను నియంత్రించడం, బరువు తగ్గడంలో కూడా కొంత మేర ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించి కణాల రక్షణకు తోడ్పడతాయి. అలాగే మెటబాలిక్ సిండ్రోమ్‌కు సంబంధించిన కొన్ని సూచికలను మెరుగుపరచడంలో కూడా పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. జీలకర్ర నీరు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. రోజుకు సుమారు 3 గ్రాముల జీలకర్రను మూడు నెలల పాటు తీసుకున్న వారిలో శరీర కొవ్వు, నడుము చుట్టుకొలత, కొలెస్ట్రాల్ స్థాయిల్లో మెరుగుదల కనిపించినట్లు కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.

ఉదయం ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తాగితే అందులోని ప్రయోజనకర సమ్మేళనాలు శరీరానికి బాగా అందు తాయి. దీంతో పోషకాలు సులభంగా లభించడంతోపాటు జీవక్రియ వేగంగా ప్రారంభమవుతుంది. అలాగే పేగులు, కాలేయం మధ్య సమన్వయం మెరుగుపడటానికి కూడా ఇది తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

జీలకర్ర నీటిని తయారు చేయడం చాలా సులభం. ఒక టీస్పూన్ జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టాలి లేదా నీటిలో మరిగించి ఉదయం గోరువెచ్చగా తాగాలి. ఇందులో చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది. చక్కెర కలిపితే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు తగ్గిపోతాయి.

అయితే జీలకర్ర నీటిని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. మోతాదుకు మించి తీసుకుంటే జీర్ణ సంబంధిత అసౌకర్యాలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గర్భిణులు, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారు వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవాలి. అలాగే ఫ్యాటీ లివర్ తీవ్ర దశల్లో ఉన్నవారికి ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని తగ్గించాలంటే సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, మద్యం పరిమితం చేయడం వంటి జీవనశైలి మార్పులు తప్పనిసరి. అలాగే శుద్ధి చేసిన చక్కెర, మైదా వంటి రిఫైన్డ్ కార్బోహైడ్రేట్ల వినియోగాన్ని తగ్గించడం కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటిగా ఉపయోగపడుతుంది.

## దగ్గిన ప్రతిసారి తలనొప్పి వస్తుందా..

వర్షాకాలంలో జలుబు, దగ్గు వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. అయితే దగ్గిన ప్రతిసారి తలనొప్పి రావడం మాత్రం సాధారణ విషయం కాదు. చాలా సందర్భాల్లో ఇది తాత్కాలికంగా ఉండి ప్రమాదకరం కాకపోయినా, కొన్నిసార్లు మెదడు లేదా నరాల వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన సమస్యలకు సంకేతంగా ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రారంభమైన లేదా తీవ్రంగా ఉన్న దగ్గుతో కూడిన తలనొప్పిని నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, గట్టిగా నవ్వినప్పుడు లేదా మలవిసర్జన సమయంలో ఒత్తిడి పెట్టినప్పుడు తలలో అకస్మాత్తుగా నొప్పి రావడాన్ని కఫ్ హెడేక్ అంటారు. ఇది ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ప్రైమరీ కఫ్ హెడేక్, మరొకటి సెకండరీ కఫ్ హెడేక్. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం చికిత్సలో కీలకంగా ఉంటుంది. గట్టిగా దగ్గినప్పుడు ఛాతీ, పొత్తికడుపు భాగాల్లో ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. ఈ ఒత్తిడి తాత్కాలికంగా మెదడు లో రక్తప్రసరణ, ద్రవాల ప్రవాహంపై ప్రభావం చూపుతుంది. దీంతో అకస్మాత్తుగా తలనొప్పి వస్తుంది. ప్రైమరీ కఫ్ హెడేక్‌కు ఇదే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ నొప్పి సాధారణంగా ఒక్కసారిగా మొదలై, పదునుగా లేదా గుచ్చుకున్నట్లుగా అనిపిస్తుంది. కొన్ని సెకన్ల నుంచి కొన్ని నిమిషాల్లోనే తగ్గిపోవడం దీని ప్రత్యేకత. అయితే అన్ని కఫ్ హెడేక్‌లు ప్రమాదరహితమైనవి కావు. కొన్నిసార్లు మెదడులో లేదా దాని చుట్టూ ఉన్న నిర్మాణాల్లో సమస్యలు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో లోపాలు, నిర్మాణపరమైన మార్పులు లేదా అరుదుగా మెదడు కణితి వంటి కారణాల వల్ల కూడా సెకండరీ కఫ్ హెడేక్ వస్తుంది. ఈ సందర్భాల్లో దగ్గు అసలు కారణం కాకుండా, ఇప్పటికే ఉన్న సమస్యను బయటపెట్టే ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. సెకండరీ కఫ్ హెడేక్ సాధారణంగా ఎక్కువసేపు కొనసాగుతుంది. దీంతోపాటు ఇతర నరాల సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. ముఖ్యంగా తల తిరగడం, నడవడంలో సమతుల్యత కోల్పోవడం, చూపు మసకబారడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత, తిమ్మిరి, పదేపదే వాంతులు, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. దగ్గుతో వచ్చే తలనొప్పి మొదటిసారిగా కనిపించినప్పుడు, గతంతో పోలిస్తే తీవ్రంగా ఉన్నప్పుడు, కొన్ని నిమిషాలకంటే ఎక్కువసేపు కొనసాగినప్పుడు లేదా జ్వరంతో పాటు వచ్చినప్పుడు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. అలాగే స్పృహ తప్పడం, చూపు సమస్యలు, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లాలి. కఫ్ హెడేక్ కారణాన్ని గుర్తించేందుకు వైద్యులు ముందుగా లక్షణాలు, వైద్య చరిత్రను పరిశీలిస్తారు. అవసరమైతే ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలు సూచిస్తారు. వీటి ద్వారా మెదడులో నిర్మాణపరమైన మార్పులు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో సమస్యలు లేదా ఇతర వ్యాధులను గుర్తించే అవకాశం ఉంటుంది. చికిత్స పూర్తిగా కఫ్ హెడేక్ రకంపై ఆధారపడి ఉంటుంది. ప్రైమరీ కఫ్ హెడేక్‌కు తలనొప్పి తీవ్రత, తరచుదనాన్ని తగ్గించే మందులు ఇస్తారు. కొంతమందిలో కాలక్రమేణా ఈ సమస్య స్వయంగా తగ్గిపోతుంది. సెకండరీ కఫ్ హెడేక్‌లో మాత్రం అసలు కారణమైన వ్యాధికి చికిత్స చేయాల్సి ఉంటుంది. సమస్య స్వభావాన్ని బట్టి మందులు, న్యూరాలజీ నిపుణుల చికిత్స లేదా కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స కూడా అవసరం అవుతుంది.



## జ్వరం.. రెండు రోజులైనా తగ్గడం లేదంటే జాగ్రత్త..

వర్షాకాలం మొదలవగానే జ్వరం కేసులు ఒక్కసారిగా పెరుగుతుంటాయి. స్వల్ప జ్వరం వచ్చినా అది సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షనా, లేక డెంగీ ప్రారంభ లక్షణమా అనే సందేహం చాలా మందిలో కలుగుతుంది. తొలి రెండు రోజుల్లో ఈ రెండింటి లక్షణాలు దాదాపు ఒకేలా ఉండటంతో తేడాను గుర్తించడం కష్టమవుతుంది. అందుకే వైద్య నిపుణులు సూచించే 48 గంటల జ్వరం నియమమను పాటించడం చాలా ముఖ్యం. జ్వరం 48 గంటలు దాటినా తగ్గకపోతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. వైరల్ ఇన్‌ఫెక్షన్ అయినా, డెంగీ వైరస్ అయినా శరీరంలోకి ప్రవేశించిన వెంటనే రోగనిరోధక వ్యవస్థ ఒకే విధంగా స్పందిస్తుంది. జ్వరాన్ని కలిగించే రసాయనాలను విడుదల చేసి శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. అందువల్ల మొదటి 48 గంటల్లో కేవలం లక్షణాల ఆధారంగా వైరల్ జ్వరమా, డెంగీనా అని నిర్ధారించడం చాలా కష్టం. అందుకే ఈ దశను వైద్యపరంగా అత్యంత కీలకమైన సమయంగా పరిగణిస్తారు. పరిశోధనల ప్రకారం, డెంగీ ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు సాధారణ వైరల్ జ్వరాన్ని పోలి ఉంటాయి. ముఖ్యంగా డెంగీ ఎక్కువగా కనిపించే ప్రాంతాల్లో తొలి రెండు రోజుల్లో రక్త పరీక్షలు లేదా వైద్యుల పర్యవేక్షణ చాలా అవసరం. ఎందుకంటే 48 గంటల తర్వాతే ఈ రెండు వ్యాధుల లక్షణాల్లో స్పష్టమైన తేడాలు కనిపిస్తాయి.



సాధారణ వైరల్ జ్వరం ఎక్కువగా విశ్రాంతి, తగినంత ద్రవాలు తీసుకోవడం, పారాసిటమాల్ వంటి మందులతో కొన్ని రోజుల్లో తగ్గిపోతుంది. కానీ డెంగీలో మాత్రం జ్వరం కొనసాగడమే కాకుండా శరీర పరిస్థితిని జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జ్వరం రెండు రోజుల తర్వాత కూడా తగ్గకపోతే లేదా మందులు తీసుకున్నా అధికంగానే కొనసాగితే ఇంటి చిట్కాలపై ఆధారపడకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలు ప్రారంభమైన మొదటి నాలుగు రోజుల్లో డెంగీ యాంటిజెన్ పరీక్ష చేయించుకుంటే వైరస్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. దీంతోపాటు కంప్లీట్ బ్లడ్ కౌంట్ పరీక్ష చేయించడం ద్వారా ప్లేట్‌లెట్లు, హీమాటోక్రిట్ స్థాయిలను తెలుసుకోవచ్చు. తద్వారా వ్యాధి తీవ్రతను అంచనా వేయడం సులభమవుతుంది.

## సిలికాన్ టేప్ వాడొచ్చా..?

గర్భధారణ ముందూ తర్వాతా మహిళల శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. వాటిల్లో కొన్ని కాలక్రమేణా తగ్గితే... కొన్నింటి నివారణకు మాత్రం మనమే పరిష్కార మార్గాలు వెతకాలి. అది కూడా వైద్యుల సలహాలతోనే సుమీ! అలాంటి వాటిల్లో సిజేరియన్ సమయంలో వచ్చే(సి-సెక్షన్) స్కార్ కూడా ఒకటి. దీనికి సిలికాన్ టేప్ వాడటం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని ఈమధ్య సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయంపై వైద్యులు ఏం చెబుతున్నారంటే... బిగుతైన బట్టలు వేసుకోవడం వల్ల రాపిడికి ఎర్రగా అవ్వడం, గాయం మానే ప్రక్రియలో చర్మం పొడిబారి దురద, లాగినట్లు ఉండే నొప్పి వస్తుంది. కొల్లాజన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే శరీరతత్వం ఉన్నవాళ్లకి మచ్చ దగ్గర లావుగా, ఉబ్బెత్తుగా మారుతుంది. చర్మం మడత పడటం, ఆ మడతల్లో తడి, చెమట చేరడం వల్ల బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ముప్పు ఎక్కువే. అందుకే సరైన సూచనలతో సిలికాన్ టేప్ వాడొచ్చు అంటున్నారు నిపుణులు. కుట్లు విప్పిన తర్వాత, గాయం మానుతున్న సమయంలో దీన్ని ఉపయోగించొచ్చట. మీ చర్మానికి ఈ టేప్ పడుతుందో లేదో తెలుసుకోవడానికి రోజులో 4-8 గంటలు మాత్రమే వేసుకోమంటున్నారు. ఎలాంటి అలర్జీలు రాకపోతే 12-24 గంటల వరకూ ఉంచుకోవచ్చు. ఇలా 3 నుంచి 6 నెలలు వాడితే సి-సెక్షన్ మచ్చ బాగా తగ్గుతుందట. దురద, మంట, తడి చేరడం, రంగు మారడం వంటి సమస్యల్ని నివారిస్తుందట. మొదటి కాన్పులో దీని గురించి తెలియని వాళ్లు, డెలివరీ అయ్యి ఏళ్లు గడిచిన వాళ్లు కూడా దీన్ని ఉపయోగించొచ్చు. కానీ ఫలితాల కోసం ఇంకాస్త ఎక్కువ రోజులు వేచి చూడాల్సి ఉంటుంది.




## వయసు మీరుతున్నా.. ఆరోగ్యంగా..!

వయసు పెరిగే కొద్దీ వివిధ రకాల అనారోగ్యాలు చుట్టుముడుతుంటాయి. అయితే ఇవి దరిచేరకుండా ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని పదార్థాల్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు.

నియాసిన్, రైబోఫ్లేవిన్, విటమిన్-ఇ.. వంటి పోషకాలు చిరుధాన్యాల్లో అధికంగా ఉంటాయి. అంతేకాదు.. శరీర బరువును అదుపులో ఉంచే ఫైబర్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు కూడా ఇందులో సమృద్ధిగా లభిస్తాయని చెబుతున్నారు నిపుణులు.

విటమిన్-ఎ పుష్కలంగా దొరికే క్యారట్లు చర్మాన్ని మృదువుగా మారుస్తాయట. నల్లమచ్చలు, ముడతలు, మొటిమలు.. లాంటి సమస్యలను దూరం చేసేందుకు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉండే యాపిల్‌ను సూపర్ ఫుడ్‌గా పేర్కొంటారు. ఇందులో సి, బి, కె విటమిన్లు; ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయట. యాపిల్‌లోని పీచు పదార్థం కారణంగా అజీర్తి సమస్యలు దూరమయ్యే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. పెరుగులో ప్రో-బయాటిక్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి దోహదం చేస్తాయని చెబుతున్నారు నిపుణులు.

సాధారణంగా మెనోపాజ్ దశలోకి ప్రవేశించిన మహిళల్లో వేడి ఆవిర్లతో పాటు రాత్రి సమయాల్లో చెమట పట్టడంతో అసౌకర్యంగా ఫీలవుతుంటారు. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలను ఆహారంలో భాగం చేసుకుంటే ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు.



## రింగుల జుట్టుని కాపాడుకోవాలంటే..!

జుట్టు తేమను కోల్పోవడానికి, నిర్జీవమైపోవడానికి వాతావరణం కూడా ఓ కారణమే. అదే కర్లీ హెయిర్ ఉన్న వారికి ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో బయటకు వెళ్లేటప్పుడు జుట్టును కవర్ చేసుకునేలా క్యాప్ ధరించడం, స్కార్ఫ్ కట్టుకోవడం మంచిది. అదేవిధంగా కర్లీ హెయిర్‌ను కాపాడుకోవడానికి కొన్ని చిట్కాలు ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు.

తగినన్ని నీళ్లు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. ఫలితంగా చర్మమే కాదు.. జుట్టూ తేమను కోల్పోయి పొడిబారిపోతుందట. అందుకే రింగుల జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే రోజూ తగినంత మొత్తంలో నీళ్లు తాగాలి.

రింగుల జుట్టు ఉన్న వారు చివర్లు చిట్లే సమస్యతో బాధపడుతుంటారు. దానివల్ల కేశాలు నిర్జీవంగా కనిపిస్తాయి. కాబట్టి ప్రతి మూడు నెలలకోసారి చిట్లిన చివర్లను కత్తిరిస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుందంటున్నారు నిపుణులు. జుట్టుకు తేమనందించడంలో కలబంద చక్కగా పని చేస్తుంది. కాబట్టి వారానికి రెండుసార్లు కలబంద గుజ్జును జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి.. 20 నిమిషాల తర్వాత తలస్నానం చేయడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. జుట్టు తేమను కోల్పోకుండా చేయడంలో తేనె పాత్ర కీలకం. అందుకే జుట్టుకు పోషణనందించే కండిషనర్లు, డీప్ కండిషనర్లతో పాటు క్లెన్సర్‌లలోనూ కాస్త తేనెను కలుపుకొని అప్లై చేసుకుంటే జుట్టు పొడిబారకుండా జాగ్రత్తపడచ్చు అని సూచిస్తున్నారు నిపుణులు.

అలాగే కనీసం ఏడెనిమిది గంటలు చక్కటి నిద్ర ఉండేలా జాగ్రత్తపడాలి. తద్వారా ఒత్తిడి, ఆందోళనలు దూరమై.. ప్రశాంతత దరిచేరుతుంది. కర్లీ హెయిర్‌ను కాపాడుకోవడానికి ఇదీ అవసరమే అంటున్నారు నిపుణులు.

అప్పుడప్పుడూ కొన్ని చుక్కల హెయిర్ సీరంను రాసుకోవడం వల్ల కూడా.. కర్లీ హెయిర్‌ను కాపాడుకోవచ్చు.



## అధిక శాతం మంది మహిళల్లో వస్తున్న హార్మోన్ల సమస్యలు..

ఇటీవలి కాలంలో మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత (హార్మోనల్ ఇంబ్యాలెన్స్), జీవక్రియ (మెటబాలిక్) సమస్యలు గతంతో పోలిస్తే చాలా చిన్న వయసులోనే కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు 20ల చివరలో లేదా 30 ఏళ్ల తర్వాత ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు ఇప్పుడు టీనేజ్ బాలికలు, కళాశాల విద్యార్థినుల్లో కూడా పెరుగుతున్నాయి. మెరుగైన వైద్య పరీక్షలు, అవగాహన పెరగడం ఒక కారణం అయినప్పటికీ, మహిళల ఆరోగ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద మార్పు జరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది యువతులు నెలసరి సక్రమంగా రాకపోవడం, జీవనశైలిలో పెద్దగా మార్పులు లేకపోయినా బరువు పెరగడం, మొటిమలు, ముఖం లేదా శరీరంపై అవాంఛిత రోమాలు పెరగడం, ఎప్పుడూ అలసటగా ఉండటం, శక్తి తగ్గిపోవడం, తరచూ మూడ్ మార్పులు వంటి సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. ఇవన్నీ విడివిడిగా కనిపించే సమస్యలు కాదని, చాలా కాలంగా శరీరంలో నెమ్మదిగా ఏర్పడుతున్న జీవక్రియ లోపాలకు సంకేతాలని నిపుణులు చెబుతున్నారు.



## పీఎంఓఎస్ సమస్య ఉన్న మహిళల్లో కనిపించే లక్షణాలు ఇవే..

పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఓవేరియన్ సిండ్రోమ్, గతంలో పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ గా పిలిచే ఈ పరిస్థితి, సంతానోత్పత్తి వయస్సులో ఉన్న మహిళలను ప్రభావితం చేసే ఒక హార్మోన్ల సంబంధిత సమస్య. ఇందులో నెలసరి సక్రమంగా రాకపోవడం, ఆండ్రోజెన్ (పురుష హార్మోన్లు) స్థాయిలు పెరగడం, అండాశయాల్లో చిన్న చిన్న సిస్ట్‌లు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా బరువు పెరగడం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు, ముఖం లేదా శరీరంపై అధిక రోమాలు పెరగడం, మొటిమలు వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. PMOS ఉన్న మహిళల్లో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం గణనీయంగా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇన్సులిన్ రెసిస్టెన్స్. అంటే శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించకపోవడం. సాధారణంగా ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను కణాల్లోకి చేర్చి శక్తిగా మార్చడంలో సహాయపడుతుంది. కానీ PMOSలో కణాలు ఇన్సులిన్ ప్రభావానికి స్పందించకపోవడంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉంటుంది. PMOSలో శరీర కణాలు ఇన్సులిన్‌కు తగిన విధంగా స్పందించకపోవడం వల్ల గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించలేవు. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ప్యాంక్రియాస్ (క్లోమగ్రంథి) మరింత ఎక్కువ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. ఈ పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే చివరికి టైప్ 2 డయాబెటిస్‌కు దారితీసే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. PMOSలో కనిపించే హార్మోన్ల అసమతుల్యత కూడా మధుమేహ ప్రమాదాన్ని పెంచుతుంది. ముఖ్యంగా ఆండ్రోజెన్ హార్మోన్లు అధికంగా ఉండటం వల్ల శరీర జీవక్రియ దెబ్బతిని ఇన్సులిన్ రెసిస్టెన్స్ మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. బరువు పెరగడం లేదా ఊబకాయం కూడా PMOSతో ముడిపడి ఉండే ప్రధాన సమస్య. అధిక బరువు ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను మరింత పెంచి మధుమేహం వచ్చే అవకాశాన్ని ఎక్కువ చేస్తుంది. అలాగే PMOSలో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) స్థాయిలు కూడా అధికంగా ఉండటం వల్ల జీవక్రియపై ప్రతికూల ప్రభావం పడుతుంది.



## నిప్పన్ ఎంఎఫ్ @ 4 కోట్ల ఫోలియోలు

దేశంలో 4 కోట్ల ఫోలియోల మైలురాయిని దాటిన మొదటి అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ నిలిచింది. భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) గణాంకాల ప్రకారం.. జూన్ చివరికి ఫండ్ పరిశ్రమలో మొత్తం 27.86 కోట్ల ఫోలియోలు ఉండగా, అందులో నిప్పన్ ఇండియా ఎంఎఫ్‌లోనే 14.4% (4.02 కోట్ల ఫోలియోలు) ఉన్నాయి. పరిశ్రమలోనే అత్యధికంగా 2.41 కోట్ల మంది మదుపర్లు ఉన్నట్లు నిప్పన్ ఎంఎఫ్ తెలిపింది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోని 6.19 కోట్ల మంది యునీక్ మదుపర్లలో ఈ సంఖ్య 39 శాతానికి సమానం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ (3.18 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ (3.11 కోట్లు), ఎస్‌బీఐ ఎంఎఫ్ (2.24 కోట్లు).




# క్రిప్టో ఆస్తులపై సీబీడీటీ మార్గదర్శకాలు




క్రిప్టో ఆస్తుల వెల్లడిపై కొత్త మార్గదర్శకాలను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం జారీ చేసింది. క్రిప్టో ఎక్స్ఛేంజీలు లావాదేవీల వివరాలు వెల్లడించడం (డిస్‌క్లోజర్)లో ఇవి మరింత పారదర్శకత తెస్తాయని భావిస్తున్నారు. క్రిప్టో ఇన్వెస్టర్లు కూడా తాము వెల్లడించే వివరాలు.. క్రిప్టో ఎక్స్ఛేంజీల రిపోర్టింగ్‌కు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ప్రకారం, 2025 ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 509, 2026 ఆదాయపు పన్ను నిబంధనల్లో 241 నుంచి 244, ఫారం 167 కింద రిపోర్టింగ్ బాధ్యతలను అమలు చేయడంలో రిపోర్టింగ్ క్రిప్టో-అసెట్ సర్వీస్ ప్రొవైడర్ల (ఆర్‌సీఏఎస్‌పీల)కు మార్గదర్శకత్వం వహించడమే ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. లావాదేవీల చట్టబద్ధత, నియంత్రణలపై స్పష్టత: క్రిప్టో లావాదేవీలను ధ్రువీకరించడానికి, భద్రపరచడానికి.. క్రిప్టోగ్రాఫికల్ విధానంలో భద్రపరిచిన డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్, అటువంటి సాంకేతికతలపై ఆధారపడే విలువల డిజిటల్ రూపంగా క్రిప్టో ఆస్తులను నిర్వచించారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలు, నిర్దిష్ట ఎలక్ట్రానిక్ మనీ ఉత్పత్తులు, చెల్లింపులు, పెట్టుబడుల ప్రయోజనాల కోసం ఉపయోగించలేమని ఆర్‌సీఏఎస్‌పీ నిర్ధారించిన క్రిప్టో ఆస్తులు మినహా అన్నింటికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. దేశీయ క్రిప్టో ఆస్తుల పన్ను విధానంలో ఈ గైడెన్స్ నోట్‌ను గణనీయ మార్పుగా కాకుండా, నిబంధనల అమలు, పారదర్శకతకు కొలమానంగా చూడాలని పన్ను నిపుణులు అంటున్నారు.

# ఆగస్టులో రానున్న ఐపిఓలు ఇవే..




ప్రాథమిక మార్కెట్‌లో ఐపీఓల సందడి పెరుగుతోంది. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకులతో, ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఆచితూచి అడుగేసిన కంపెనీలు.. ఇప్పుడు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు ఆసక్తి చూపుతున్నాయి. ఆగస్టులో డజనుకు పైగా కంపెనీలు ఐపీఓలకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, నిత్యావసరాలు డెలివరీ చేసే జెప్టోతో పాటు ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ సంస్థ షిప్‌రాకెట్ వంటి కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిపి రూ.25,000 కోట్లకు పైగా నిధులు సమీకరించనున్నాయి.

వచ్చే నెలలో రాబోయే అతి పెద్ద ఐపీఓల్లో జెప్టో ఒకటి. తాజా షేర్ల జారీ ద్వారా రూ.8,010 కోట్లు సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో మరో 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను సంస్థ విక్రయించనుంది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ట్రూహోమ్ ఐపీఓ ద్వారా రూ.3,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ.1,500 కోట్లు, ఓఎఫ్ఎస్‌లో రూ.1,500 కోట్లు సమీకరించనుంది.

ఎలివేట్ క్యాంపసెస్ తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,550 కోట్లు; షిప్‌రాకెట్ తాజా షేర్ల జారీ-ఓఎఫ్ఎస్ కలిపి రూ.2,342.35 కోట్లు, ఇన్నోవేటివ్ వ్యూ ఇండియా పూర్తిగా ఓఎఫ్ఎస్ ద్వారా రూ.2,000 కోట్ల చొప్పున నిధులు సమీకరించనున్నాయి. మిల్క్ మిస్ట్ డెయిరీ ఫుడ్ కూడా వచ్చే నెలలోనే రూ.1,553 కోట్ల ఐపీఓకు రానుంది. ఇది కూడా పూర్తి ఓఎఫ్ఎస్ విధానంలోనే నిధులు సమీకరించనుంది.

ఇవే కాకుండా ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీఐఎల్ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్), అర్ధీ ఇండస్ట్రీస్, గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆఫ్ బిలీఫ్, హై-టెక్ ఇంజినీర్స్, శంకేష్ జువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్స్ సంస్థలు కూడా ఆగస్టులో ఐపీఓ ద్వారా నిధులు సమీకరించే యత్నాల్లో ఉన్నాయి.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 36 కంపెనీలు ఐపీఓలకు వచ్చాయి. ఇందులో ఈ నెలలోనే 9 నమోదయ్యాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జునిపర్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూలు ఈ నెల 29, 30 తేదీల్లో ప్రారంభం కానున్నాయి. ఈ వారంలోనే ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ కూడా ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

## ఐఓటీ మార్కెట్‌లోకి శాటిలియాట్


ఐరోపా శాటిలైట్ ఆపరేటర్ శాటిలియాట్, భారత మార్కెట్‌లో అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. లో ఎర్త్ ఆర్బిట్ ఆధారిత న్యారోబ్యాండ్ ఐఓటీ (ఎన్‌బీ-ఐఓటీ) కనెక్టివిటీ సేవలు



అందించడంలో ప్రత్యేకత కలిగిన ఈ సంస్థ.. ఇటీవల భారతీయ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. భారత్‌ను కీలక మార్కెట్‌గా సంస్థ అభివర్ణించింది. రాబోయే సంవత్సరాల్లో భారత్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాలు, కనెక్షన్లు వేగంగా పెరుగుతాయని శాటిలియాట్ రెగ్యులేటరీ అఫైర్స్ లీడ్ (ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా) ఈథన్ ముదవాస్సు తెలిపారు. నియంత్రణపరమైన అంశాలు ఈ ప్రత్యేక సేవల రంగాన్ని ప్రోత్సహిస్తే, వ్యవసాయం, రవాణా, గనులు, యుటిలిటీస్ వంటి వాటికి తక్కువ ఖర్చుతో కూడిన అనుసంధానత అందించడానికి శాటిలైట్ ఐఓటీకి అవకాశాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు.

ఐఓటీ అంటే: వ్యవసాయంలో వాడే మట్టి తేమ సెన్సార్లు, రవాణా వాహనాల ట్రాకర్లు, స్మార్ట్ విద్యుత్ మీటర్లు వంటి పరికరాలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేసి, స్వల్ప పరిమాణంలో డేటా బదిలీ చేయడాన్ని ఐఓటీగా పరిగణిస్తారు. ఎటువంటి మొబైల్ టవర్ల సాయం లేకుండానే నేరుగా భూమిపై ఉన్న సెన్సార్లు, మీటర్ల నుంచి ఉపగ్రహానికి సమాచారం అందుతుంది.

## 9 లక్షల సీఎన్‌జీ వాహనాల అమ్మకమే లక్ష్యం: మారుతీ



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9 లక్షల సీఎన్‌జీ వాహనాలు విక్రయించాలని మారుతీసుజుకీఇండియా (ఎంఎస్ఐ) లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26లో 7 లక్షల సీఎన్‌జీ వాహనాలు విక్రయం కాగా, ఈ ఏడాది మరో 30% అధికంగా అమ్మగలమని సంస్థ భావిస్తోంది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పెట్రోలు, డీజిల్ ధరలు బాగా పెరగడం, స్వచ్ఛమైన ఇంధనంపై వాహన కొనుగోలుదార్లు ఆసక్తి చూపుతుండటం ఇందుకు కారణం. ఇంతకుముందు చిన్నకార్లు, వ్యాన్ల కొనుగోలుదార్లే సీఎన్‌జీపై ఆసక్తి చూపేవారని, ఇప్పుడు స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ) కొనాలనుకున్న వారు కూడా సీఎన్‌జీ గురించి విచారిస్తున్నారని ఎంఎస్ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థోబెనర్జీ తెలిపారు. ఎస్‌యూవీ విక్టోరిస్ అమ్మకాల్లో 50% పైగా సీఎన్‌జీవే ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్‌యూవీ బ్రెజాలో కూడా సీఎన్‌జీ ట్యాంక్ కారు అడుగు భాగంలో ఉంటుందని చెప్పారు. ఏప్రిల్-జూన్‌లోనే 2.2 లక్షల సీఎన్‌జీ వాహనాలు విక్రయించామని, 2025-26 ఇదే కాల అమ్మకాల కంటే ఇవి 58% అధికమన్నారు. తేలికపాటి వాణిజ్య వాహనాలు, కార్లలో కలిపి 15 సీఎన్‌జీ మోడళ్లు విక్రయిస్తున్నట్లు వివరించారు.

# లాభాల్లో దేశీయ మార్కెట్లు

దేశీయ మార్కెట్లు సోమవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి (Stock Market Today). పశ్చిమాసియాలో ఘర్షణలకు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో చమురు దిగొచ్చాయి. దాంతో వరుసగా ఐదు సెషన్లలో నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు లాభాల బాటపట్టాయి.

ఉదయం 9.47 గంటల సమయంలో సెన్సెక్స్ 627 పాయింట్ల లాభంతో 76,692 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 181 పాయింట్లు ఎగబాకి, 23,948 వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కాస్త కోలుకుంది. 96.18 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ఉండగా.. ఓఎన్‌జీసీ, విప్రో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.



ఆగస్టులో రూ.25,000 కోట్ల ఐపీఓలు

అమెరికా దాడులు నిలిపివేస్తే.. తాము కూడా ఆపేస్తామని ఇరాన్ ప్రకటించడంతో చమురు మంటలు కాస్త తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్లకు దిగొచ్చింది. ఇంధన దిగుమతులపై ఆధారపడిన భారత్‌కు ఇది సానుకూలాంశం కావడంతో సూచీల సెంటిమెంట్ బలపడింది. ఇక, టాటా కన్జూమర్, ఎన్‌టీపీసీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లలో ర్యాలీ మార్కెట్లకు కలిసొచ్చింది. ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచనాలు కూడా లాభాలకు కారణమయ్యాయి.




## థాంక్యూ వీవీఎస్ సర్.. స్ఫూర్తి నింపారు: శ్రేయస్ అయ్యర్




వరుసగా రెండు సిరీస్‌లను కోల్పోయిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు భారీ ఊరట లభించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్ఇండియా క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో ఎట్టకేలకు సిరీస్ విజయం అందుకొన్నాడు. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతిలో సిరీస్‌లను కోల్పోయిన సంగతి తెలిసిందే. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తోపాటు సంజు శాంసన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా అందుబాటులో లేరు. అయినా కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వీవీఎస్ లక్ష్మణ్ మార్గదర్శకంలో శ్రేయస్ సేన అదరగొట్టింది. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కు అయ్యర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. ''నిజాయతీగా మాట్లాడుకోవాలంటే.. ఈ సిరీస్‌లో వదిలేసిన క్యాచ్‌లు మినహా, మేం ఎటువంటి లోపాలు లేకుండా ఆడామనేది నా అభిప్రాయం. జట్టులోని ప్రతి ఒక్కరూ.. సహాయక సిబ్బందితో కలిపి అద్భుతంగా శ్రమించారు. ఈ సందర్భంగా వీవీఎస్ సర్‌కు ధన్యవాదాలు. మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తూ స్ఫూర్తి నింపారు.

# నేనేం చేయాలో నాకు తెలుసు: సంజు శాంసన్

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో సిరీసుల్లో ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడిన సంజు శాంసన్‌కు జింబాబ్వే పర్యటనలో చోటు దక్కలేదు. ఒకవైపు అతడిని ఎందుకు తప్పించారనే ప్రశ్నలు తలెత్తగా.. మరోవైపు పక్కన పెట్టడం సరైందేనన్న వాదనా ఉంది. జింబాబ్వే పర్యటనలో వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. దీంతో ఓపెనింగ్ ప్లేస్ ఇప్పటికైతే ఖాళీగా లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంజు శాంసన్ తన క్రికెట్ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తానేం చేయాలో ప్రత్యేకంగా ఎవరూ చెప్పనక్కర్లేదని వ్యాఖ్యానించాడు. 'మన దేశంలో 2024 వరల్డ్ కప్ తర్వాత 2026లో ఆడతానని అనుకోలేదు. కనీసం 15 మంది స్క్వాడ్‌లో కూడా ఉంటానని భావించలేదు. అయినా నాకు అవకాశం వచ్చింది. అనుకోకుండా వచ్చిన ఛాన్స్ అది. అందువల్ల నేను 2028 కోసం ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాను? నా అవసరం జట్టుకు ఉందని అనిపిస్తే ఎంపిక చేస్తారు. అప్పుడు మంచి ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ప్రయత్నిస్తా'' అని సంజు వెల్లడించాడు. ''విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడు. జట్టులోని ప్రతి ఒక్కరితోనూ ముక్కుసూటిగా ఉంటాడు. మీకు ఏదైనా అవసరమై అడిగితే.. దానికి సరైన



నిరంతరం పోటీ ఉంటుందని తెలుసు. అయితే, 2026 టీ20 ప్రపంచ కప్ ముందు ఇందులో నేను భాగం కాకూడదని నిర్ణయించుకున్నా. నా గేమ్‌ను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టా. దేవుడి దయ వల్ల నేను చాలా సాధించా. ఇప్పుడు నా వయసు 31ఏళ్లు. ఇంకా చాలా కాలం క్రికెట్ ఆడగలను. అందుకే, సొంత శైలిలోనే ఆడాలని అనుకుంటున్నా. ఎలా బ్యాటింగ్ చేయాలో నాకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సంజు ఎలా ఆడాలో సంజునే డిసైడ్ చేస్తాడు. పరిష్కారం చూపిస్తాడు. జిమ్‌లోనూ అంతే. అతడిలో చాలా ఫైర్ ఉంది. మేమిద్దరం జిమ్‌లోనూ వర్కౌట్లు చేసేవాళ్లం. ఆ సమయంలో నాకు వచ్చిన ప్రతి సందేహాన్ని తీర్చేవాడు. అంతర్జాతీయంగా మంచి క్రికెటర్ అవ్వాలనుకుంటే లైఫ్‌స్టైల్‌ను మార్చాలని సూచించాడు. తన ప్రయాణంలో ఏమేమి చేసేవాడో అన్నింటినీ చెప్పేవాడు. ఎవరైనా సరే కోహ్లీ చెప్పినట్లు ఓ పదేళ్లు చేస్తే భవిష్యత్తులో కెరీర్ గొప్పగా ఉంటుంది'' అని సంజు తెలిపాడు.

# పాక్ బాక్సర్‌పై నా విజయం కార్గిల్ హీరోలకు అంకితం: జాదుమణి

కామన్వెల్త్ గేమ్స్ (CWG 2026)లో భారత బాక్సర్ జాదుమణి సింగ్ అద్భుతం చేశాడు. పురుషుల 55 కేజీల విభాగంలో ఈ 22 ఏళ్ల మణిపుర్ బాక్సర్.. పాకిస్థాన్ బాక్సర్ సుమామ రెహమాన్‌ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆదివారం రాత్రి జరిగిన రౌండ్16లో తన



ప్రత్యర్థిపై 5-0 తేడాతో అతడు విజయం సాధించాడు. దీంతో బాక్సింగ్‌లో భారత పతక ఆశలను సజీవంగా ఉన్నాయి. అయితే ఈ పోటీ కార్గిల్ విజయ్ దివస్ నాడు జరగడంతో.. జాదుమణి విజయం మరింత ప్రత్యేకంగా మారింది. ఈ పోరు అనంతరం అభిమానులను ఉద్దేశించి మాట్లాడిన అతడు.. తన విజయాన్ని కార్గిల్ హీరోలకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించాడు. ''మన కార్గిల్ హీరోలకు నా విజయం అంకితం. పాకిస్థాన్ బాక్సర్‌పై విజయానికి గర్వపడుతున్నా. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేసి ముందుకు సాగుతా. భారత్‌కు బంగారు పతకం సాధించేందుకు ప్రయత్నిస్తా'' అని జాదుమణి వెల్లడించాడు. 1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ఏటా జులై 26న 'కార్గిల్ విజయ్ దివస్'ను నిర్వహిస్తారు. ఇలాంటి రోజునే పాక్ బాక్సర్‌పై జాదుమణి విజయం సాధించడం విశేషం. తొలి రౌండ్‌లో బై దక్కడంతో సుమామ రెహమాన్ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టాడు. ఇక్కడ జాదుమణి దెబ్బకు పాక్ బాక్సర్ దగ్గర సమాధానం లేకుండా పోయింది.

## కుర్రాడు అదరగొట్టాడు

జింబాబ్వే పర్యటనను టీమ్ఇండియా ఘనంగా ముగించింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మూడో టీ20లో 35 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ (81; 49 బంతుల్లో 8×4, 4×6) మెరవడంతో మొదట భారత్.. 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే తడబడింది. మయాంక్ యాదవ్ (3/29), యశ్ ఠాకూర్ (2/45) ధాటికి 7 వికెట్లకు 157 పరుగులే చేయగలిగింది. ర్యాన్ బర్ల్ (54 నాటౌట్; 43 బంతుల్లో 5×4) టాప్ స్కోరర్. అశోక్ శర్మ (1/20), రవి బిష్ణోయ్ (1/24) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టుకు కళ్లెం వేశారు. జింబాబ్వే తడబాటు: ఛేదనలో జింబాబ్వే తేలిపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు.. ఏ దశలోనూ పోటీలో లేదు. మయాంక్ యాదవ్ మరోసారి సూపర్‌గా బౌలింగ్ చేశాడు. తొలి బంతికే బెనెట్‌ను ఔట్ చేసి భారత్‌కు శుభారంభాన్నిచ్చాడు. నాలుగో ఓవర్లో మయర్స్ (19), సికందర్ రజా (0)లను వెనక్కి పంపడం ద్వారా జింబాబ్వేను యశ్ ఠాకూర్ గట్టి దెబ్బతీశాడు. బెన్ కరన్ (20), బర్ల్ ఆ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ అది ఏమాత్రం సరిపోలేదు. 8వ ఓవర్లో కరన్‌ను బిష్ణోయ్ వెనక్కి పంపడంతో 65/4తో జింబాబ్వే చిక్కుల్లో పడింది. ఆ తర్వాత బర్ల్, మద్వీర అయిదో వికెట్‌కు 60 పరుగులు జోడించినప్పటికీ.. వేగంగా ఆడలేకపోవడం, సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ



పోవడంతో ఆ జట్టు ఎప్పుడూ గెలుపు రేసులో లేదు. 16వ ఓవర్లో మద్వీర (28) నిష్క్రమించేటప్పటికి జింబాబ్వే స్కోరు 125 పరుగులే. ఆ జట్టు ఆఖరి నాలుగు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 29 పరుగులే చేయగలిగింది. మరుమానిని బౌల్డ్ చేయడం ద్వారా పేసర్ అశోక్ శర్మ కెరీర్‌లో తొలి అంతర్జాతీయ వికెట్‌ను దక్కించుకున్నాడు.

## ఆమె.. నా మనిషి: నటితో క్రికెటర్ అర్ష్‌దీప్ డేటింగ్ కన్ఫార్మ్

కొంత కాలంగా తన ప్రేమ వ్యవహారంపై వస్తోన్న రూమర్లను భారత క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ ఎట్టకేలకు నిజం చేసేశాడు. ఓ నటితో అర్ష్‌దీప్ డేటింగ్ చేస్తోన్నట్లు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు బయటకు చెప్పని అతడు.. తొలిసారి తన రిలేషన్‌షిప్‌ను అధికారికంగా ప్రకటించాడు. యాక్టర్, మోడల్ సమ్రీన్ కౌర్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టుపెట్టాడు. ఇన్‌స్టాలో రెండు ఫొటోలను షేర్ చేసిన అతడు 'నా మనిషి' అంటూ వ్యాఖ్య జోడించాడు. దీంతో అతడి అభిమానులు పెద్ద సంఖ్యలో లైక్ కొట్టారు. దాదాపు 2 మిలియన్ల లైకులు రావడం గమనార్హం.



వుదయం సినిమా
MOVIE TIME!

## 'అనకాపల్లి' ఆగస్ట్ 7న చిత్రం విడుదల

**వుదయం సినిమా :** 'అనకాపల్లి' ట్రైలర్ ను విడుదల చేసిన టాలీవుడ్ థండర్స్ టీం.. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లేని త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. నటీనటులు : చరణ్ రాజ్, శశాంక్ బాలు, ప్రశాంతి ఏడే, బల్వీర్ సింగ్, రంజిత్ నగెల్లి కథ, దర్శకత్వం: మహదేవ్ చిరంజీవి సహ నిర్మాతలు: ఆశిష్ పసుల, కిరణ్ పట్టేటి.




## ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'



**వుదయం సినిమా:** ఓటీటీలో 'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంతమైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర–3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో 'పొలిమేర 3' చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ అండ్, ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు దివంగత నారాయణదాస్ నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, జాన్వీ నారంగ్‌లు ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ రెండు సంస్థల కలయికతో మరింత పవర్‌ఫుల్‌గా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నేడు సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.

## 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' ప్రచారానికి శ్రీకారం..

**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం "ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (AK47)" ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న 'చిట్టిబాబు' పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి.ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించనున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు.సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీయమైన పాత్రగా నిలిచేలా కనిపిస్తోంది.



## డైలాగ్ కింగ్ సాయి కుమార్ బర్త్ డే స్పెషల్



**వుదయం సినిమా:** నటుడు సాయికుమార్ పేరు తెలియని తెలుగు ప్రేక్షకులుండరు. ఆయన్ను తలచుకోగానే ముందు గుర్తుకు వచ్చేది ఆ గంభీరమైన గాత్రం, ఆకట్టుకునే వాచకం. ఆయన గళం ఎంతో మందిని హీరోలుగా నిలబెట్టింది. ఆ గళమే ఆయనకు తిరుగులేని హీరోగా, నటుడిగా కెరీర్‌ను ఇచ్చింది. 'డైలాగ్ కింగ్'గా సాయి కుమార్ దక్షిణాది చిత్రసీమపై చెరగని ముద్ర వేశారు. కుటుంబం సినీ రంగంతో అనుబంధం కలిగి ఉంది. నటుడు పి.జె.శర్మ తనయుడిగా ఇండస్ట్రీలోకి ప్రవేశించిన అతి తక్కువ కాలంలోనే సాయి కుమార్ తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు. 1961 జూలై 27న జన్మించిన సాయి కుమార్ రీసెంట్‌గానే సినీ పరిశ్రమలో యాభై ఏళ్ల సుదీర్ఘమైన మైలురాయిని చేరుకున్నారు. సాయి కుమార్ ఇలానే మరెన్నో గొప్ప పాత్రలతో మెప్పిస్తూ, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సంతోషంగాజీవించాలని కోరుకుందాం. కెరీర్ ప్రారంభంలోనే సాయి కుమార్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పలు సినిమాల్లో హీరోలకు, ఇతర పాత్రలకు సైతం తన స్వరాన్ని అందించారు. ఆయన డబ్బింగ్ చెప్పిన తొలిచిత్రం 'సంసారం'. కొన్నాళ్ల తర్వాత బాలనటుడిగా మెప్పించారు. బాలనటుడిగా సాయికుమార్ చేసిన తొలి సినిమా 'దేవుడు చేసిన పెళ్లి'. అయితే సాయి కుమార్‌కి కన్నడలో ముందుగా క్రేజ్ లభించింది. 'పోలీస్ స్టోరీ' కన్నడలో భారీ విజయం సాధించిన తర్వాత తెలుగులోకి డబ్బింగ్ చేయగా ఇక్కడా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. అలా సాయి కుమార్‌కి తిరుగులేని క్రేజ్ వచ్చింది.

## ఘనంగా డా. దాసరి జన్మదిన వేడుకలు

**వుదయం సినిమా:** పద్మశ్రీ పురస్కార గ్రహీత, కళా ప్రపూర్ణ డా. మంచు మోహన్ బాబు గారు మే 4 2026 శిల్పకళా వేదికలో తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం ఘనంగా నిర్వహించిన డా. దాసరి జన్మదిన వేడుకలు మరియు డైరెక్టర్స్‌డే ఫంక్షన్ లో తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం నుండి ప్రతి ఏడూ ఒక పేద సభ్యుని కుమారుడు లేదా కుమార్తెకు తిరుపతిలోని తన ఎమ్.బి. యూనివర్సిటీలో ఉచిత విద్యనందిస్తానని హామీ ఇచ్చిన విషయం విదితమే. అందులో భాగంగా 2026–27 విద్యా సంవత్సరం నుండి తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘంలో సభ్యుడైన (మెంబర్షిప్ నెం. 2267) శ్రీ ఎలిపే శ్రీనివాసరావు అను 'సహకార దర్శకుని కుమార్తె చి. ఎలిపే దేదీప్య సిరి కి ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు ఉచితంగా విద్యనందించే ఏర్పాటు, మరియు ఉచిత హాస్టల్ వసతి కలుగచేశారు. ఈ సందర్భంగా తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం తరపున అధ్యక్షులు వి.ఎన్.ఆదిత్య, ప్రధాన కార్యదర్శి పి.వి. రామరావు, కోశాధికారి నీలం సాయిరాజేష్ మరియు కార్యవర్గ నిర్వాహక కమిటీ అందరూ డా. మోహన్ బాబు గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు అందజేశారు. వారి ఈ వితరణ తెలుగు చిత్ర దర్శకుల సంఘంలో సభ్యుల పిల్లలకు అద్భుతమైన భవిష్యత్తుని ఇవ్వనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం సభ్యుల ట్రస్టుకు మోహన్ బాబుగారు పదిహేను లక్షల రూపాయల విరాళం మెడికల్ ఇన్సురెన్స్ కోసం ప్రకటించడం పట్ల తెలుగు సినీ పరిశ్రమ వర్గాలన్నీ హర్ష ధ్వానాలు పలికాయి. వి.ఎన్.ఆదిత్య పి.వి. రామారావు ఎన్. సాయి రాజేష్ అధ్యక్షులు ప్రధాన కార్యకార్యదర్శి కోశాధికారి.



## "అదే నీవు అదే నేను" ట్రైలర్ రిలీజ్



**వుదయం సినిమా:** ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు సాధించిన "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, "సిద్ధార్థ్ రాయ్" సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా "అదే నీవు అదే నేను". ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాండ్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. "అదే నీవు అదే నేను" సినిమా ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ ను పాన్ ఇండియా యాక్టర్ సునీల్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చాలా బాగుందని మూవీ టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగాసునీల్ మాట్లాడుతూ – "అదే నీవు అదే నేను" సినిమా ట్రైలర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది. షాకింగ్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్స్ లోకి వస్తోంది. తప్పకుండా థియేటర్స్ లో చూడండి. కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేయండి. అన్నారు.నేడు సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ ఘటనల ఇన్స్పిరేషన్ తో ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు కొండల్ "అదే నీవు అదే నేను" సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించినట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. శ్రీలక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ ప్రొడక్షన్ వ్యాల్యూస్, సినిమా క్వాలిటీ విషయంలో నిర్మాత గోవిందు కాండ్రేగుల అన్ కాంప్రమైజ్డ్ ప్యాషన్ కనిపిస్తున్నాయి. ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆద్యంతం ఆసక్తిని పంచేలా ఈ సినిమా ఉండబోతోంది. "అదే నీవు అదే నేను" సినిమా విజయంపై మూవీ టీమ్ పూర్తి నమ్మకంతో ఉన్నారు.

## 'తీరం' టైటిల్ సాంగ్ విడుదల

**వుదయం సినిమా:** హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో శ్రీ భవానీ క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న భావోద్వేగ ప్రధాన చిత్రం 'తీరం' టైటిల్ సాంగ్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'పుష్ప' ఫేమ్ నటుడు జగదీష్, ఫన్ బకెట్ మహేష్ విట్ట, నటుడు రాజ్‌కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం, నటుడు కుమానన్ తదితరులు హాజరై టైటిల్ సాంగ్‌ను ఆవిష్కరించారు.



## 'కొరియన్ కనకరాజు'లో చాలా మోడరన్ క్యారెక్టర్ చేశా..

**వుదయం సినిమా:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సందర్భంగా హీరోయిన్ రితిక నాయక్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

–కొరియా వెళ్ళడం నన్ను మొదట ఆకట్టుకుంది. (నవ్వుతూ) ఎందుకంటే నాకు కొరియన్ కల్చర్, అక్కడి సినిమాలు, కొరియన్ డ్రామాలు అంటే చాలా ఇష్టం.

**కథల ఎంపిక విషయంలో మీరు చాలా సెలెక్టివ్‌గా ఉంటారా?**

–అవును. నాకు చాలా ఓపిక ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం ఎంతకాలమైనా ఎదురుచూడగలను.

**ఈసినిమాలో మీపాత్ర ఎలా ఉండబోతోంది?**

–ఈ సినిమాలో నేను సెల్ఫ్ ఇండిపెండెంట్, చాలా మోడరన్ అమ్మాయిగా కనిపిస్తాను.

**వరుణ్ తేజ్తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?**

–వరుణ్ తేజ్ చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తన వృత్తి పట్ల ఎంతో డెడికేషన్ ఉంటుంది.హారర్ కామెడీలు చాలా వచ్చినప్పటికీ, ఇందులోని కథ, ఇండియన్–కొరియన్ కల్చర్స్ అంశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి.

**హారర్ కామెడీ జోనర్‌లో 'కొరియన్ కనకరాజు' ఎంత డిఫరెంట్‌గా ఉండబోతోంది?**

–ఈ సినిమా కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంటుంది.

**షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పండి?**

–అనంతపురంలో కొంత భాగం షూటింగ్ చేశాం. అలాగే కజకిస్థాన్, కొరియాలో షూటింగ్ చేశాం.



హీరోయిన్ రితిక నాయక్